అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 28-05-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 148 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50

తెలంగాణ అధికారిక చిహ్నం ఖరారు

తుది మెరుగులు దిద్దుతున్న ప్రముఖ చిత్రకారులు రుద్ర రాజేశం

- పలు మార్పులు సూచించిన సీఎం
- జూన్ 2న ఆవిష్కరణకు సిద్ధం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అధికారిక చిహ్నం దాదాపు ఖరారైంది. ప్రముఖ చిత్రకారులు రుద్ర రాజేశం ఈ చిహ్నానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఇందుకు సంబంధించి రూపొందించిన 12 నమూనాల్లో ఒకదాన్ని ఆయన ఖరారు చేశారు. ఎంపిక చేసిన ...15లో

దేశానికే కేరళ ఆదర్శం

మతోన్మాదులపై పోరాటంలో ముందడుగు.. వారిని నిలువరించడంలో గొప్ప స్ఫూర్తి

- భారతీయ సమాజ మనుగడ ఎలా ఉండాలో చెబుతున్న మలయాళ సమాజం : పుస్తకావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేరళ తరహా రాజకీయాలు ప్రస్తుతం దేశానికి చాలా అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సైద్ధాంతికంగా ఎన్ని వైరుధ్యాలున్నప్పటికీ అక్కడి రాజకీయ పార్టీలు, ప్రజలు మతోన్మాదులకు మాత్రం అవకాశమివ్వలేదని కొనియాడారు. సోమవారం కేరళలోని కోజికోడ్‌లో ఇండియన్ యూనియన్ ముస్లీం లీగ్ (ఐయూఎంఎల్) కేరళ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్నేహ సదస్సు'లో రేవంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సయ్యద్ సాదిఖలీ షొహిబ్ తంగల్ రాసిన 'స్నేహ సదస్సు' పుస్తకాన్ని ఆయన ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేరళ ప్రజలు మతోన్మాదులను ఏ మాత్రం భరించరనీ, తమ నాయకుడు ఈ రాష్ట్రం నుంచే పోటీ చేస్తున్నారని చెప్పారు. కేరళలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడుతూ ఇండియా అలయెన్స్‌కు మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. ఐయూఎంఎల్ గత 40 ఏండ్లుగా కాంగ్రెస్ వెంటే ఉందనీ, ఇలాంటి నమ్మకమైన స్నేహితుడు పక్కన ఉంటే మోడీ అయినా, అంతకు మించిన మతోన్మాదినైనా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రేమతో నిండిన మార్కెట్‌లో ద్వేషమనే దుకాణాన్ని తెరిచేందుకు మతోన్మాదులు ప్రయత్నిస్తున్న సమయంలో స్నేహ సదస్సును నిర్వహించడం, అదే సందేశంతో పుస్తకాన్ని విడుదల చేయడంపట్ల సీఎం ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. మతోన్మాదులపై పోరాటానికి సంబంధించి తాను కేరళ నుంచి నేర్చుకోవాలను కుంటున్నట్టు ...6లో



నెహ్రూకు ఘన నివాళి

మాజీ ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు నివాళులర్పించారు. సోమవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎమ్మెల్యే శ్రీహరి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్త హంగులు

ఉద్యోగ ఖాళీల భర్తీకి సన్నాహాలు

- రిజిస్ట్రేషన్లకు వచ్చే వారికి సకల సౌకర్యాలు
- ఆదాయం పెరిగేలా అన్ని రకాల చర్యలు
- అంతర్గత సమావేశంలో అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ హంగులతో అధునాతనంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సంబంధిత అధికారుల తో అంతర్గత సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ శాఖ పని తీరు, మౌలిక వసతులు, ఉద్యోగ ఖాళీలు తదితర అంశాలను ఈ సందర్భంగా సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఖజానాకు పెద్ద మొత్తంలో ...15లో

జూన్ రెండున కార్నివాల్

అన్ని కళారూపాలతో పెద్ద ఎత్తున ప్రదర్శనలు

- ఐదు వేల మంది పోలీసులతో బ్యాండ్ ప్రదర్శన
- ట్యాంక్‌బండ్‌పై 80 స్టాళ్ల ఏర్పాటు
- ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు
- పరేడ్ మైదానంలో రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించనున్న సీఎం

ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా జూన్ రెండున హైదరాబాద్ లోని ట్యాంక్‌బండ్‌పై రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అన్ని రకాల కళారూపాలతో పెద్ద ఎత్తున కార్నివాల్‌ను నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ...15లో

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు

జూన్ 1నుంచి మూడ్రోజులు నిర్వహణ

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ ఒకటి, రెండు, మూడు తేదీల్లో మూడు రోజులపాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు. జూన్ ఒకటో తేదీన గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద గల అమరజ్యోతి వరకు సాయంత్రం ఏడుగంటలకు ...6లో

ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతం

సాయంత్రం 4 గంటల వరకు 68.65 శాతం పోలింగ్

- బ్యాలెట్ బాక్సుల్లో నేతల భవితవ్యం
- జూన్ 5న ఫలితం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటల వరకు 68.65 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ ...15లో

ఈసారి అధిక వర్షాలే..

- కేరళకు సకాలంలోనే రుతుపవనాలు
- దక్షిణ భారతంలో భారీ వానలే: భారత వాతావరణ శాఖ అంచనాలు



న్యూఢిల్లీ : ఈ వర్షాకాలంలో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) సోమవారం తెలిపింది. దేశంలో అత్యధికంగా వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేసే ప్రాంతాలు ఈసారి రుతుపవనాల సీజనులో అధిక వర్షపాతాన్ని నమోదు చేస్తాయని భావిస్తున్నారు. ఈశాన్య భారతదేశంలో ఈసారి సాధారణం కంటే తక్కువగానే వర్షాలు పడతాయని భావిస్తుండగా, వాయవ్య భారతంలో సాధారణంగా, మధ్య, దక్షిణ భారతాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు ...15లో

ఫోన్‌ట్యాపింగ్ కేసులో సంచలనం

'ఐ న్యూస్' శ్రవణ్‌రావుతో హరీశ్‌రావు కుమ్మక్కు

- ఫోన్‌ట్యాపింగ్‌లో మాజీ మంత్రి కీలక పాత్ర
- బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న పార్టీల నాయకులపై నిఘా
- బీఆర్ఎస్ కీలక నాయకుల ఆదేశాల మేరకే ఈ చర్యకు పాల్పడ్డాం : రాధాకిషన్‌రావు, భుజంగరావు
- తమ వాంగ్మూల పత్రంలో కీలకాంశాలు వెల్లడి



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఇంతకాలం దోబూచులాడుతూ వస్తున్న ఈ ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ రాజకీయ ప్రముఖుల పేర్లు నిందితుల వాంగ్మూల పత్రంలో బయటపడ్డాయి. ఈ కేసులో కీలకపాత్రధారిగా వ్యవహరించిన ఐన్యూస్ సీఈఓ శ్రవణ్‌రావు.. మాజీ మంత్రి హరీశ్‌రావు అండదండలతో చెలరేగిపోయి విచ్చలవిడిగా ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు ఈ కేసులో నిందితులైన మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీ భుజంగరావు దర్యాప్తు అధికారులకు ఇచ్చిన వాంగ్మూల పత్రంలో వెల్లడించారు. ఇవేగాక, అనేక మంది ప్రతిపక్ష రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి బ్యూరోక్రాట్లు, వ్యాపారవేత్తలతో పాటు మీడియా సంస్థలకు చెందిన చైర్మెన్ల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్టు అంగీకరించారు.

'పెద్దాయన' ఆదేశాల మేరకు..

బీఆర్ఎస్ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్లదల్చుకున్న ఎమ్మెల్యేల ఫోన్లను ట్యాపింగ్ చేసి, వాళ్లను బ్లాక్‌మెయిల్ చేసినట్టుగా కూడా వారు తెలిపారు. అలాగే, మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులుగా చెప్పబడే రాధాకిషన్‌రావు, భుజంగరావులు తాము పెద్దాయన(కేసీఆర్) ఆదేశాల మేరకు ప్రతిపక్ష నాయకుల పైనా ఫోన్‌ట్యాపింగ్ ద్వారా నిఘా వేసి ఉంచినట్టు వెల్లడించారు. రాధాకిషన్‌రావు, భుజంగరావు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం.. గత నాలుగేండ్లలో రాష్ట్రంలో ...6లో

జీడీపీ మందగింపు

మార్చి త్రైమాసికంలో 6.7 శాతమే..!

- డిమాండ్ లేమి ఎఫెక్ట్
- వృద్ధి అంచనాల్లో కోత
- సంస్కరణలంటూ.. దాడుల పెంపు



బెంగళూరు : ప్రధాని మోడీ పదేండ్ల పాలనలోని చివరి త్రైమాసికం జీడీపీ గణంకాలు విస్తుగొలపనున్నాయి. ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం.. "భారత ఆర్థిక వ్యవస్థ మందగించింది. డిమాండ్ లేమితో గడిచిన జనవరి - మార్చి త్రైమాసికంలోని జీడీపీ వృద్ధి ఏడాదిలోనే అతి కనిష్ట స్థాయికి పడిపోనుంది. ఇంతక్రితం డిసెంబర్ త్రైమాసికంలోని పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం లేదు." గడిచిన 2024 జనవరి - మార్చి ...7లో

ఎలా బాగుచేద్దాం?

మేడిగడ్డను సందర్శించిన ఇంజినీరింగ్ చీఫ్ బృందం

- బ్యారేజీ పునరుద్ధరణ పనుల పరిశీలన
- వర్షాకాలం కన్నా ముందే పనులు పూర్తి చేయాలి: ఎన్‌డీఎస్‌ఏ



నవతెలంగాణ-మహదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధి కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీని ఇంజినీరింగ్ చీఫ్ బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాల మేరకు ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఆరుగురు సభ్యుల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి క్షేత్ర స్థాయిలో ...15లో

నాట్కో ఫార్మా లాభాల్లో 40% వృద్ధి

హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న నాట్కో ఫార్మా ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 40.1 శాతం వృద్ధితో రూ.386 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.275 కోట్ల లాభాలు ఆర్జించింది. గడిచిన క్యూ4లో రెవెన్యూ 19 శాతం పెరిగి రూ.1,068 కోట్లుగా నమోదయ్యింది. కాగా.. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయం 46.8 శాతం వృద్ధితో రూ.4,126.9 కోట్లుగా.. నికర లాభాలు 94 శాతం పెరిగి రూ.1,388 కోట్లుగా చోటు చేసుకుంది.

ఐటిసి నుంచి ఇంటిగ్రా ఎసెన్షియాకు తొలి ఆర్డర్

హైదరాబాద్ : ఎఫ్ఎంసిజి సంస్థ ఇంటిగ్రా ఎసెన్షియాకు తొలిసారి ఐటిసి గ్రూప్ నుంచి ఆర్డర్ దక్కింది. ఐటిసి అగ్రి డివిజన్‌కు 500 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయనున్నట్లు ఇంటిగ్రా ఎసెన్షియా తెలిపింది. ఐటిసి నుంచి తొలి ఆర్డర్‌ను అందుకున్నందుకు సంతోషంగా ఉందని ఆ సంస్థ పేర్కొంది. తదుపరి 15 రోజుల సమయంలోనే ఆర్డర్ సర్వీసు చేయబడుతుందని తెలిపింది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల వ్యాపారంలో ఐటిసి అగ్రో బిజినెస్ రెండో స్థానంలో ఉంది.

డెన్వర్‌కు మహేష్‌బాబు సరికొత్త ప్రచారం



హైదరాబాద్ : ప్రముఖ పురుషుల పర్‌ఫ్యూమ్ బ్రాండ్ అయిన డెన్వర్ హీరో మహేష్ బాబుతో సరికొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. విలువల కంటే విజయాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చే ధృక్పతంతో తాజా ప్రకటన మార్పును ప్రోత్సహిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. సామాజిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పుతుందని హామిల్టన్ సైన్సెస్ ఎండి, సిఇఒ సౌరభ్ గుప్తా పేర్కొన్నారు.

రిటైర్డ్ ఎస్ఈ ఎన్.రంగారెడ్డి మృతి

సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

నీటి పారుదల ప్రాజెక్టుల సలహాదారుడు, రిటైర్డ్ ఎస్ఈ ఎన్.రంగారెడ్డి సోమవారం కన్నుమూశారు. పాలమూరు జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయన విశేష కృషి చేశారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయల్‌సాగర్, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఏఎమ్మార్, ఎస్ఎల్‌బీసీప్రాజెక్టుల్లోనూ ఆయన కీలకంగా పనిచేశారు. రంగారెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయటానికి ఇటీవలే ఆయనను సలహాదారుగా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇరిగేషన్ విభాగానికి ఆయన అందించిన సలహాలు సూచనలు విలువైనవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.రంగారెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.



సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఎఫ్55 5జి

ధర రూ.24,999

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా పవర్‌ఫుల్ స్నాప్‌డ్రాగన్ 7జెనరేషన్ ప్రాసెసర్‌తో గెలాక్సీ ఎఫ్55 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. సోమవారం న్యూఢిల్లీలో దీనిని ఆ కంపెనీ సీనియర్ అధికారులు సూన్ చొయి, రాజు పుల్లన్, ఆదిత్య బబ్బర్ ఆవిష్కరించారు. దీని ప్రారంభ ధరను రూ.24,999గా నిర్ణయించింది. వెనుక వైపు 50 ఎంపి ఒఐఎస్ కెమెరా, 45 వాట్ సూపర్‌ఫాస్ట్ చార్జింగ్, సూపర్ అమోలెడ్ ప్లస్ 120హెచ్‌జడ్ డిస్‌ప్లే ఫీచర్లు కలిగి ఉంది.

APARNA
Lead the future

వినోద, రిటైల్ రంగాల్లోకి అపర్ణ కన్‌స్ట్రక్షన్స్

హైదరాబాద్ : అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ తమ వ్యాపార విభాగాలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. కొత్తగా రిటైల్, వినోద రంగాలలో ప్రవేశం కోసం రూ.284 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు వెల్లడించింది. రిటైల్ రంగంలో విస్తరణ కోసం రూ.252 కోట్లు పెట్టుబడితో తమ మొదటి మాల్ అపర్ణ నియోను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. వినోద విభాగంలోకి ప్రవేశించడానికి రూ.32 కోట్ల వ్యయంతో అపర్ణ సినిమాస్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల ప్రాంతంలో ఉన్న అపర్ణ నియో 3.67 ఎకరాలలో 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉందని ఆ సంస్థ ఎండి రాకేష్ రెడ్డి తెలిపారు. 1990 నుండి అపర్ణ గ్రూప్ వివిధ రకాల వ్యాపార విభాగాలలో ప్రవేశిస్తుండటం ద్వారా తమ పోర్ట్‌ఫోలియోను స్థిరంగా విస్తరిస్తుందన్నారు. అపర్ణ నియో మాల్‌ను మే 31న సందర్శకుల కోసం తెరువనున్నామన్నారు.

వంద పైగా పంటలకు బీమా

క్షేమ నుంచి సుకృతి ప్లాన్

న్యూఢిల్లీ: తమ సుకృతి ప్లాన్‌తో 100 పైగా పంటలకు బీమా పొందవచ్చని క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ తెలిపింది. ఈ ప్లాన్ 20 పైగా రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తమ యాప్‌లో ఎకరాకు రూ.499 నుంచే పంట బీమా పాలసీని కొనుగోలు చేయవచ్చని ఆ సంస్థ చీఫ్ అండర్ రైటింగ్ ఆఫీసర్ సివి కుమార్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో తొలి విడతలో భాగంగా 23.2 లక్షల ఎకరాల సాగు భూమిని కలిగి ఉన్న 9.40 లక్షల మంది రైతులకు సుకృతి అందుబాటులో ఉంటుందన్నారు.

ఒక పక్క ఓట్లు..
మరో పక్క అరెస్టులు

- ప్రధాని మోడీ పర్యటనలో అన్నదాతల ఇక్కట్లు
- దాడులు, గృహ నిర్బంధాలతో పంజాబ్ రైతన్నల ఆగ్రహం



చండీగఢ్ : బారికేడ్లు, గృహనిర్బంధాలు, రైతు సంఘాల నాయకుల అరెస్టుల మధ్య ప్రధాని మోడీ పంజాబ్‌లో పర్యటించారు. గురుదాస్‌పూర్, జలంధర్ లోక్‌సభ నియోజకవర్గాలలో ఎన్నికల ర్యాలీలలో పాల్గొన్నారు. తన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఓటర్లను కోరుతూ ఇటీవల పర్యటనను ముగించారు. అయితే, ప్రధాని పర్యటన నేపథ్యంలో తమను అదుపులోకి తీసుకోవటం, గృహ నిర్బంధాలు, అరెస్టులు జరపటం వంటి చర్యలపై అక్కడి అన్నదాతలు ఆగ్రహంతో ఉన్నారు. ఒకపక్క, ఓట్లు కోరుతూ.. మరోపక్క ఈ అరెస్టులు ఏమిటనీ వారు ప్రశ్నిస్తున్నారు.

ఎన్నిల ఆంక్షలున్నా.. రైతులు మాత్రం తమ నిరసనలను ఆపలేదు. నల్ల జెండాలు పట్టుకుని నిరసనలు తెలిపారు. గురుదాస్‌పూర్‌లో చేసిన ప్రసంగంలో మోడీ ఒక్కసారి మాత్రమే రైతుల గురించి ప్రస్తావించారు. జలంధర్‌లో రైతుల గురించి మాట్లాడకపోవటం గమనార్హం.

ఉదయం నుంచి పంజాబ్ పోలీసులు, ఇతర భద్రతా దళాలు గురుదాస్‌పూర్, జలంధర్, అమృత్‌సర్, కపుర్తలా, నవాన్‌షహర్ , ఫరీద్‌కోట్ జిల్లాల్లోని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా రైతు నాయకుల ఇండ్లకు చేరుకోవడం ప్రారంభించాయి. పలువురు రైతులను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచగా, మరికొందరిని ర్యాలీ వేదికల వద్దకు రానీయకుండా నిర్బంధించారు. గురుదాస్‌పూర్‌లో రైతుల గురించి ప్రధాని మాట్లాడుతూ.. "కాంగ్రెస్, ఆప్ దేశ భవిష్యత్తును ఫణంగా పెడుతున్నాయి. వారు పంజాబ్ భవిష్యత్తును ఫణంగా పెట్టారు. పంజాబ్‌లో, డ్రగ్స్ యువతను నాశనం చేస్తున్నది. నేరస్థులకు రాష్ట్ర ప్రభుత్వ మద్దతు లభించింది. అభివృద్ధి నిలిచిపోయింది. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు" అన్నారు. పంజాబ్ రైతులను మిల్లెట్‌లను పండించాలని కోరిన మోడీ.. తన ప్రభుత్వ పథకం నుంచి ప్రయోజనం పొందాలని కోరారు.

గత పదేండ్లలో తమ ప్రభుత్వం పంజాబ్ నుంచి రికార్డు స్థాయిలో గోధుమలు, వరిని ఎలా కొనుగోలు చేసిందని కూడా ప్రధాని ప్రస్తావించారు. ముఖ్యంగా, గురుదాస్‌పూర్‌లో మోడీ కాషాయ పార్టీ అభ్యర్థుల కోసం ఎన్నికల ర్యాలీలు నిర్వహించారు.

వ్యవసాయాధారిత రాష్ట్రమైన పంజాబ్‌లో మోడీ పర్యటనను ప్రశ్నిస్తూ కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) కో-ఆర్డినేటర్, కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ అధ్యక్షుడు సర్వన్ సింగ్ పంధేర్‌లు ఒక ప్రకటనలో మోడీని ప్రశ్నించారు. గతంలో రైతుల నిరసనల డిమాండ్లను ఆమోదించకపోవటం, ఎంఎస్పీ, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుపై ప్రశ్నలు సంధించారు. మోడీని ప్రశ్నించకుండా రైతులను నిలదీసిన తీరు.. ప్రపంచంలోని అత్యుత్తమ ప్రజాస్వామ్య దేశాల జాబితాలో భారత్ అట్టడుగు స్థానంలో ఉండడానికి కారణమని ముద్ర వేసిందని యూనియన్ నేతలు అన్నారు. 'రైతులపై మోడీ ప్రసంగాలు విరుద్ధంగా ఉన్నాయి. దేశంలో దాదాపు 80 నుంచి 100 కోట్ల మంది రైతులు, రైతు కూలీలు ఉన్నారు. రైతుల కష్టాలు తీర్చేందుకు మోడీ ఏమీ చేయకపోగా.. అన్నీ కార్పొరేట్లకు అప్పగిస్తే ఏం మాట్లాడగలడు? రైతుల కోసం ఏం చేశారో చెప్పాలి. ఈ పరిణామాల నేపథ్యంలో మే 28న పంజాబ్‌లోని బీజేపీ అభ్యర్థుల నివాసాలను ఘెరావ్ చేయాలని నిర్ణయించుకున్నామని రైతు నేతలు చెప్పారు.

ప్రధానితో తమ సమావేశాన్ని సులభతరం చేయాలని రైతు నాయకులు బీజేపీ పంజాబ్ నాయకత్వాన్ని, పంజాబ్ పోలీసు అధికారులను అభ్యర్థించినప్పటికీ అలా చేయలేదని వారు అన్నారు.


మోడీ పర్యటనలో ఈ పరిణామాలను ఖండిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) నాయకుడు రమీందర్ సింగ్ పాటియాలా ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రధాని మోడీ నైతిక ఓటమిని తెలియజేస్తున్నదన్నారు. "ఎన్నికల్లో అణచివేతకు సంబంధించిన రాజకీయ పరిణామాలను ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉండాలి. గృహ నిర్బంధాలతో పాటు, మా కీర్తి కిసాన్ యూనియన్ కార్యాలయాన్ని కూడా జలంధర్‌లోని పోలీసులు సీలు చేశారు" అని ఆయన చెప్పాడు.

భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) రాజేవాల్, దోబా కిసాన్ సంఘర్ష్ కమిటీ సభ్యులను నిర్బంధించగా, జంహూరీ కిసాన్ సభ, ఆల్ ఇండియా కిసాన్ మజ్దూర్ సభలను పంజాబ్ ఆర్మ్‌డ్ పోలీస్ (పిఏపి) గ్రౌండ్‌లోని ప్రధాని మోడీ ర్యాలీ వేదిక వద్దకు చేరుకోకుండా జలంధర్‌లో అడ్డుకున్నారని రమీందర్ తెలిపారు. ఫరీద్‌కోట్ జిల్లాలో కీర్తి కిసాన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిందర్ సింగ్ దీప్ సింగ్ వాలా నివాసంలో కూడా పోలీసులు దాడులు నిర్వహించారు.

హిందీ రాష్ట్రాల్లో
బీజేపీకి దూరమవుతున్న బీసీలు, దళితులు
పెరిగిన అసంతృప్తి...అసమ్మతి

వాస్తవాలు గ్రహించిన ప్రజానీకం

ఎదురు దెబ్బలే



లక్నో/పాట్నా : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చివరి విడతగా బీహార్‌లో జూన్ 1వ తేదీన ఎనిమిది స్థానాల్లో పోలింగ్ జరుగుతుంది. అటు ప్రధాని నరేంద్ర మోడీ, ఇటు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించేందుకు తుది ప్రయత్నాలు చేస్తున్నారు. మోడీ ప్రచార సభలు అట్టహాసంగా సాగుతుండగా తేజస్వి సభలు సాదాసీదాగా జరుగుతున్నాయి. ఆయన సభల్లో ఎలాంటి హంగూ ఆర్భాటాలు కన్పించడం లేదు. బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన బస్సులు, ఇతర వాహనాల్లో ప్రజలు మోడీ సభలకు వస్తుంటే తేజస్వి సభలకు మాత్రం కాలినడకన, సైకిళ్లపై చేరుకుంటున్నారు.

టీ పేరుతో 2014 ఎన్నికల్లో, సర్జికల్ స్ట్రయిక్ పేరుతో 2019 ఎన్నికల్లో మోడీ ఓట్లు దండుకున్నారని తేజస్వి సభకు హాజరైన ఓ యువకుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇప్పుడు రామమందిరం పేరుతో ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నారని మండిపడ్డాడు.

విజయావకాశాలకు విఘాతమే

అయితే ఇదంతా గతం. ఇప్పుడు బీజేపీ కోట బీటలు వారింది. దేశంలోనే అత్యంత పేద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్‌లో మోడీపై విమర్శలు బాగానే వినిపిస్తున్నాయి. హిందువుల పేరు చెప్పి రాజకీయాలు చేయడం మినహా మోడీ చేసిందేమిటని ప్రజలు నిలదీస్తున్నారు. 'కాంగ్రెస్ గెలిస్తే మీ ఎడ్లను తీసుకుపోతారని మోడీ చెబుతున్నారు. అవన్నీ చెత్త మాటలు. కాంగ్రెస్ 60 ఏండ్లు అధికారంలో ఉంది. ఎవరి ఎడ్లను తీసుకుంది?' అని ఓ రైతు ప్రశ్నించాడు. గత దశాబ్ద కాలంగా బీజేపీ పక్షాన నిలిచిన దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజల్లో ఇప్పుడు మార్పు కన్పిస్తోంది. అయితే అది ఎంత మేరకు అనేది చెప్పడం కష్టమే. ఆయా వర్గాల్లో వచ్చిన మార్పు బీజేపీ విజయావకాశాలను పూర్తిగా దెబ్బతీయలేక పోయినప్పటికీ కొంత మేర నష్టం కలిగించడం మాత్రం తథ్యం.

ధర్మం (మతం) పేరిట రాజకీయం చేసిన వ్యక్తి అధర్మానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తాడు. 'తాను పేద కుటుంబం నుండి వచ్చానని, పేదల కోసం పని చేస్తానని మోడీ చెబుతారు. ఆయన మనలను వెర్రివాళ్లను చేస్తున్నారు' అని విమర్శించాడు. ఆ యువకుని ఆగ్రహం బీహార్ ప్రజల్లో మోడీ పట్ల పెల్లుబుకుతున్న వ్యతిరేకతను ప్రతిబింబిస్తోంది.



మాటలు నమ్మి ఓటేశారు

2014 ఎన్నికల్లో 'అచ్చేదిన్' హామీతో మోడీ అధికారంలోకి వచ్చారు. అయితే అది కేవలం హామీ మాత్రమే కాదు. ఆయనే అందుకు గ్యారంటీ ఇచ్చారు. వెనుకబడిన కులంలో జన్మించి, ఓ రాష్ట్రానికి సమర్థుడైన ముఖ్యమంత్రిగా ఎదిగారంటూ మోడీకి అనుకూలంగా అప్పుడు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అవినీతి రక్కసి నుండి దేశాన్ని కాపాడేందుకే ఆయన జాతీయ రాజకీయాల్లో ప్రవేశించారని గొప్పగా చెప్పారు.

ఈ మాటలు నమ్మిన హిందీ రాష్ట్రాల్లోని వెనుకబడిన తరగతుల ప్రజలు పెద్ద సంఖ్యలో బీజేపీకి ఓటేశారు. ముఖ్యంగా మౌర్య కులస్తులు ఆ పార్టీకి బాసటగా నిలిచారు. సంప్రదాయబద్ధంగా అగ్రకులాల ఓట్లు కూడా ఆ పార్టీ ఖాతాలోనే పడ్డాయి. ఫలితంగా యూపీలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీకి ఏకంగా 71 సీట్లు వచ్చాయి. బీహార్‌లో 40 స్థానాలు ఉండగా 31 స్థానాలు కమలానికే దక్కాయి.

యూపీలో పెరిగిన బలం

తర్వాతి కాలంలో బీజేపీ తన నేర్పరితనంతో బలాన్ని మరింత పెంచుకుంది. ఉత్తరప్రదేశ్‌లో యాదవేతర వెనుకబడిన వర్గాలను, దళితులైన జాతవేతర వర్గాలను మచ్చిక చేసుకొని ఆయా నాయకులకు మరింత ప్రాతినిధ్యం కల్పించింది. తద్వారా బలమైన సామాజిక కూటమిని ఏర్పాటు చేసుకుంది. ఫలితంగా యాదవులపై ఆధారపడిన సమాజ్‌వాదీ పార్టీ, దళితులపై ఆధారపడిన బీఎస్పీ బాగా దెబ్బతిన్నాయి. అయితే బీహార్‌లో మాత్రం గట్టి ప్రతిఘటన ఎదురైంది. దీంతో నితీష్ కుమార్ నేతృత్వంలోని ఐక్య జనతాదళ్, ఇతర చిన్న చిన్న పార్టీలతో జట్టు కట్టింది. వెనుకబడిన తరగతులు, దళితుల్లో బలాన్ని పెంచుకుంది.

అల్ప సంతోషులు

కుల రాజకీయాలకు తోడు గ్రామీణ కుటుంబాల కోసం నగదు బదిలీ పథకాలు తీసుకురావడంతో అవి కూడా బీజేపీని సమర్థించాయి.

ఇళ్లు, మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి, వంట గ్యాస్ కొనుగోలు చేయడానికి నగదు బదిలీలు చేశారు. రైతులకు కూడా ఇదే రకంగా సాయం అందించారు.

వీటన్నింటికీ ప్రధానమంత్రి యోజన లేదా ప్రధానమంత్రి పథకాలు అనే పేరు పెట్టారు.

కోవిడ్ సమయంలో నెలవారీ ఆహార రేషన్‌ను కేంద్రం రెట్టింపు చేసింది. దీనికి కూడా ప్రధానమంత్రి పథకం పేరే పెట్టింది. వాస్తవానికి మోడీ ప్రభుత్వ పాలనలో సంక్షేమంపై పెట్టిన ఖర్చు తక్కువే.

అయితే వ్యక్తిగత ప్రచారం, మీడియా సహకారం కారణంగా గ్రామీణ పేదలు ఆయనను విశ్వసించారు. ప్రభుత్వం విదిల్చిన కొద్దిపాటి సాయానికే అల్ప సంతోషులైన పేదలు పొంగిపోయి మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

రగులుతున్న అసంతృప్తి

హిందీ రాష్ట్రాలకు చెందిన వారు ఇప్పుడు ప్రధానంగా ద్రవ్యోల్బణం, నిరుద్యోగం గురించే మాట్లాడుకుంటున్నారు. 2014లో బీజేపీకి ఓటేసిన వారు ఆ తర్వాత ఐదు సంవత్సరాల కాలంలో కొంత అసంతృప్తికి గురైనప్పటికీ మరో అవకాశం ఇద్దామన్న ఉద్దేశంతో 2019లో కూడా ఆ పార్టీకే మద్దతు ఇచ్చారు. మోడీ పాలనలో ధనికులు మరింత సంపన్నులు అవుతున్నారని, పేదలు నిరుపేదలు అవుతున్నారని ప్రజలు భావిస్తున్నారు.

అయోధ్యలో రామమందిర నిర్మాణం కూడా బీజేపీకి ఓట్లు రాల్చేలా కన్పించడం లేదు. 'మందిర నిర్మాణంతో ఎవరికి లాభం కలిగింది? బ్రాహ్మణులు, యాచకులు మాత్రమే ప్రయోజనం పొందారు' అని ఓ వ్యక్తి చెప్పాడు. దేశంలో రాజపుత్రులు, భూమిహారీలు, బనియాలు, పండిట్లు...ఈ నాలుగు కులాల వారు మాత్రమే బాగుపడ్డారని వెనుకబడిన వర్గాలకు చెందిన ఓ వ్యక్తి వాపోయాడు. 'మా కులంలో వంద మంది ఉంటే ఒకరో ఇద్దరో మాత్రమే ఉన్నత స్థానానికి ఎదిగారు.

మిగిలిన వారి పరిస్థితి అలాగే ఉంది' అని తెలిపాడు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ కొందరు పార్టీ నాయకులు చేసిన ప్రకటనల వీడియోలు కమలదళాన్ని ఇబ్బంది పెట్టాయి. విద్యా సంస్థలు, ప్రభుత్వోద్యోగాల్లో తమ రిజర్వేషన్లు పోతాయేమోనని దళితులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పైగా మోడీ సంక్షేమ పథకాలు తమకు పూర్తి స్థాయిలో ఉపయోగపడడం లేదన్న అసంతృప్తి ప్రజల్లో కన్పిస్తోంది.

బీజేపీ, బీఎస్పీ చేతులు కలిపాయి : అఖిలేశ్



లక్నో :బీజేపీ, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీలు రహస్యంగా చేతులు కలిపాయని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. సోమవారం ఘాజీపూర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీని ఓడించడం ద్వారా ఉత్తరప్రదేశ్ మాత్రమే దేశాన్ని రక్షించగలదని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించడానికి ఇండియా వేదికకు ఓటు వేయాలని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. 'బీజేపీ, బీఎస్పీ రహస్యంగా చేతులు కలిపినట్లు కనిపిస్తోంది. అందుకే ఈ ఎన్నికలు అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడేందుకేనని గ్రహించి, ఇండియా వేదికకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు.

మ్యానిఫెస్టో హామీలతో లబ్ధి చేకూరితే అది అవినీతి కాదు

- సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ : ఒక రాజకీయ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల వల్ల ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు ఒనగూడితే అది అవినీతి కిందకు రాదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇందుకు సంబంధించి పిటిషనర్ తరపు న్యాయవాది చేస్తున్న వాదనలు ఆమోదయోగ్యం కాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. ఒక రాజకీయ పార్టీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ఓటర్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆర్థిక లబ్ధిని పొందినట్లైతే సదరు పార్టీ అభ్యర్థి అవినీతికి పాల్పడినట్లే అవుతుందని పిటిషనర్ శ్రీధరన్ వాదించారు. అయితే ఆ వాదనలను ఏ మాత్రమూ అంగీకరించలేమని బెంచ్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. చామరాజ్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన శశాంక శ్రీధరన్ అనే ఓటరు వేసిన ఎన్నికల పిటిషన్‌ను కర్నాటక హైకోర్టు కొట్టిపారేసింది. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ శ్రీధరన్ సుప్రీంను ఆశ్రయించారు. దానిపై విచారించిన సుప్రీం బెంచ్ పై తీర్పునిచ్చింది.

ఆ యాడ్స్‌ను బీజేపీ ఆపాల్సిందే

- కలకత్తా హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమన్న సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ : తృణమూల్‌కు వ్యతిరేకంగా ప్రచురిస్తున్న అవమానకరమైన యాడ్‌లను ఆపాలంటూ బీజేపీని కలకత్తా హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆ ఆదేశాలకు వ్యతిరేకంగా బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ ఆదేశాల విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్‌కు సంబంధించి నిర్దిష్ట వాణిజ్య ప్రకటనలు ప్రచురించకుండా నిలువరించాలని బీజేపీని ఆదేశిస్తూ కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ యాడ్స్ ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘిస్తున్నాయని, అప్రతిష్టపాల్జేసేలా వున్నాయని జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ కె.వి.విశ్వనాథ్‌లతో కూడిన సుప్రీం వెకేషన్ బెంచ్ పేర్కొంది. 'మేం వాణిజ్య ప్రకటనలు చూశాం నిజానికి ఆ యాడ్‌లు చాలా అవమానకరంగా వున్నాయి. మీరు మంచివారని మీరు చెప్పుకోవచ్చు, కానీ మరింత దారుణాన్ని పెంపొందించేందుకు మేం సాయం చేయాలనుకోవడం లేదు." అని జస్టిస్ విశ్వనాథ్ పేర్కొన్నారు. వాస్తవాల ఆధారంగా ఆ వాణిజ్య ప్రకటనలు రూపొందాయంటూ బీజేపీ తరపున సీనియర్ న్యాయవాది పి.ఎస్.పట్వాలియా చేసిన వాదనలను కొట్టిపారేశారు. 'ఇవేమీ ఓటర్లకు ఉపయోగపడేది కావు, దిగజార్చేవి." అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. "ఇంక ఈ విషయాన్ని పదే పదే ప్రస్తావించకండి, దీంట్లో మేం జోక్యం చేసుకోవాలనుకోవడం లేదు." అని జస్టిస్ మహేశ్వరి స్పష్టం చేశారు.

మోడీ సంక్షేమరాజ్యం అంటే ఇదే...!

- బడ్జెట్ అదే...పథకాలే బోలెడు
- అవి కూడా కొందరికే పరిమితం
- విద్య, ఆరోగ్యంపై చిన్నచూపు
- ఓట్ల కోసం ఉచిత తాయిలాల ఎర


న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరం దాదాపు చివరి దశకు చేరుకుంది. మరో విడత పోలింగ్ మాత్రమే మిగిలి ఉంది. దీంతో ఇప్పుడు అందరి అంచనాలూ ఎన్నికల ఫలితాల పైనే. ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వస్తారని మెజారిటీ సర్వేలు చెబుతున్నాయి. ఇందుకు అవి ప్రధానంగా రెండు కారణాలు చూపుతున్నాయి. విశ్వగురు విజన్, నిర్ణయాత్మక నాయకత్వం, వేగవంతమైన అభివృద్ధి...ఈ మూడు కారణాలు మోడీ విజయానికి బాటలు వేస్తాయని కొందరు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని వ్యవస్థలనూ హైజాక్ చేయడం, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడం, మతపరమైన భావాలను రెచ్చగొట్టడం, ప్రభుత్వ విజయాలను గోరంతలు కొండంతలు చేసి చూపడం...ఇవి మోడీ విజయానికి ఉపకరిస్తాయని మరి కొందరు అంచనా వేస్తున్నారు. కానీ వాస్తవాలేమిటి?

పథకాలకు కొత్త సొగబులు

2014 ఎన్నికల సమయంలో మోడీ ఓ నినాదం ఇచ్చారు. అదే 'గరిష్ట పాలన...కనీస ప్రభుత్వం'. మోడీ తన పాలనలో ఉజ్వల కింద గ్యాస్ సిలిండర్లు ఇచ్చారు. స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్లు నిర్మించారు. జల్ జీవన్ కింద నీటి కనెక్షన్లు మంజూరు చేశారు. పీఎం ఆవాస్ కింద ఇళ్లు నిర్మించారు. పీఎం-కిసాన్ కింద నగదు బదిలీ చేశారు. పీఎం గరీబ్ కల్యాణ్ యోజన కింద ఆహారధాన్యాలు అందించారు. పీఎం జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించారు. వీటిలో ఎక్కువ పథకాలు ఉచితంగానో లేదా సబ్సిడీ ధర పైనో ఇచ్చినవే. ఇవన్నీ చూడడానికి బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వానికి డబ్బు ఎక్కడి నుండి వచ్చింది అన్నదే ఇక్కడ ప్రశ్న. ఎందుకంటే అంతకుముందు దశాబ్ద కాలంతో పోలిస్తే గత పది సంవత్సరాల్లో దేశ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది.

వ్యయం పెరగలేదు

పది సంవత్సరాల యూపీఏ ప్రభుత్వ పాలనలో వార్షిక వృద్ధి రేటు 6.14% ఉంటే ఎన్డీఏ పాలనలో 4.86% మాత్రమే ఉంది. 2013 బడ్జెట్ పత్రాలను పరిశీలిస్తే యూపీఏ ప్రభుత్వం తన వార్షిక వ్యయంలో దాదాపు 27% సబ్సిడీలు, గ్రామీణ ఉపాధి, మధ్యాహ్న భోజనం, సమీకృత శిశుఅభివృద్ధి సేవలు, గ్రామీణ నీటి సరఫరా, ఇతర సంక్షేమ పథకాలకే వెచ్చించింది. ఎన్డీఏ ప్రభుత్వం అనేక కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ దాని హయాంలో వాటిపై వ్యయం ఏనాడూ 27% దాటలేదు. కోవిడ్ సహాయ కార్యక్రమంలో భాగంగా 2020-21లో మాత్రం ఆహార సబ్సిడీని పెంచింది. కానీ మొత్తంమీద సబ్సిడీ బిల్లు బాగా తగ్గిపోయింది. పోనీ మిగిలిన రంగాలపై ఎక్కువ ఖర్చు చేశారా అంటే అదీ లేదు. యూపీఏ కాలంతో పోలిస్తే విద్యా రంగానికి కేటాయింపులు పడిపోయాయి. ఆరోగ్య రంగానికి కొద్దిగా కేటాయింపులు పెంచినా అవి గణనీయంగా మాత్రం లేవు.



ఆర్థిక నిపుణులు ఏమంటున్నారు?

మోడీ ప్రభుత్వం ప్రాథమిక విద్య, ఆరోగ్య రంగానికి పెద్ద ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యం పెదవి విరిచారు. పైగా ప్రైవేటు రంగం అందించే అత్యవసర వస్తువులు, సేవలు...అంటే బ్యాంక్ ఖాతాలు, వంటగ్యాస్, మరుగుదొడ్లు, విద్యుత్, గృహనిర్మాణం, నీరు... వీటిపై ప్రభుత్వం సబ్సిడీలు పెంచిందని ఆయన తెలిపారు. మోడీ ఆవిష్కరించిన నూతన సంక్షేమం యూపీఏ ప్రభుత్వ వైఖరికి పూర్తి భిన్నంగా ఉన్నదని సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ మాజీ సీఈఓ యామినీ అయ్యర్ చెప్పారు. సంక్షేమం అనేది పార్టీ నాయకుడు ఇచ్చే బహుమతి అంటూ కొత్త నిర్వచనం ఇచ్చారని, దానిని ప్రజల ప్రాథమిక హక్కుగా కాకుండా రాయల్టీగా చూశారని ఆమె వివరించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని ఆర్థికవేత్త రతిన్ రాయ్ అభిప్రాయపడ్డారు. ప్రజల జీవితాలను మెరుగుపరచే వస్తువులు, సేవల లభ్యతను మెరుగుపరచడానికి బదులు ప్రభుత్వం తన వైఫల్యానికి పరిహారంగా నగదు అందిస్తోందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి అనే మాటనే ప్రభుత్వాలు మరిచిపోయాయని, అవి పరిహారం అందించే ప్రభుత్వాలుగా మారిపోయాయని చెప్పారు.

చిన్న చిన్న తాయిలాలతో...

ప్రభుత్వ ఆలోచనల్లో వస్తున్న మార్పును ఇటీవల కార్నెజ్ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన ఓ పత్రం ఆసక్తికరంగా వివరించింది. రాజకీయ నాయకులు చిన్న చిన్న తాయిలాలు ఆశ చూపి ఓట్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇస్తారు తప్పించి పెద్ద మొత్తం ఖర్చు చేసి ఎవరో ఒకరికి ప్రయోజనం కలిగించాలని భావించరని ఆ సర్వే తెలిపింది. ఉదాహరణకు ఒక్కో లబ్దిదారుడికి సుమారు వెయ్యి రూపాయల చొప్పున 200 మందికి ఆర్థిక ప్రయోజనం కల్పించి వారి ఓట్లన్నీ కొల్లగొడదామని చూస్తారే కానీ ఆ మొత్తాన్ని ఒకే వ్యక్తికి అందించి అతని ఓటు పొందరని ఆ సర్వే వివరించింది. అంటే ప్రభుత్వం తన వద్ద ఉన్న కొద్దిపాటి సొమ్మునే ఉచితాల రూపంలో అనేక మందికి పందేరాలు చేస్తుంటుంది. దీనివల్ల అటు ప్రచారమూ లభిస్తుంది. ఇటు ఓట్లూ వస్తాయి.

రాష్ట్రాల పైనే భారం

ఇక్కడ మరో విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రం అనేక సంక్షేమ చర్యలు ప్రకటిస్తుంది. వాటికి నిధులు అందిస్తుంది. అయితే ఈ నూతన సంక్షేమ పథకాలలో అనేకం రాష్ట్రాల జాబితాలో ఉంటాయి. కాబట్టి అమలులో వాటి పైనే ఎక్కువ ఆర్థిక భారం పడుతుంది. ఈ పథకాల అమలు విషయంలో కూడా రాష్ట్రాల మధ్య అనేక వ్యత్యాసాలు ఉంటాయి.

మహిళా ఓట్ల కోసం...

ఎల్పీజీ సిలెండర్లు, కుళాయిలు, మరుగుదొడ్లు వంటివి మహిళల ఓట్లను దండుకునేందుకు ఎరగా వేసిన తాయిలాలే. మహిళా సాధికారతకు పెద్దపీట వేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

పథకాలకు వీరంతా దూరమే

వివిధ పథకాల కింద ప్రయోజనం పొందేందుకు ప్రభుత్వాలు లబ్దిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ ఇప్పటికీ 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతోంది. అప్పటి నుండి ఇప్పటికి దేశ జనాభా దాదాపు 15 కోట్లు పెరిగింది. గ్రామీణ, పట్టణ జనాభా పంపిణీలో అనేక మార్పులు జరిగాయి. అయితే ఈ మార్పులేవీ పథకాల లక్ష్యంలో చోటుచేసుకోవడం లేదు. దీంతో అనేక మంది ప్రజలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. ఉదాహరణ కు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) పథకంలో మధ్యతరగతి ప్రజల ప్రస్తావనే లేదు. దిగువ మధ్య తరగతి, మధ్య-మధ్యతరగతి వర్గాలే దీని కింద ప్రయోజనం పొందుతున్నాయి. పీఎం ఆవాస్ పథకం కింద భూమి, పెట్టుబడి ఉన్న వారికే గృహ నిర్మాణానికి అవకాశం ఉంది.

పట్టణాలలో ఇళ్లు లేనివారికి ఈ పథకం వర్తించదు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌గా చికిత్స పొందే వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. ఔట్‌పేషెంట్లుగా చికిత్స పొందే వారి జేబులకే ఎక్కువ చిల్లులు పడుతుంటాయి. ఆరోగ్యంపై కుటుంబాలు పెట్టే ఖర్చులో ఈ తరహా చికిత్స ఖర్చులు 40 నుండి 80% వరకూ ఉంటాయి. కానీ పీఎంజేఏవై పథకం ఇన్‌పేషెంట్లకు మాత్రమే ఉపయోగపడుతుంది. పీఎం-కిసాన్ పథకం భూమి ఉన్న రైతులకు మాత్రమే ప్రయోజనకరం. భూమి లేని రైతన్నకు ఈ పథకంలో చోటు లేదు.

సంపాదకీయం

రుజువులేవీ?!



మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమనీ, ప్రజాస్వామ్యానికి ఇదే తల్లి వంటిదని తాజాగా జీ-20 సదస్సులో మోడీ ఢంకా బజాయించి చెప్పారు. రుజువు చేసుకునే అవకాశం రానూ వచ్చింది. పోనూ పోతోంది. రాజులు, రాచరికాలు పోయిన తర్వాత ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరపడం, పార్టీలను ఎన్నుకోవడం రివాజు. ఇదంతా హుళక్కి అని తేలిన తర్వాత మన దేశాన్ని ప్రజాస్వామ్యం అనగలమా?

> అసలీ ఏడు దశల పోలింగ్ మోడీ క్యాంపెయిన్‌కు వీలుగా ఏర్పాటైనట్టు అనేకమంది విజ్ఞులు చెప్తున్నారు. ఈసీ యొక్క 'విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయ'ని కొన్ని రాజకీయ పార్టీలను ఎన్నికల సంఘం ఆరోపిస్తున్నది. కాని ఒక కీలక విషయం గమనార్హం. ఆర్టికల్ 324 ప్రకారం అలానే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు ప్రకారం ఎన్నికలను సరిగా నిర్వహించేలా చూడటం ఎలక్షన్ కమిషన్‌దే కీలక బాధ్యత. విశ్వసనీయత రుజువు చేసుకోవాల్సింది కూడా ఈసీనే.

"గతంలో బూత్‌లు స్వాధీనం చేసుకుని ఓట్లు గుద్దుకునేవారు. ఇప్పుడు ఎన్నికల కమీషన్‌నే తన అధీనంలోకి తెచ్చుకున్న మోడీ సర్కార్‌కు ఇక ఎదురేముంది?" అని ఒక పెద్దాయన చమత్కరించారు. నిలోత్పల్ బసు అన్నట్టు ఎన్నికలస్వామ్యమే ప్రజాస్వామ్యంగా పరిగణించబడ్తోంది. దానికి ప్రధాన రిఫరీ ఎన్నికల కమిషన్! అధికారం వైపుకి ఈసీ వంగిపోతే?! ఎన్నికల నోటిఫికేషన్‌కు సరిగ్గా మూడ్రోజుల ముందు ఇద్దరు కమిషనర్లు నియమింపబడ్డారు. ఎన్నికల్లో ఏమి చెయ్యొచ్చో, ఏమి చేయకూడదో బరిగీసి చెప్పింది ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్. దాన్నే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు (ఎమ్‌సిసి) అన్నారు. 'మో-షా'లు దాన్ని పచ్చిగా అతిక్రమిస్తున్నా ఈసీ చప్పుడు చేయదు. కేంద్రం చేతిలోని నిఘా వ్యవస్థలు ఇండియా కూటమి పార్టీలపై ఉక్కుపాదం మోపుతుంటే కిమ్మనదు. ఢిల్లీ ముఖ్యమంత్రిని ఈడీ జైల్లో పెట్టినా, ఏఐసీసీ అకౌంట్‌ను ఐటీ శాఖ స్తంభింపచేసినా, కేరళ త్రిస్సూర్‌లోని సీపీఐ(ఎం) అకౌంట్‌ను స్తంభింపచేసినా, ఇవన్నీ ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకొచ్చిన తర్వాత జరిపినా ఈసీకి ఏమీ పట్టదు.

రెండవ దశ పోలింగ్ అయిపోయిన తర్వాత మొదలు పెట్టి తాజాగా ఏడవ దశ ముందు వరకు మోడీ ముస్లింలపై విద్వేషం వెళ్ళగక్కుతున్నా ఈసీకి 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా' అనే బాల మురళీ కృష్ణ పాటే దిక్కయింది. వరుసగా మొదటి, రెండో దశ పోలింగు ముగిసిన పదకొండు రోజులకు, నాలుగు రోజులకు ఓటింగ్ శాతం వివరాలు ఈసీ తన వెబ్ సైట్‌లో ఉంచింది. అది దుర్మార్గమని ఈ ఆధునిక యుగంలో 48 గంటల్లో పెట్టలేకపోవడమేమిటని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్, కామన్ కాజ్ సంస్థలు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశాయి.

అసలు పోలింగ్ ముగిసిన వెంటనే ఎన్ని ఓట్లు పోలైనాయో ప్రిసైడింగ్ ఆఫీసర్ ఫార్మ్ 17 సీని ప్రతి పార్టీ ఏజెంటుకీ ఇస్తారు. దాన్ని స్కాన్ చేసి ఈసీ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి అన్నేసి రోజులు పట్టడమేంటని రిట్ పిటిషన్‌లో ఆ రెండు స్వచ్ఛంద సంస్థలూ వాదించాయి. ఆశ్చర్యకరంగా ఈసీని తాము ఆదేశించలేమని సుప్రీంకోర్టు చేతులెత్తేసింది. ఆ రోజు పత్రికల్లో వచ్చిన వార్తలకంటే 5-6శాతం పెరిగినట్టు ఆ తర్వాత ఈసీ ప్రకటించడం ఒక ఆందోళనకర అంశం.

ఇవన్నీ ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతనే ప్రశ్నించేవి. ప్రజాస్వామ్యానికే తల్లి అని చెప్పుకోవాలంటే రేపు (జూన్ 1న) జరగబోయే ఏడవ దశ పోలింగ్ 57 సీట్లుగాని, జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియగాని సజావుగా జరగడం అవసరం. అసలీ ఏడు దశల పోలింగ్ మోడీ క్యాంపెయిన్‌కు వీలుగా ఏర్పాటైనట్టు అనేకమంది విజ్ఞులు చెప్తున్నారు. ఈసీ యొక్క 'విశ్వసనీయతను దెబ్బతీస్తున్నా య'ని కొన్ని రాజకీయ పార్టీలను ఎన్నికల సంఘం ఆరోపిస్తున్నది. కాని ఒక కీలక విషయం గమనార్హం. ఆర్టికల్ 324 ప్రకారం అలానే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు ప్రకారం ఎన్నికలను సరిగా నిర్వహించేలా చూడటం ఎలక్షన్ కమిషన్‌దే కీలక బాధ్యత. విశ్వసనీయత రుజువు చేసుకోవాల్సింది కూడా ఈసీనే.

మరో కీలకాంశం - ఉత్తరప్రదేశ్‌లో స్థానిక పోలీసులు అనేకమందికి, ముఖ్యంగా ముస్లింలకు.. వాళ్ళు ఎన్నికలకూ భంగం కలిగిస్తారనే 'రెడ్ కార్డ్'లు ఇచ్చారు. ఈ విషయం ఈసీకి తెలియదు. అసలు ఆ రెడ్ కార్డులకు సరైన రుజువులు కూడా లేవు. ఇండియా కూటమి నాయకులు అనేక వివరాలు ఈసీ ముందు పెడ్తే, ఆ విషయం తమకి తెలియదని అంగీకరించి చర్యలు తీసుకుంటామని వాగ్దానం చేశారు.

పైన లేవనెత్తిన అనేక విషయాల్లో ఈసీ తన పవిత్రతను రుజువు చేసుకోవాల్సిన అవసరముంది. అదే దానికి లిట్మస్ టెస్ట్.

మోడీ పాలనలో గ్రామీణ కార్మికుల దుస్థితి



ప్రభాత్ పట్నాయక్



వ్యవసాయ కార్మికుల నిజ వేతనాలలో కాని, తక్కిన గ్రామీణ కార్మికుల నిజ వేతనాలలో కాని 2014 -2023 మధ్య పదేళ్ళ కాలంలో ఎటువంటి వాస్తవ పెరుగుదలా నమోదు కాలేదన్న వాస్తవాన్ని అనేకమంది అధ్యయనకారులు చేసిన తాజా పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయ కార్మికుల వినిమయసూచీని, గ్రామీణ కార్మికుల వినిమయ సూచీని పరిగణనలోకి తీసుకుని, ఆ సూచీలలో వచ్చిన ధరల పెరుగుదలకు అనుగుణంగా గ్రామీణ కార్మికుల వేతనాలలో పెరుగుదల వచ్చిందా అన్న విషయాన్ని వారు పరిశోధించారు.

అయితే ఇక్కడో సమస్య ఉంది. ఆ రెండు సూచీలూ 1986-87 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని రూపొందించినవి. అంటే, 1986-87 నాటికి, దాదాపు 40 ఏండ్ల క్రితం నాటి, వినిమయం ఉండిన తీరునే ఇప్పుడు కూడా ఉంటుందన్న ప్రాతిపదికన లెక్కలు వేసినవి. కాని, ఈ 40 సంవత్సరాల కాలంలోనూ ప్రజల వినిమయంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ మార్పుల్ని పరిగణనలోకి తీసుకోకపోతే ఈ తరగతుల ప్రజల మీద ధరల పెరుగుదల ప్రభావం ఎంత మోతాదులో ఉందో సరైన అంచనాకు రాలేము. అందుచేత సమీప కాలంలోని వినిమయ ధోరణుల్ని వ్యక్తం చేసే ప్రాతిపదికను ఎంచుకోవడం మంచిది. అయితే ప్రభుత్వం 2010 ప్రాతిపదికన కొత్త సూచీని రూపొందించింది. కార్మికుల వేతనాల మీద ధరల పెరుగుదల వాస్తవ ప్రభా వం ఎంత ఉంటుందో, దానికన్నా తక్కువ చేసి చూపించడం దీని వెనుక ప్రధాన ఉద్దేశ్యం. అయినప్పటికీ ఆ 2010నే ప్రాతిపదికగా తీసుకుని చూస్తే అప్పుడు కూడా గ్రామీణ కార్మికుల నిజ వేతనాలలో పెరుగుదల ఏమీ లేదు సరికదా స్వల్ప తగ్గుదల నమోదైంది. ఉదాహరణకి, 2014-2023 మధ్య కాలంలో పొలాలను దున్నే కార్మి కుల నిజవేతనాలు 2.7 శాతం తగ్గిపోయాయి. ఇదేమాదిరిగా తక్కిన వ్యవసాయ పనులకు చూసినా, తగ్గుదలే కనిపిస్తోంది తప్ప పెరుగుదల లేదు. దీనిని బట్టి గత దశాబ్ద కాలంలో గ్రామీణ కార్మికుల నిజవేతనాలు తగ్గిపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ ప్రభుత్వం తీరును కొట్టొచ్చినట్టు చూపించే విషయం ఇది. గతంలో ఏ ప్రభుత్వమూ జీడీపీ వృద్ధి రేటు గురించి మోడీ ప్రభుత్వం చేసినంత ప్రచారం, హడావుడి చేయలేదు. నిజానికి ఈ జీడీపీ కూడా గత ప్రభుత్వాల కాలంతో పోల్చితే మోడీ హయాంలో తక్కువ వృద్ధిరేటునే నమోదు చేసింది. ఎప్పుడు చూసినా భారతదేశ ఆర్థికవ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతోందంటూ మోడీ వల్లిస్తున్నా డు. అతడి భజన బృందాలైతే ఇప్పటికే ఆ 5 లక్షల కోట్ల స్థాయిని దాటేసిందని భావిస్తున్నారు. ఈ జీడీపీ వృద్ధి వ్యామోహంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి ఈ దేశ జనాభాలో అత్యంత పేదలుగా ఉన్న తరగతి- అంటే, గ్రామీణ కార్మికుల జీవన ప్రమాణాలు వాస్తవంగా దిగజారి పోతున్నాయి అన్న వాస్తవం కనిపించడం లేదు.

> నయా ఉదారవాద వ్యవస్థలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం దీనికి ప్రధాన కారణం. 2008లో అమెరికాలో బద్దలైన రియల్ ఎస్టేట్ బుడగ ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపించింది. అయితే, అప్పటికి అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం ప్రభుత్వ వ్యయాన్ని పెంచే దిశగా కొన్ని చర్యలు తీసుకుంది. దానివలన ఆ సంక్షోభ ప్రభావం మన దేశం మీద తక్కువగా పడింది. ఐతే, 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. నయా ఉదారవాదం కోరుకున్నట్టు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించింది. దాని ఫలితంగా దేశ స్థూల డిమాండు స్థాయి దెబ్బతింది. దాని పర్యవసానంగా దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ఆర్థిక వ్యవస్థకు తగిలిన దెబ్బ ప్రభావం గ్రామీణ భారతం మీదనే అత్యధికంగా పడింది. గ్రామీణుల నిజవేతనాలు పడిపోయాయి.

> ఈ దశాబ్ద కాలపు మోడీ పాలనలో దేశంలోని గుత్త పెట్టుబడిదారీ కార్పొరేట్లు, అందునా ముఖ్యంగా మోడీకి అత్యంత ప్రీతిపాత్రులైన కొత్త బడా కార్పొరేట్లు ఎంతగా తమ సంపదలను పెంచుకున్నారో, ఆదా యాల్లో, సంపదలో అసమానతలు ఎంతగా పెరిగి పోయాయో మనం చూస్తున్నాం. బ్రిటిష్ పాలన కాలం లోని మహారాజులకు, అప్పటి సామాన్యులకు మధ్య ఉండిన ఆర్థిక అసమానతల కన్నా ఇప్పుడు దేశంలోని అత్యధిక సంపన్నులైన ఒక శాతం జనాభాకి, తక్కిన 99 శాతం జనాభాకి మధ్య అసమానతలు ఎంతో ఎక్కువ. ఇందులో అందరికన్నా ఎక్కువగా నలిగిపోతున్నది మన గ్రామీణ పేదలే.

అంతే కాదు, అధ్యయన బృందం మరొక విషయాన్ని కూడా నిర్ధారించింది. 2014 నాటికే అమలులో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, గర్భిణుల సంరక్షణ పథకం, సామాజిక భద్రతా పింఛన్లు, అంగన్వాడీ పథకం, మధ్యాహ్న భోజన పథకం వంటి ఐదు సంక్షేమ పథకాలను ఎన్డీయే ప్రభుత్వం దెబ్బ తీసింది. 2011 తర్వాత జనాభా లెక్కల సేకరణ జరగలేదు. బీజేపీ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. దానివలన కొత్తగా జనాభాలో ఈ కాలంలో చేరిన కోట్లాదిమంది నిరుపేదలు ప్రభుత్వ లెక్కల్లో లేరు. వారందరికీ ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రయోజనాలు అందడం లేదు. ఉపాధి హామీ పథకం కింద చెల్లించే వేతనాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా ఏ విధమైన పెరుగుదలా లేదు. పైగా చేసిన పనులకు చెల్లించవలసిన వేతనాల బకాయిలే నెలల తరబడి పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు చెల్లించే పింఛను ఎప్పటినుంచో ఆ రు.200 దగ్గరే నిలిచిపోయింది. గర్భిణులకు వర్తించే సంక్షేమ పథకం ఒక బిడ్డ వరకు మాత్రమే పరిమితం చేశారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో 40శాతం కోత పెట్టారు.

మొత్తంగా చూసుకుంటే మోడీ పాలనాకాలంలో గ్రామీణ కార్మికుల నిజవేతనాలు తగ్గిపోవడమే కాక, వారికి వర్తించే సంక్షేమ పథకాలలో కూడా కోతలు పడ్డాయి. కరోనా కాలంలో ప్రతీ కుటుంబానికి 5 కిలోల ఉచిత బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశ పెట్టిన మాట నిజం. అది నేటికీ కొనసాగుతోంది. అయితే దాని వలన కలిగే ఫలితం చాలా స్వల్పం. వేతనాల తరుగుదల, సంక్షేమం లో కోత ప్రభావం చాలా ఎక్కువ.

నిజానికి స్వతంత్రం వచ్చిన తర్వాత, గ్రామీణ కార్మికుల నిజవేతనాల్లో ప్రతీ ఏడూ ఎంతో కొంత పెరుగుదల ఉంటూ వచ్చింది. 2014-15 నుంచీ మాత్రం అది తిరుగు ముఖం పట్టింది. కొంతకాలం ఏ పెరు గుదలా లేకుండా స్తబ్దంగా ఉండి, చివర్లో ఏకంగా తగ్గడం ప్రారంభించింది. మోడీ ప్రభుత్వం పలు అవకతవక ఆర్థిక విధానాలను అనుసరించింది. పెద్ద నోట్ల రద్దు అటువంటి చర్యల్లో ఒకటి. దాని వినాశకర ప్రభావం గ్రామీణ పేదలమీద ఆ తర్వాత కాలంలో స్పష్టంగా కనిపించింది. అదే మాదిరిగా జిఎస్‌టిని ప్రవేశపెట్టడం కూడా మరో చర్య. దానివలన చిన్న ఉత్పత్తి వ్యవస్థలమీద చాలా ప్రతికూల ప్రభావం పడింది. దాని ఫలితంగా నిరుద్యోగం కూడా పెరిగింది. దాని వలన నిజవేతనాలలో పెరుగుదల లేకుండా పోయింది. కోవిడ్-19 కాలంలో విధించిన దారుణమైన లాక్‌డౌన్ మరొక వినాశకర చర్య. దీని ఫలితంగా ఉత్పత్తి పూర్తిగా దెబ్బతింది. నిరుద్యోగం పెరిగింది. నిజవేతనాలు ఎక్కువ మోతాదులో పడిపోయాయి. అయితే, అంతకు ముందు నుండే, అంటే, 2014 నుండీ గ్రామీణ కార్మికుల వేతనాలలో పెరుగుదల లేకుండా పోడానికి కారణం ఏమిటి?

> నిజానికి స్వతంత్రం వచ్చిన తర్వాత, గ్రామీణ కార్మికుల నిజవేతనాల్లో ప్రతీ ఏడూ ఎంతో కొంత పెరుగుదల ఉంటూ వచ్చింది. 2014-15 నుంచీ మాత్రం అది తిరుగు ముఖం పట్టింది. కొంతకాలం ఏ పెరు గుదలా లేకుండా స్తబ్దంగా ఉండి, చివర్లో ఏకంగా తగ్గడం ప్రారంభించింది. మోడీ ప్రభుత్వం పలు అవకతవక ఆర్థిక విధానాలను అనుసరించింది. పెద్ద నోట్ల రద్దు అటువంటి చర్యల్లో ఒకటి. దాని వినాశకర ప్రభావం గ్రామీణ పేదలమీద ఆ తర్వాత కాలంలో స్పష్టంగా కనిపించింది. అదే మాదిరిగా జిఎస్‌టిని ప్రవేశపెట్టడం కూడా మరో చర్య. దానివలన చిన్న ఉత్పత్తి వ్యవస్థలమీద చాలా ప్రతికూల ప్రభావం పడింది. దాని ఫలితంగా నిరుద్యోగం కూడా పెరిగింది. దాని వలన నిజవేతనాలలో పెరుగుదల లేకుండా పోయింది.

నయా ఉదారవాద వ్యవస్థలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం దీనికి ప్రధాన కారణం. 2008లో అమెరికాలో బద్దలైన రియల్ ఎస్టేట్ బుడగ ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపించింది. అయితే, అప్పటికి అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం ప్రభుత్వ వ్యయాన్ని పెంచే దిశగా కొన్ని చర్యలు తీసుకుంది. దానివలన ఆ సంక్షోభ ప్రభావం మన దేశం మీద తక్కువగా పడింది. ఐతే, 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. నయా ఉదారవాదం కోరుకున్నట్టు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించింది. దాని ఫలితంగా దేశ స్థూల డిమాండు స్థాయి దెబ్బతింది. దాని పర్యవసానంగా దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ఆర్థిక వ్యవస్థకు తగిలిన దెబ్బ ప్రభావం గ్రామీణ భారతం మీదనే అత్యధికంగా పడింది. గ్రామీణుల నిజవేతనాలు పడిపోయాయి.

నిజ వేతనాలు తగ్గిపోవడం, ఉపాధి అవకాశాలు పడిపోవడం అనే ఈ రెండు ధోరణులూ ఒకదానిని ఇంకొకటి ప్రకోపింపజేస్తాయి. నిరుద్యోగం తక్కువగా ఉంటే, వేతనాలు పడిపోవు. ఎంతో కొంత పెరుగుతాయి. నిజవేతనాలు పడిపోతున్నాయి అంటే అదే కాలంలో నిరుద్యోగం కూడా పెరుగుతోందన్న మాటే. అంటే ఏక కాలంలో గ్రామీణ పేదలు అటు నిజవేతనాల్లో తగ్గుదలను, ఇటు నిరుద్యోగం పెరుగుదలను చవిచూడవలసి వస్తోందన్నమాట. రోజు కూలీ రేటు నిజవిలువ తగ్గడమే గాక. పనులు దొరికే రోజుల సంఖ్య కూడా తగ్గిపోతోందన్నమాట. అంటే వారి వేతనాల నిజ విలువ మాత్రమే గాక, వారికి లభించే నిజ ఆదాయాలు కూడా పడిపోతున్నాయి. దీనికి తోడు సంక్షేమ పథకాలలో కూడా కోత పడుతోంది. ఇదంతా కలిపి చూస్తే గ్రామీణ పేదలు అనుభవించే పరిస్థితులు ఎంత దుర్భరంగా మారుతున్నాయో పూర్తి చిత్రం కనిపిస్తుంది.

బీజేపీ పాలన వర్గ స్వభావం ఎంత ప్రజా వ్యతిరేకమో ఇప్పుడు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ దశాబ్ద కాలపు మోడీ పాలనలో దేశంలోని గుత్త పెట్టుబడిదారీ కార్పొరేట్లు, అందునా ముఖ్యంగా మోడీకి అత్యంత ప్రీతిపాత్రులైన కొత్త బడా కార్పొరేట్లు ఎంతగా తమ సంపదలను పెంచుకున్నారో, ఆదాయాల్లో, సంపదలో అసమానతలు ఎంతగా పెరిగిపోయాయో మనం చూస్తున్నాం. బ్రిటిష్ పాలన కాలంలోని మహారాజులకు, అప్పటి సామాన్యులకు మధ్య ఉండిన ఆర్థిక అసమానతల కన్నా ఇప్పుడు దేశంలోని అత్యధిక సంపన్నులైన ఒక శాతం జనాభాకి, తక్కిన 99 శాతం జనాభాకి మధ్య అసమానతలు ఎంతో ఎక్కువ. ఇందులో అందరికన్నా ఎక్కువగా నలిగిపోతున్నది మన గ్రామీణ పేదలే.

(స్వేచ్ఛానుసరణ)

అవి దేహాలే తప్ప
మరేమీ కావు
మా 'నవ' నాగరిక నిర్మాణానికి
ఆ దేహాలే కావాలి
ఆ కాళ్లు చేతులూ
కదలాడే పచ్చినెత్తురూ కావాలి
సత్యప్రమాణంగా ఆ దేహాలకు
కులం మతం ప్రాంతం
భాష ఏదీ ఉండదు
ఆకలి నిత్యం సత్యం కదా!!
ఆకలే దేహాలను
మైళ్లదూరం నడిపిస్తుంది
ఎండనకా వాననకా
రేయనకా పగలనకా
ఎప్పుడూ పనిచేయిస్తుంది

బెదురు చూపులు



ఎక్కడ దేహాలకు పనుంటే
అక్కడే వాటి నివాసాలు
అక్కడే సంసారం పిల్లలు
మురికి వాడలే కావచ్చు
రేకుల కొట్టాలే కావచ్చు
రోడ్లు భవంతులు
గనులు గ్రైనైడ్‌లు
కంకర గుట్టలు ఎక్కడైనా పనే
లేబర్ అడ్డాలో చూడాలి
పని వెతుకులాట
పరుగు చూపుల్ని..!
ఒక్కో చూపు ఒక్కో పుస్తకం!
ప్రమాదాల్లో చాలా సులువుగా
దేహాలు చస్తుంటాయి
ఆస్పత్రుల వరండాల్లో
పోలీస్ స్టేషన్ మెట్లపై
తారట్లాడే
ఆ బెదురు చూపుల్ని
అందుకోవడాని కప్పుడు
నా భాష చాలదు.
ఏం జరుగుతుంది?
నా తోటి దేహాలను
ఇండ్లకు పంపగలనా?
అంతిమ సంస్కారాన్ని
పంచుకోగలనా?
ఇంకిపోయిన కండ్లల్లో
నీరెందుకుంటుంది?
రేపనేదే గుర్తుకు రాదు
అసలు ఆ కోట్లాది దేహాలకు
జీవితమే గుర్తులేదు
వాటికి తెలిసిందల్లా
ఆకలి తీర్చుకునే శ్రమే
యాజమాన్య వ్యవస్థకు
కావాల్సిందదే
మనస్సులతో జీవితాలతో
పని ఏమి?

- కె.శాంతారావు
సెల్: 9959745723

ఇజ్రాయిల్ యుద్ధ నేరాల నేతలకు శిక్ష

(మే 22 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, రక్షణ మంత్రి యావో గాలంట్‌లకు, ఇస్మాయిల్ హనియేతో సహా ముగ్గురు హమాస్ నాయకులకు అరెస్టు వారంట్లు జారీ చేయాలని అంతర్జాతీయ నేర విచారణ న్యాయస్థానం (ఐసిసి) ప్రధాన ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ కోరారు. గాజాపై ఏడు మాసాల పాటు సాగుతున్న యుద్ధంలో ఇజ్రాయిల్ ప్రధాని, రక్షణ మంత్రి మానవ జాతికి వ్యతిరేకంగా నేరాలు చేశారనీ, అలాగే యుద్ధ నేరాలకు పాల్పడ్డారనీ చెప్పేందుకు తగినన్ని సాక్ష్యాధారాలు వున్నాయని ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు. గాజా ప్రజలను ఆకలితో మాడ్చి చంపడానికి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారు. మహిళలు, పిల్లలు, పురుషులు చనిపోవడానికి కారకులయ్యారు. హమాస్ నాయకుల విషయానికి వస్తే అక్టోబర్ 7న దాడిలో ఇజ్రాయిల్ పౌరులపై అత్యాచారాలు జరిగాయని కూడా ప్రాసిక్యూటర్ ఉదహరించారు. ప్రాసిక్యూటర్ అభ్యర్థనను ఐసిసి న్యాయమూర్తుల మండలి ఆమోదించవలసి వుంటుంది. అయితే ఆయన దరఖాస్తును మాత్రం అయిదుగురు అంతర్జాతీయ న్యాయ నిపుణుల ప్యానెల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఊహించదగినట్టుగానే దీనిపై నెతన్యాహు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ విధంగా కోరడం చారిత్రక స్థాయి అనైతిక ఘాతుకమని ఆయన ఆరోపించారు. ఆధునిక కాలంలోనే తీవ్ర యూదు వ్యతిరేకులైన వారిలో కరీం ఖాన్ ఒకరని అభివర్ణించారు. రక్షణమంత్రి గాలంట్ దీన్ని యుద్ధంలో జోక్యం చేసుకోవడానికి జరుగుతున్న ఒక అవమానకర ప్రయత్నమని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ యుద్ధానికి అతి పెద్ద మద్దతుదారైన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చీఫ్ ప్రాసిక్యూటర్ ప్రయత్నం దారుణమైనదన్నారు. ఇజ్రాయిల్, హమాస్‌లను పోల్చడానికే లేదన్నారు.

రంగంలోకి అమెరికా, బ్రిటన్

ఐసిసి అనేది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) వంటిది కాదు. జాతి మారణకాండలు, మానవ జాతికి వ్యతిరేకంగా నేరాలు చేసిన వారిని విచారించడం కోసం దేశాల మధ్య ఒప్పందంతో ఏర్పడింది. ఐసిసి వ్యక్తుల నేరాలను గాక కేవలం దేశాలనే విచారిస్తుంది. ఇప్పటి వరకూ ఐసిసి కేవలం అమెరికాకు, పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా నిలిచిన అరబ్, ఆఫ్రికన్ దేశాల నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటూ వస్తున్నది. ఉక్రెయిన్ యుద్ధంలో నేరాలు చేశారనే ఆరోపణతో గతేడాది రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఐసిసి తాఖీదులు జారీ చేసింది. అమెరికాకు, పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా నిలిచిన నాయకులను మాత్రమే ఐసిసి లక్ష్యంగా పెట్టుకున్నంత కాలం ఎలాంటి సమస్య రాలేదు. అమెరికా, దాని పాశ్చాత్య మిత్రులు ఐసిసి చర్యలకు మద్దతునిస్తూ వచ్చాయి. నిజానికి అమెరికా ఐసిసి ఏర్పాటు ఒప్పందంలో భాగస్వామి కాదు కూడా.



అమెరికా సన్నిహిత మిత్రదేశానికి చెందిన నాయకులను ఐసిసి విచారించ బూనుకోవడం ఇదే మొదటిసారి. దాంతో ఉన్నట్టుండి అమెరికా పాలన వ్యవస్థ నుంచి నిరసనల పరంపర ప్రారంభమైంది. 'మీరు ఇజ్రాయిల్‌ను టార్గెట్ చేయండి. మేము మిమ్మల్ని టార్గెట్ చేస్తాము' అంటూ రిపబ్లికన్ సెనెటర్ల బృందం ఒకటి కౌబారు స్టయిల్‌లో నిరసన ప్రకటించింది. ఐసిసి జడ్జిలు ప్రాసిక్యూటర్లపై ఆంక్షలు విధించాలనే వాదనలూ వినిపిస్తున్నాయి. బ్రిటన్, జర్మనీలు ఐసిసి చర్యకు అనామోదం ప్రకటించాయి. కానీ యూరోపియన్ యూనియన్‌లో సభ్యులుగా వున్న మూడు దేశాలు ఫ్రాన్స్, బెల్జియం, స్లొవేకియాలు ఐసిసి ప్రాసిక్యూటర్‌కు మద్దతు తెల్పడమే అమెరికాను ఇబ్బంది పెడుతున్నది. గాజాలో సాగుతున్న యుద్ధంలో ఆగని ఘోరాలు అమెరికాలోనూ పశ్చిమ దేశాల వైఖరిలో కూడా భిన్న స్వరాలకు కారణమైనాయి. నార్వే, ఐర్లాండ్, స్పెయిన్‌లు పాలస్తీనా దేశాన్ని గుర్తించాలని నిర్ణయించాయి. ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరాను అనుమతించరాదని బెల్జియం, స్పెయిన్ నిర్ణయించాయి. మరో వైపున రఫా నగరంపై భూతల దాడి మొదలెట్టాలని ఇజ్రాయిల్ నిర్ణయించింది. నగర పౌరులను తూర్పు భాగం నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని హుకుం జారీ చేసింది. రఫా ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్న 15 లక్షల మందితో సహా 8 లక్షల మంది పౌరులు ఇప్పుడు మధ్య గాజా ఇతర ప్రాంతాలలోకి తరలిపోయారు. ఇజ్రాయిల్ ఆహార సరఫరాలు నిలిపివేయడంపై ఐసిసి ప్రాసిక్యూటర్ లేవనెత్తిన ఆరోపణ ఇప్పుడు నిర్ధారణ అయ్యింది కూడా. ఆహార పదార్థాల కొరత వల్ల భద్రతా సమస్యల వల్ల రఫా నగరానికి ఆహార పంపిణీ నిలిపివేస్తున్నట్టు ఐరాస మే 21న ప్రకటించింది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

మోడీ నేతృత్వంలో ఇండియా పాత్ర

తన మోసపూరిత విధానాన్ని కొనసాగిస్తున్న అమెరికా ఇజ్రాయిల్ సైన్యాన్ని ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తూ భయానక మారణాయుధాలు సమకూరుస్తూనే వుంది. మరో వంక రఫా నగరంపై దాడులలో సాధారణ పౌరులు గాయపడకుండా చూడాలని పిలుపులివ్వడం బూటకత్వం మాత్రమే. ఇజ్రాయిల్‌కు 2600 కోట్ల డాలర్ల సైనిక సాయం అందించాలంటూ బైడెన్ పెట్టిన తీర్మానానికి అమెరికా కాంగ్రెస్ మే మూడవ వారంలో ఎట్టకేలకు ఆమోదం తెల్పింది. నిజానికైతే ఐసిసి ప్రాసిక్యూటర్ యుద్ధ నేరాలకు తోడైనందుకు అధ్యక్షుడు బైడెన్‌ను కూడా చేర్చాలి. యుద్ధ నేరాలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ సైన్యానికి తోడ్పడ్డంలో అమెరికా అంత కాకున్నా మోడీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కూడా ఒక పాత్ర నిర్వహిస్తున్నది. డెన్మార్క్ పతాకంతో చెన్నై నుంచి ఇజ్రాయిల్ లోని హైఫా రేవుకు బయిలుదేరి వెళ్లిన రవాణా నౌకను స్పెయిన్ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. అందులో 27 టన్నుల ప్రేలుడు పదార్థాలు వున్నట్టు చెబుతున్నారు. స్పెయిన్ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు ఆయుధ ఎగుమతులు నిలిపేసింది. ఇప్పటికే అంతులేని పౌర మారణకాండ సాగుతున్న ఆ యుద్ధ ప్రాంతానికి మరిన్ని ఆయుధాలు చేరరాదన్న ఉద్దేశంతోనే కార్టెగేనా రేవులో ఈ నౌకకు అనుమతి నిరాకరించినట్టు స్పెయిన్ ప్రకటించింది.

ఈ నౌకలో ఎలాంటి ఆయుధాల రవాణా జరిగిందీ భారత ప్రభుత్వం వెల్లడించలేదు. అవి ఎక్కడ నుంచి వచ్చాయో కూడా చెప్పింది లేదు. కాని చూస్తే ఇండియా ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా చేస్తున్నట్టు రికార్డు మాత్రం వుంది. కొద్ది మాసాల కిందట ఇండియా నుంచి ఇజ్రాయిల్‌కు 20 హెర్మిలా సైనిక డ్రోన్లు సరఫరా అయినట్టు వెల్లడైంది. ఇజ్రాయిల్‌కు చెందిన ఎల్బిట్ సిస్టమ్స్‌తో కలిసి అదానీ గ్రూపు సంయుక్తంగా నెలకొల్పిన ఫ్యాక్టరీలో ఈ డ్రోన్లు తయారైనాయి. గాజాలో పౌరుల మరణాలపై కొంత విచారం ప్రకటిస్తూనే ఇజ్రాయిల్ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేయడంలో మోడీ ప్రభుత్వం బైడెన్ గొంతునే వినిపిస్తున్నది. రఫాపై ఇజ్రాయిల్ దాడిని నిలిపి మానవ మారణహోమాన్ని నిలువరించేందుకు తక్షణం తాత్కాలిక చర్యలైనా తీసుకోవాలంటూ దక్షిణాఫ్రికా కొత్తగా వేసిన పిటిషన్‌పై అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) ప్రస్తుతం విచారణ జరుపుతున్నది. దక్షిణాఫ్రికా, మరికొన్ని వర్ధమాన దేశాలతో కూడిన బఅందం పాలస్తీనా ప్రజలకు న్యాయం జరగాలంటూ గట్టిగా నిలబడి పోరాడుతున్నది. ఈ మహత్తర పోరాటంలో మోడీ నాయకత్వంలోని ఇండియా చరిత్రలో అధర్మ పక్షంలో నిలబడింది. ■

> అమెరికా సన్నిహిత మిత్రదేశానికి చెందిన నాయకులను ఐసిసి విచారించ బూనుకోవడం ఇదే మొదటిసారి. దాంతో ఉన్నట్టుండి అమెరికా పాలన వ్యవస్థ నుంచి నిరసనల పరంపర ప్రారంభమైంది. 'మీరు ఇజ్రాయిల్‌ను టార్గెట్ చేయండి. మేము మిమ్మల్ని టార్గెట్ చేస్తాము' అంటూ రిపబ్లికన్ సెనెటర్ల బృందం ఒకటి కౌబారు స్టయిల్‌లో నిరసన ప్రకటించింది. ఐసిసి జడ్జిలు ప్రాసిక్యూటర్లపై ఆంక్షలు విధించాలనే వాదనలూ వినిపిస్తున్నాయి. బ్రిటన్, జర్మనీలు ఐసిసి చర్యకు అనామోదం ప్రకటించాయి. కానీ యూరోపియన్ యూనియన్‌లో సభ్యులుగా వున్న మూడు దేశాలు ఫ్రాన్స్, బెల్జియం, స్లొవేకియాలు ఐసిసి ప్రాసిక్యూటర్‌కు మద్దతు తెల్పడమే అమెరికాను ఇబ్బంది పెడుతున్నది. గాజాలో సాగుతున్న యుద్ధంలో ఆగని ఘోరాలు అమెరికాలోనూ పశ్చిమ దేశాల వైఖరిలో కూడా భిన్న స్వరాలకు కారణమైనాయి.

బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు నోటిఫికేషన్

జూన్ 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

- సమర్పణకు తుది గడువు 22
- ఆర్జీయూకేటీ బాసర వీసీ వెంకటరమణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) బాసర ట్రిపుల్‌ఐటీలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరేండ్ల సమీకృత బీటెక్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఆర్జీయూకేటీ ఉపకులపతి (వీసీ) వి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు అదేనెల 22 వరకు ఉందని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ ఏడాది జూన్ ఒకటి నాటికి 18 ఏండ్లు నిండకుండా ఉన్న వారే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వివరించారు. ఎస్సీ,ఎస్టీలకు మూడేండ్లు మినహాయింపు ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు www.rgukt.ac.in వెబ్‌సైట్ లేదా www.admissions.rgukt.ac.in ఈమెయిల్ ద్వారా సంప్రదించాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరంలో 1,500 సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. ఆన్‌లైన్/మీసేవా/విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలని కోరారు.

నేటి నుంచి సూత్ర సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్

హైదరాబాద్ : సంస్కృతి సాంప్రదాయాలు, ఆధునిక ఫ్యాషన్లు ప్రతిబింబించు వస్త్ర ప్రపంచం ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సూత్రా సంస్థ పేర్కొంది. మే 28 నుంచి 30 వరకు నోవాటెల్ హెచ్‌ఐసిసి నందు తమ సూత్రా ఎగ్జిబిషన్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు సందర్శకుల అభిరుచుల ననుసరించి దేశం నలుమూలల నుండి తెచ్చిన విభిన్న వస్త్ర సంపదను ఒకే వేదిక పైన ప్రదర్శన, విక్రయాలకు ఉంచుతున్నామన్నారు. ఈ ప్రదర్శనలో ఎందరో కళాకారులు, చేనేత పనివారు డిజైనర్స్ అద్భుతంగా రూపొందించిన విస్తృత శ్రేణీ దుస్తులు, గృహాలంకరణ ఉత్పత్తులు, పాదరక్షలు సందర్శకులకు అందుబాటులో ఉంటాయన్నారు. అదే విధంగా ప్రముఖ జ్యుయలర్స్, ఫ్యాషన్ డిజైనర్లు, కళాకారులను, వారు కళాత్మకంగా సృష్టించిన ఉత్పత్తులను తీసుకు రావాలేది సూత్రా లక్ష్యం అన్నారు.

ఎల్ఐసీకి రూ.13,782 కోట్ల లాభాలు

ప్రతీ షేర్‌పై రూ.6 డివిడెండ్



ముంబయి : దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 4.5 శాతం వృద్ధితో రూ.13,782 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.13,191 కోట్ల లాభాలు నమోదు చేసింది. కాగా చివరి డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.6 చెల్లించడానికి సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. కాగా.. బీమా రంగంలో 58.87 శాతం వాటాతో మార్కెట్ లీడర్‌గా ఉన్నట్లు వెల్లడించింది. 2024 మార్చితో ముగిసిన ఏడాదిలో సంస్థ మొత్తం ప్రీమియం రూ.4,75,070 కోట్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం 2023 మార్చి ముగింపు నాటికి ఇది రూ.4,74,005 కోట్లుగా ఉంది. గడిచిన ఏడాదిలో వ్యక్తిగత వ్యాపార ప్రీమియం ఆదాయం రూ.3,03,768 కోట్లకు పెరిగింది. ఇంతక్రితం ఏడాదిలో ఇది రూ.2,92,763 కోట్లుగా ఉంది. 2024 మార్చి ముగింపు నాటికి ఎల్ఐసి అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) రూ.51,21,887 కోట్లకు చేరింది. ఇది 2023 మార్చి ముగింపు నాటికి రూ.43,97,205 కోట్లుగా నమోదయ్యింది.

రైళ్లలో గంజాయి తరలింపు

అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

రూ.15.50 లక్షల విలువైన 62 కిలోల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ- బేగంపేట్
రైళ్లలో ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.15.50 లక్షల విలువైన 62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సోమవారం రైల్వే అర్బన్ డీఎస్పీ ఎన్.జావెద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఒడిశా గజపతి జిల్లా లుద్రు గ్రామానికి చెందిన చందకుమార్ నాయక్(34), మిహిర్, చిందా, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన మరో ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఒడిశాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి దానిని రైళ్లలో సికింద్రాబాద్ మీదుగా నాందేడ్‌కు తరలిస్తున్నారు. అక్కడ అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో చందకుమార్, చిందా మరో ముగ్గురు కలిసి 62 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. రైలులో నాందేడ్‌కు బయలుదేరి సోమవారం సికింద్రాబాద్ చేరుకున్నారు. ఉదయం 10.30గంటల సమయంలో రైల్వే పోలీసులు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా చందకుమార్ వద్ద ఉన్న లగేజీ అనుమానాస్పదంగా కనిపించింది. తనిఖీ చేయగా.. రెండు ట్రాలీ బ్యాగులు, మూడు షోల్డర్‌బ్యాగుల్లో సుమారు 62 కిలోల గంజాయి లభించింది. దాని విలువ సుమారు రూ.15.50లక్షలు ఉంటుందని డీఎస్పీ జావెద్ తెలిపారు. చందకుమార్ నాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా ఐదుగురి కోసం గాలిస్తున్నారు.

ధాన్యం,బియ్యం టెండర్లపై
హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అవినీతిపై న్యాయపోరాటం :రవీందర్ సింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ధాన్యం, బియ్యం టెండర్లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, బీఆర్ఎస్ నేత రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అవినీతిపై న్యాయపోరాటం చేయనున్నట్టు తెలిపారు. కార్పొరేషన్ అవినీతిపై సీఎం రేవంత్ రెడ్డి సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. 15 రోజుల క్రితమే బీఆర్ఎస్ అవినీతిపై ప్రశ్నించడంతో రూ.200 కోట్ల మేర టెండర్లు దక్కించుకున్న వారు ధాన్యం కొనకుండా భయపడ్డారని తెలిపారు. రూ. 57కు సన్న బియ్యం కొనాలని ప్రభుత్వమే టెండర్లలో రేటు నిర్ణయించింది నిజం కాదా ? అని ప్రశ్నించారు. అవినీతిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాత్ర లేకపోతే టెండర్లు రద్దు చేసి నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక్కటేనని విమర్శించారు. ఆర్ ఆర్ యాక్ట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని కోరారు.

అక్రమ మద్యానికి తలుపులు తెరిచిన కాంగ్రెస్ : మన్నె క్రిశాంక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో అక్రమ మద్యానికి కాంగ్రెస్ సర్కారు తలుపులు తెరిచిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త మద్యానికి రాష్ట్రంలో అవకాశం లేదంటూ ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పిందంతా అబద్ధమని తేలిపోయిందని ఎద్దేవా చేశారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- 13 వరకు నిర్వహణ
- 51,237 మంది హాజరు
- 170 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ పీరియెడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అదేనెల 13 వరకు అవి కొనసాగుతాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమైనా 9.35 గంటల వరకు విద్యార్థులకు గ్రేస్ పీరియడ్‌తో అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ తర్వాత వచ్చిన విద్యార్థులకు అనుమతి ఉండబోదని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు సబ్జెక్టు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టును రెండు విడతల్లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నామని వివరించారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌ను సబ్జెక్టులను వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 51,237 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని వివరించారు. వారిలో 31,625 మంది అబ్బాయిలు, 19,612 మంది అమ్మాయిలున్నారని తెలిపారు. వారి కోసం 170 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 170 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 170 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 1,300 మంది ఇన్విజిలేటర్లను నియమించామని వివరించారు. మాల్‌ప్రాక్టీస్‌లను నివారించడంతోపాటు పరీక్షల పర్యవేక్షణకు 38 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామని పేర్కొన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామని తెలిపారు. ఒఒఒ.ఎంప్‌.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామనీ, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. విద్యార్థులను గంట ముందు నుంచే అంటే ఉదయం 8.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామనీ, సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తేవడాన్ని నిషేధించామని పేర్కొన్నారు.

మరో ఏడు రోజులు బెయిల్ పొడిగించండి

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాను అనారోగ్యంతో బాధపడు తున్నందున తన మధ్యంతర బెయిల్‌ను ఏడు రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనను అరెస్ట్ చేసిన తరువాత ఏడు కిలోల బరువు తగ్గానని పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు తీవ్రమైన వ్యాధి లక్షణాలు ఉన్నాయని, అందుకే తాను పీఈటీ-సిటీ స్కాన్ సహా పలు పరీక్షలు చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో 51 రోజుల తర్వాత మధ్యంతర బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చారు. ఆయనకు సుప్రీంకోర్టు జూన్ 1 వరకు మాత్రమే బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న లొంగిపోవాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

కుల వివక్ష నివారణపై తీసుకున్న చర్యలేంటి?

- ఉన్నత విద్యా సంస్థల నుంచి యూజీసీ నివేదిక
- జులై 31లోగా సమర్పించాలి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2023-24 విద్యా సంవత్సరంలో తమ క్యాంపస్‌లలో కుల ఆధారిత వివక్షను నిరోధించడానికి తీసుకున్న వివిధ చర్యలపై నివేదిక ఇవ్వాలని అన్ని ఉన్నత విద్యా సంస్థలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కోరింది. ఈ మేరకు సోమవారం ఆ సంస్థలకు లేఖ రాసింది. జులై 31లోగా నివేదికను సమర్పించాలని కోరింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నుండి అందిన వివక్షపై ఫిర్యాదులను పరిశీలించడానికి కమిటీలు ఏర్పాటు చేసి ఉంటే, అలాగే కుల ఆధారిత వివక్షకు సంబంధించిన ఫిర్యాదుల కోసం వెబ్‌సైట్‌లో ఒక పేజీని క్రియేట్ చేసి ఉంటే గత ఏడాది కాలంలో ఎన్ని ఫిర్యాదులు అందాయి? వాటిలో ఎన్ని పరిష్కారం అయ్యాయనే వివరాలను తెలపాలని యూజీసీ అందులో పేర్కొంది.ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలపై కుల ఆధారిత వివక్షపై అందిన ఫిర్యాదులను వాటి అనుబంధ కళాశాలల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించడానికి ఏర్పాటు చేసిన అంతర్గత సెల్‌ల వివరాలనూ సమర్పించాలని విశ్వ విద్యాలయాలను కోరింది. "కుల వివక్షకు సంబంధించిన సంఘటనలతో వ్యవహరించేటప్పుడు మీ విశ్వవిద్యాలయం, ఇన్‌స్టిట్యూట్‌లోని అధికారులు, అధ్యాపకులు మరింత సున్నితంగా వ్యవహరించాలని సలహా ఇవ్వాల్సిందిగా మీరు అభ్యర్థించారా? తదుపరి చర్యల కోసం పైసూచనలను మీ విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలు, అనుబంధ కళాశాలలకు కూడా పంపారా?" అని కమిషన్ ప్రశ్నించింది.విద్యార్థుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రతి ఉన్నత విద్యా సంస్థ ఏర్పాటు చేయాల్సిన విద్యార్థి ఫిర్యాదుల పరిష్కార కమిటీ (ఎస్జీఆర్సీ)లో అట్టడుగున ఉన్న కులం, తెగకు చెందిన ఒక సభ్యుడిని, ఒక మహిళను చేర్చడాన్ని కమిషన్ గత సంవత్సరం తప్పనిసరి చేసింది.

మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాల దరఖాస్తు గడువు 31 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులని తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మాధ్యమంలో ఉచిత విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఉంటాయని వివరించారు. వచ్చేనెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం www.tsmodelschools.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సివిల్స్ అభ్యర్థులకు జూన్ 23న స్కాలర్‌షిప్ టెస్ట్

- కొంగర ఎడ్యుకేషనల్ సొసైటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొంగర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల ఎంపిక కోసం ఉపకార వేతనాల (స్కాలర్‌షిప్ టెస్ట్) నిర్వహిస్తామని ఆ సొసైటీ చైర్మెన్ కె గంగాధరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం వచ్చేనెల 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్కాలర్‌షిప్ టెస్టును నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని వివరించారు. ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ స్కాలర్‌షిప్ టెస్టును నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం 9346777568 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీకి రంగం సిద్ధం

డిసెంబర్ 9 కటాఫ్ డేట్‌కు.. కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో రూ.2లక్షలు మాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఇందుకు సంబంధించిన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. అధికారం చేపట్టినప్పటి నుంచి పలు దఫాలుగా చర్చించిన సర్కార్ రుణ మాఫీ వర్తింపుపై గైడ్ లైన్స్ రూపొందించినట్టు చెబుతున్నారు. డిసెంబర్ 9 కటాఫ్ తేదీగా ప్రభుత్వం ఎంచుకోనున్నట్లు సమాచారం. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకుంటే మిగతా బద్దులను చెల్లించాల్సి ఉంటుంది. ఒకటి కంటే



ఎక్కువ బ్యాంకుల్లో లోన్ తీసుకుంటే వాటన్నింటిని కలిపి లెక్కించనున్నారు. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న అప్పు కూడా మాఫీ కానుంది. దీర్ఘకాలిక రుణాలకు మాత్రం మాఫీ వర్తించబోదని సమాచారం.

కార్పొరేషన్ ఏర్పాటు


రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఏక కాలంలో రుణ మాఫీ అసాధ్యమని అధికారులు ఇటీవల సీఎంకు వివరించారు.ఈ నేపథ్యంలో రైతు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలను సేకరించాలని సీఎం సూచన ప్రాయంగా నిర్ణయించారు. ఈ క్రమంలో అధికారులు కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టారు. ఏక కాలంలో రూ.2లక్షలు మాఫీ చేయాలంటే దాదాపు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయి.

ఇందు కోసం ఆర్బీఐతో పాటు ఇతర ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుతున్నట్టు సమాచారం. అన్ని అనుకూలిస్తే ఆగస్టు 15లోగా రుణమాఫీ కానుంది.

గుజరాత్‌లో మూకదాడి

ముస్లిం కార్మికుడి మృతి

- కేసు నమోదుకు పోలీసులు నిరాకరణ



న్యూఢిల్లీ : కష్టపడి కుటుంబాన్ని పోషించుకునే ఒక ముస్లిం కార్మికుడిపై గోగూండాలు పట్టపగలే మూక దాడి చేసి కొట్టడంతో అతను మృతి చెందాడు. సంపాదించే వ్యక్తి మరణించడంతో ఆ కుటుంబం అనాథగా మారింది. ఇంతకు ముస్లిం వ్యక్తి చేసిన నేరం స్థానిక సంతలో పశువులను కొనుగోలు చేసిన వాటిని తన సోదరి ఇంటికి వ్యాన్‌లో తీసుకుని వెళుతుండటమే. ఈ దారుణం గుజరాత్‌లోని బనస్కంథ జిల్లాలో జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. 40 ఏళ్ల మిశ్రి ఖాన్ జుమే ఖాన్ బలోచ్ కార్మికుడిగా కష్టపడి పని చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తి. ఇతనికి దృష్టిలోపం ఉన్న భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 23న బలోచ్ తన స్నేహితుడు హుస్సేన్ ఖాన్‌తో కలిసి స్థానిక పశువుల మార్కెట్ నుంచి కొన్ని జంతువులును కొనుగోలు చేశాడు. వీటిలో రెండు గేదెలను తన సోదరికి ఇవ్వడానికి ఖాన్‌తో కలిసి ఒక వ్యాన్‌లో బయలుదేరాడు. ఖాన్ వ్యాన్‌ను నడుపుతున్నాడు.

ఈ వ్యాన్‌ను గో గూండాలను వెంబడించారు. అయితే వీరి దురదృష్టవశాత్తూ వ్యాన్ టైర్లకు పంక్చర్ పడింది. దీంతో వీరు గో గూండాలకు పట్టుపడ్డారు. వ్యాన్ నడుపుతున్న ఖాన్ ఏదో విధంగా తప్పించుకోగా, బలోచ్‌పై గోగూండాలు దాడికి తెగబడ్డారు. దారుణంగా కొట్టడంతో బలోచ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఖాన్ ఫిర్యాదు మేరకు దీసా (గ్రామీణ) పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. గోగూండాలు అఖేరాజ్‌సిన్హ్ పర్బత్‌సిన్హ్ వాఘేలా, నికుల్ సిన్హ్ జగత్ సిన్హ్ ప్రవీణ్‌సిన్హ్, హమీర్‌భాయ్ ఠాకోర్‌పై హత్య, నిర్బంధం, బెదిరింపులు, కుట్ర వంటి అభియోగాలతో కేసు నమోదు చేశారు. అయితే మూకదాడి కింద కేసు నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షయ్ రాజ్ మక్వానా కూడా ఈ హత్యను 'మూకదాడి'గా పేర్కొనలేమని చెప్పారు.ఈ హత్య గురించి ఖాన్ మాట్లాడుతూ బలోచ్ హత్య అనుకోకుండా జరిగిందని కాదని, ఒక ప్రణాళిక ప్రకారం జరిగిందేనని అన్నారు. గత ఏడాది జులైలో కూడా నిందితులు తమపై వేధింపులకు పాల్పడ్డారని గుర్తు చేశారు.

బలోచ్ హత్యతో దృష్టిలోపం ఉన్న భార్య, నలుగురు పిల్లలు అనాథగా మారారని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ హత్యతో బనస్కంథ జిల్లాలో ముస్లింలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగడం ఇదే మొదటిసారి కాదు. పశువుల వ్యాపారం, పశువుల రవాణా చేసే వ్యక్తులపై గోగూండాలు నిత్యం బహిరంగంగానే దాడులకు పాల్పడుతుంటారు. వారిని నుంచి డబ్బులు వసూలు చేస్తుంటారు. జిల్లాలోని సేసన్‌నావా గ్రామంలో పశువుల వ్యాపారిపై గతేడాది దారుణంగా దాడి చేశారు. 2002 గోధ్రా అల్లర్ల నేపథ్యంలో ఇదే గ్రామంలో మహిళలతో సహా 14 మంది ముస్లింలను దారుణంగా హత్య చేశారు. అయితే ఈ అల్లర్ల కేసులో నిందితులుగా మొత్తం 70 మందిని స్థానిక కోర్టు 2014లో నిర్దోషులుగా ప్రకటించింది.

దేశానికే కేరళ ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. కేరళకు వచ్చిన ప్రతిసారీ మతోన్మాదులను ఓడించేందుకు వీలుగా ఏదో ఒక రకమైన స్ఫూర్తిని పొంది వెళ్తున్నానని తెలిపారు. ప్రధానమంత్రి హోదాలో ఉండి మోడీ పదే పదే దేశాన్ని విచ్ఛిన్నం చేసే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని కాకముందే ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులుగా వారి భావజాలలకు అనుగుణంగా వ్యాఖ్యలు చేస్తే అది వారికే పరిమితమవుతుందని తెలిపారు. అయితే ప్రధాని అయిన వ్యక్తి ప్రజలందరి ఆసక్తిని గుర్తించి కాపాడేవారై ఉండాలని హితవు పలికారు. కేరళలోకి చొచ్చుకొచ్చేందుకు మోడీ బాధ్యతారహితంగా మాట్లాడారనీ, ఇక్కడి ప్రజలు మాత్రం ఇంచు కూడా మతోన్మాదులకు దక్కకుండా అడ్డుకున్నారని అభినందించారు. ఇలాంటి చర్యలతో కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. సమాజాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయాన్ని భారతదేశం, కేరళ నుంచి నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. స్నేహ సదస్సు మినీ ఇండియాను, ఇండియా అలయెన్స్‌ను, సెక్యులర్ ప్లాట్ ఫాంను తలపిస్తున్నదని ప్రశంసించారు. ఇలాంటి సందేశాన్ని కోట్లాది మందికి చేర్చాలని ఆకాంక్షించారు.

దిగజారిన రాజకీయాలు

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. అయితే మతోన్మాదులు ఎన్నికల్లో గెలిచేందుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని వారు అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. బీజేపీ నేతలు 400 ఎంపీ సీట్లు తమకు వస్తాయని ఊదరగొడుతున్నారనీ, రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్లను రద్దు చేసేందుకే ఈ తతంగమని, అయితే వారి కలలు కల్లలు కాబోతున్నాయని రేవంత్ వ్యాఖ్యానించారు. 130 వరకు స్థానాలున్న కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక తదితర రాష్ట్రాలు కలిపి మతోన్మాదులు 20 కూడా దాటబోరని చెప్పారు. ఇక గతంలో ఏకపక్షంగా ఎన్డీఏ గెలిచిన గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాల్లో వారి బలం సగానికి సగం తగ్గిపోబోతున్నదని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా పదేండ్లపాటు తెలంగాణను పాలించి ఎన్నికల్లో ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా మాట్లాడిన మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే, పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని మోడీ కూడా దుర్భాషలాడారని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓడిపోయినట్టుగానే, కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఓడిపోబోతుందని చెప్పారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధనలో ప్రాణ త్యాగాలు చేసిన అమరులకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తామని వివరించారు. జూన్ రెండున తెలంగాణ ఆవిర్భవించి దశాబ్ద కాలం గడుస్తున్న నేపథ్యంలో ముగింపు వేడుకల సభను హైదరాబాద్‌లోని తమ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్నారు. అదే రోజు హైదరాబాద్‌లో పలు దవాఖానాల్లో, అనాథ శరణాలయాల్లో, పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, మిఠాయిల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ మూడున రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, జాతీయ జెండాను బీఆర్ఎస్ నేతలు ఎగరవేస్తారని వివరించారు. ఆయా జిల్లాల్లోని దవాఖానాలు, అనాథ శరణాలయాల్లో మిఠాయిలు, పండ్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణను సాధించి స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో దశాబ్దకాలంపాటు ప్రగతిని సాధించి దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కేసీఆర్ పునరుద్ఘాటించారు. గ్రామస్థాయినుంచి రాష్ట్రస్థాయిదాకా కార్యకర్తలు, పార్టీ అందించే సూచనలను అనుసరించి ముగింపు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కేసీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో సంచలనం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష అభ్యర్థులకు తెలవకుండా వారు జరిపిన ఫోన్ చాటింగ్‌లన్నింటినీ రికార్డు చేసి తెలిపేలా ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్‌రావుతో హరీశ్‌రావు కుమ్మక్కయ్యారు. తర్వాత శ్రవణ్‌ను ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావుకు పరిచయం చేసిన హరీశ్‌రావు.. అక్కడి నుంచే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపించారు.

ఎస్ఐబీలో ప్రత్యేక గది నుంచి ఫోన్ ట్యాపింగ్

ఎస్ఐబీలోని తన ఛాంబర్ పక్కనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకున్న ప్రభాకర్‌రావు.. తన టీమ్ ద్వారా అదే గది నుంచి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపించేవారు. శ్రవణ్ ఇస్తున్న రాజకీయ నాయకులు, వ్యాపారులు, బ్యూరోక్రాట్లు మొదలైనవారి ఫోన్‌నెంబర్లను ఆధారంగా చేసుకొని ట్యాపింగ్ వ్యవహారాన్ని డీఎస్పీ ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్న ముందుకు సాగించేవారు. ఇందుకుగానూ, 50 మందితో ప్రత్యేక టీమ్‌ను కూడా వీరు ఏర్పాటు చేసుకొనీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటర్లను ఏర్పాటు చేసుకొని ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడేవారు.

ముఖ్యంగా, మునుగోడు ఉప ఎన్నికలో ప్రతిపక్ష అభ్యర్థి ఏమాత్రమూ గెలవద్దనే లక్ష్యంతో బీఆర్ఎస్ అధినాయకుడు ఇచ్చిన ఆదేశాల మేరకు అక్కడి ప్రతిపక్ష అభ్యర్థుల (బీజేపీ, కాంగ్రెస్) ఫోన్‌ట్యాపింగ్ చేయటమేగాక, భారీ ఎత్తున డబ్బులను కూడా సీజ్ చేశారు. మరోవైపు, అప్పటి తాండూర్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితో పాటు మరికొందరు బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే అనుమానంతో వారి ఫోన్లనూ ట్యాప్ చేసి, తమ అదుపాజ్ఞల్లో ఉంచుకున్నారు. అదే సమయంలో, కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి డబ్బులిచ్చి లాగుతున్నారనీ, వీరు వేసుకున్న వ్యూహం ప్రకారమే నందకుమార్, భారతీస్వామి, సింహయాద్రి అనే ముగ్గురిని ఫోన్‌ట్యాపింగ్ ద్వారా అరెస్ట్ అయ్యేలా చేశారు. దీని వెనక ఆరెస్సెస్ ముఖ్యనాయకుడు ఢిల్లీలో ఉన్న బీఎల్ సంతోశ్ ఉన్నారని ఆయనపై కూడా కేసు నమోదు చేశారు. అయితే, బీఎల్ సంతోశ్.. వీరికి చిక్కకుండా బెయిల్ పొందారు. బీఎల్ సంతోశ్‌ను అరెస్ట్ చేయటం ద్వారా మద్యం కేసుల్లో ఇరుక్కున్న బీఆర్ఎస్ నాయకురాలు కవితతో పాటు మరికొందరిని ఆ కేసు నుంచి తప్పించాలనే వ్యూహరచనను గులాబీ అధినాయకత్వం చేసింది.

స్వపక్ష, ప్రతిపక్ష నాయకుల ఫోన్లూ ట్యాపింగ్

పార్టీలో తమకు వ్యతిరేకంగా ఉంటున్నారనే అనుమానం కలిగిన పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన భార్య సునీతా రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రులు తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులు, జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి, సరిత, బీజేపీ నాయకులు బండి సంజయ్, ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌లతో పాటు పలువురు ప్రతిపక్ష, స్వపక్షానికి చెందిన నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేశారు. ఇంకోవైపు, మీడియాలోని కొన్ని ఛానెళ్ల యాజమాన్యాల చైర్మెన్లు గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏ పార్టీలతో మాట్లాడుతున్నారు? ఎవరికి మద్దతు పలుకుతున్నారు? అనే వివరాలు కూడా ఫోన్ ట్యాపింగ్‌ల ద్వారా అధికారులు సేకరించారు. అలాగే, పాలనాపరంగా కొందరు బ్యూరోక్రాట్లైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసి, వారిని కూడా తమ అదుపాజ్ఞలో ఉంచుకొని తాము చెప్పినట్టు నడుచుకునేలా బీఆర్ఎస్ అధినాయకత్వం వ్యవహరించింది.

అంచనాలు తలకిందు.. అధికారంలోకి కాంగ్రెస్.. కంప్యూటర్ల ధ్వంసం

తమ అంచనాలు తలకిందులై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుండటంతో ప్రభాకర్‌రావు తన గది పక్కనున్న ప్రత్యేక రూమ్‌లో ఉన్న ఫోన్‌ట్యాపింగ్ యంత్రాలు, కంప్యూటర్లను పూర్తిగా ధ్వంసం చేయటంలో ప్రణీత్‌రావు కీలక పాత్ర వహించాడు. దీనితో ఫోన్‌ట్యాపింగ్ జరిపిన వివరాలేగాక, అందులోని కీలకమైన హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయటం వల్ల ఎస్ఐబీ అధికారులు కొన్నేండ్లుగా సేకరించిన మావోయిస్టుల వివరాలు, ఇతర సమాచారం, కౌంటర్ ఇంటెలిజెన్స్ సేకరించిన ఉగ్రవాదుల డేటా కూడా ధ్వంసమైందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. దీంతో, శ్రవణ్ సైతం దేశం విడిచి పారిపోయాడు. మొత్తమ్మీద, రాధాకిషన్‌రావు, భుజంగరావు దర్యాప్తు అధికారులకు ఇచ్చిన వాంగ్మూల పత్రంలో తేలిన అంశాలు సంచలనం రేపాయి. ఇదిలా ఉంటే, శ్రవణ్‌తో హరీశ్‌రావుకున్న సంబంధాలపై ఈ కేసును దర్యాప్తు జరుపుతున్న స్పెషల్ టీమ్ ప్రత్యేక దృష్టిని సారించినట్టు తెలిసింది.

కవిత అరెస్టు అక్రమం

- కవిత బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టులో వాదనలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను దర్యాప్తు సంస్థలు అక్రమంగా అరెస్ట్ చేశాయని ఆమె తరపు న్యాయవాది ఢిల్లీ హైకోర్టులో వాదనలు వినిపించారు. కేవలం అప్రూవర్లు ఇచ్చిన వాంగ్మూలంతో ఒక పార్టీ సీనియర్ నాయకురాలిగా, ఎమ్మెల్సీగా ఉన్న కవితపై తప్పుడు ఆరోపణలతో కేసు పెట్టి, అదుపులోకి తీసుకున్నారన్నారు. కవితకు వ్యతిరేకంగా స్టేట్మెంట్లు ఇచ్చిన సహ నిందితులకు అనంతరం ఈ కేసులో బెయిల్ దక్కిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. లిక్కర్ స్కాంలో ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ మంజూరు, అలాగే కవిత అరెస్ట్‌కు ట్రయల్ కోర్టు సీబీఐకి అనుమతి, కస్టడీ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కవిత ఢిల్లీ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ స్వర్ణకాంత శర్మ దాదాపు 45 నిమిషాల పాటు సుదీర్ఘ విచారణ జరిపారు.

తెలంగాణలో కొత్త బీర్లు

- త్వరలో అందుబాటులోకి పవర్ 1000, బ్లాక్ ఫోర్ట్
- సోమ్ డిస్టిల్లరీస్‌కు అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొత్త బీర్లు రాబోతున్నాయి బీర్ల కొరతను నివారించేందుకు సర్కార్ కొత్తగా సోమ్ డిస్టలరీస్‌కి అనుమతిచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో ఆ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న పవర్ 1000, బ్లాక్ ఫోర్ట్, హంటర్, వుడ్ పీకర్ బీర్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. రెండు నెలలుగా రాష్ట్రంలో బీర్లు అందుబాటులో ఉండటం లేదని పలువురు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. అయితే ప్రభుత్వ వాదనను ప్రతి పక్షాలు తిప్పికొడుతున్నాయి. ఇప్పటికే అనుమతి పొంది, సరఫరా చేస్తున్న కంపెనీల ఉత్పత్తులను తగ్గించి కమీషన్ల కోసం కొత్త వాటికి అనుమతిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో కొత్త బీర్లకు ఏ డిస్టిలరీ కంపెనీ దరఖాస్తు చేయలేదనీ, ఇప్పటి వరకు ఎవరికీ అనుమతివ్వ లేదని ఇటీవల ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

ఇంటర్ వార్షిక పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్ఏ-475) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఆన్‌లైన్ ద్వారా సోమవారం వినతిపత్రం పంపించారు. ఫిబ్రవరి, మార్చిలో ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగాయని తెలిపారు. కానీ ఇంత వరకు రెమ్యూనరేషన్ అందలేదని ఆందోళన వ్యక్తం చేశారు. విధుల్లో పాల్గొన్న ప్రయివేటు కాలేజీల్లో పనిచేస్తున్న వారు, స్వీపర్లు, వాటర్ బాయ్స్, అటెండర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెండేండ్ల క్రితం వార్షిక పరీక్షల విధులు నిర్వహించిన వారికి వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించేవారని గుర్తు చేశారు. రెండేండ్ల నుంచి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టి ఐదారు నెలల వరకు రెమ్యూనరేషన్‌ను చెల్లించడం లేదని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంటర్ బోర్డు కార్యదర్శిని పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు. ఇంత వరకు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మూల్యాంకనం ప్రారంభమవుతుందని తెలిపారు. కానీ సకాలంలో రెమ్యూనరేషన్‌ను చెల్లించడంలో ఇంటర్ బోర్డు శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మూల్యాంకనం కేంద్రాల వద్ద దశలవారీ కార్యక్రమాలు

ఇంటర్ వార్షిక పరీక్షల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ చెల్లించాలంటూ వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మూల్యాంకనం కేంద్రాల వద్ద దశలవారీ కార్యక్రమాలను నిర్వహిస్తామని వి శ్రీనివాస్, కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని కోరారు.

హైదరాబాద్‌లో ఎన్‌పీఆర్‌డీ నాలుగో రాష్ట్ర మహాసభ ఆగస్టులో నిర్వహణ

- వచ్చేనెల 11న ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం
- 27న రాష్ట్ర వ్యాపితంగా హెలెన్ కెల్లర్ జయంతి ఉత్సవాలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రకటించాలి :ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర నాలుగో మహాసభలను ఆగస్టులో గ్రేటర్ హైదరాబాద్ నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం వచ్చేనెల 11న ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య తెలిపారు. కవి, రచయిత, బధిరుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ 144వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా జరపనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 27న రాష్ట్ర స్థాయి వికలాంగుల సాంస్కృతిక ఉత్సవాలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రకటించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రాజు, అరిఫా, సాయమ్మ, బి స్వామి, రాష్ట్ర సహాయ కార్యదర్శి వి ఉపేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూరపంగా ప్రకాష్, లలిత, ఎ లింగన్న, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు

పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించిన సీఎస్

- రాష్ట్రావతరణ దినోత్సవ ఏర్పాట్లపై పరిశీలన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవ ఏర్పాట్లను సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పరిశీలించారు. కార్యక్రమం నిర్వహించనున్న పరేడ్‌గ్రౌండ్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభాప్రాంగణంలో ఏలాంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. స్టేజీ ఏర్పాట్లు, బారికేడ్లు, సభాప్రాంగణంలో విద్యుత్, మంచినీటి సరఫరా, మైక్‌సిస్టం, ఎల్ఇడి స్క్రీన్‌ల ఏర్పాట్ల వివరాలను ఆయా శాఖల అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు, ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు, విఐపీ రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చేపట్టబోయే చర్యపై వివరాలను పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీజీపీ రవీగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శైలజా రామయ్యర్, శ్రీనివాసరాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, అడిషనల్ డీజీలు సంజయ్ కుమార్, సమాచార శాఖ ప్రత్యేక కమీషనర్ హనుమంతరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

నీటిపారుదల సలహాదారు రంగారెడ్డి మృతికి మంత్రి ఉత్తమ్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీటిపారుదల సలహాదారు రంగారెడ్డి మరణం పట్ల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. నీటిపారుదల రంగానికి ఆయన మరణం తీరనిలోటని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన సలహాలు నీటిపారుదల రంగానికి ఉపయోగపడ్డాయని తెలిపారు.

క్రిమినల్ జస్టిస్ బలోపేతం కోసమే కొత్త చట్టాలు

పీఐబీ వర్క్‌షాప్‌లో వక్తలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బ్రిటీష్ కాలంనాటి చట్టాలను రద్దు చేసి, సత్వర న్యాయం కోసం క్రిమినల్ జస్టిస్ బలోపేతం కోసమే కొత్త చట్టాలు రూపొందించారని నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకష్ణదేవరావు, మాజీ ఐజీ దామోదర్, సీడీటీఐ డైరెక్టర్ రాజశేఖర్ అభిప్రాయపడ్డారు. దేశంలో జులై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో అదనపు డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్ అధ్యక్షతన మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే మూడు కొత్త క్రిమినల్ చట్టాలు దేశంలో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను బలోపేతం చేస్తాయన్నారు. 1860 భారత శిక్షా స్మృతి (ఐపీసీ), 1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ), 1872 ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో ఈ మూడు చట్టాలు రానున్నాయని తెలిపారు. కొత్త క్రిమినల్ చట్టాలు శిక్ష కంటే న్యాయంపై దృష్టి సారిస్తాయనీ, బాధితుల కేంద్రీకృత న్యాయాన్ని నిర్ధారిస్తాయని చెప్పారు. కొత్త చట్టాల్లో విచారణను వేగవంతం చేయడం, వాయిదాలను అరికట్టడం ద్వారా సత్వర న్యాయం అందేలా చూడటానికి కాలపరిమితి నిర్ణయించారని వివరించారు. కొత్త చట్టాల్లో పేర్కొన్న కమ్యూనిటీ సేవల శిక్షలు పూర్తిగా కొత్తవేననీ, వాడుకలో ఉన్న సాంకేతికతకు అనుగుణంగా పలు కొత్త నిబంధనలను చేర్చారని తెలిపారు. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై సంఘటన స్థలం నుంచి స్మార్ట్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే, అది రికార్డు అవుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల బాధితులను గోల్డెన్ అవర్లో ఆస్పత్రిలో చేర్పితే మరణాలను నివారించవచ్చన్నారు. మహిళలు, పిల్లల హక్కులపై ఎక్కువ దృష్టి పెట్టడం, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, కనీస శిక్ష భావన, చిన్న నేరాలకు శిక్షగా సమాజ సేవను ప్రవేశపెట్టడం వంటి ప్రధాన మార్పులు ఈ చట్టాల్లో ఉన్నాయన్నారు.

ఇండియా అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ

-డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీ చేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సోమవారం ఆయన పంజాబ్ రాష్ట్రం ఫరీద్ కోట్ లోక్‌సభ పరిధిలోని కోటక్ పుర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అగ్ని వీర్ పథకాన్ని రద్దు చేస్తామని తెలిపారు. మోడీ భారత సైనికులను కార్మికులుగా మార్చి రెండు రకాల అమరవీరులను సష్టించారని విమర్శించారు. అమరవీరుల హోదా, పెన్షన్‌తో పాటు అన్ని సౌకర్యాలు పొందే వారు ఒకరైతే, పేద కుటుంబాల యువతకు మాత్రం ఇలాంటి గౌరవాలు, సౌకర్యాలు లేకుండా వివాదాస్పద పథకాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో పెరిగిపోయిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి పరిస్థితులకు బిజెపి తగిన మూల్యం చెల్లించుకుంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాకిస్తాన్‌తో పోరాడి బంగ్లాదేశ్‌కు స్వతంత్రం తెచ్చిపెట్టిందని గుర్తుచేశారు. చైనా మన భూమిని ఆక్రమించి ఇండ్లు, రోడ్లు నిర్మిస్తున్నా. ప్రధాని మోడీ మౌనంగా ఉండడం దేనికి సూచిక అని ఆయన ప్రశ్నించారు.

సీపీఐ(ఎం) అభ్యర్థి సైరా షా హలీమ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం



కోల్‌కతా : దక్షిణ కొల్‌కతా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సీపీఐ(యం) అభ్యర్థి సైరా షా హలీమ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం సాగుతోంది. సోమవారం బెహలలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మీనాక్షి ముఖర్జీ, సుదీప్ సేన్‌గుప్తా, ఇతర నాయకులు ప్రసంగించారు. సభకు భారీగా జనం హాజరయ్యారు. నాయకుల ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. సైరాషా హలీమ్‌కు మద్దతుగా ఖిదిర్‌పూర్, బ్రైడ్స్ వీధిలోనూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీల్లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం, ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగించారు.

వాడిన నూనెను మళ్లీ వాడొద్దు

అనేక వ్యాధుల బారిన పడతారని హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు

భారతీయ వంటకాల్లో ఎక్కువగా వినియోగించేది నూనె. ఆయిల్ లేకుండా ఏ వంటా పూర్తి కాదు. చిరు తిళ్లు నుంచి పిండి వంటల దాకా నూనె వినియోగం ఎక్కువే... ఏ వంటలు చేయాలన్న కావాల్సింది. నూనెనే. కాని... మోడీ ప్రభుత్వం రాకతో నిత్యావసరాల ధరలు భగ్గుమంటు న్నాయి. ఒక్క లీటర్ నూనె ప్యాకెట్ ధర రూ.120 నుంచి రూ.200 వరకు పెరిగింది.

దీంతో పేద, మధ్యతరగతి జనం ఒక సారి వాడిన నూనెను నిల్వ చేసి అయిపోయే వరకు వాడుతూనే ఉంటారు. ఇలా తయారు చేసిన ఆహారాలను తినడం వల్ల హృదయ సంబంధ వ్యాధులతో పాటు క్యాన్సర్ ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) వెల్లడించింది.



ఆరోగ్యంగా ఉండాలంటే...

రోజూ వండే కూరల్లో ఎక్కువగా నూనెను ఉపయోగించవద్దని, తక్కువ మోతాదులో రెండు లేదా మూడు టేబుల్ స్పూన్లకు మించకుండా నూనెను మాత్రమే వాడాలని, ముఖ్యంగా ఒకసారి వాడిన వంట నూనెను మిగిలిపోయిందని మళ్లీ ఉపయోగిస్తే అనేక వ్యాధుల బారీన పడాల్సి వస్తుందనీ, ఈ ప్రమాదాలను నివారించదానికి ఒకే నూనెను అనేకసార్లు ఉపయోగించకుండా ఉండటం మంచిదని, దీని వల్ల ఆరోగ్య ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు

న్యూఢిల్లీ : వంట నూనెను తరచుగా వేడి చేసి ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఇంట్లో చేసే వంటకాల్లో వాడగా మిగిలిపోయిన నూనెను మళ్లీ రెండు మూడు రోజులు నిల్వ చేసి పూర్తిగా అయిపోయే వరకు ఉపయోగిస్తుంటారు. అప్పడాలు వేయించడం, ఇతర కూరలు వండడానికో వాడుతుంటారు. అలా వండిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. మిగిలిపోయిన నూనెను పదే పదే వేడి చేసి వండి తినడం వల్ల ప్రాణాంతక వ్యాధుల బారిన పడడం, విషపూరిత సమ్మేళనాలు ఉత్పత్తి అవుతాయని వైద్య పరిశోధనల్లో తేలింది.

పదే పదే వేడి చేయడం వల్ల...

ఒక సారి వాడిన నూనెను మళ్లీ మళ్లీ వేడి చేయడం వల గుండె జబ్బులు, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఇక అధిక ఉష్ణోగ్రతల వద్ద వేడి చేసిన నూనెను వాడితే నూనెలో ఉండే కొన్ని కొవ్వులు ట్రాన్స్ ఫ్యాట్స్‌గా మారుతాయి. ట్రాన్స్ ఫ్యాట్ అనేది హార్ట్ డిసీజ్ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

నిపుణుల హెచ్చరిక ...

వాడిన నూనెను ఉపయోగించడం వల్ల హానికరమైన ఫ్రీ రాడికల్స్, ఇతర విషపదార్థాలు పేరుకుపోతాయి, ఇవి వాపు, గుండె జబ్బులు, కాలేయం దెబ్బతినడానికి దోహదం చేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జీడీపీ మందగింపు

(మొదటిపేజీ తరువాయి)

త్రైమాసికంలో భారత వృద్ధి రేటు 6.7 శాతానికే పరిమితం కావొచ్చని రాయిటర్స్ పోల్‌లో నిపుణులు అంచనా వేశారు. బలహీనమైన డిమాండ్ కారణంగా ఆర్థిక వ్యవస్థ నెమ్మదించిందన్నారు. 2023 డిసెంబర్ త్రైమాసికంలో భారత జీడీపీ 8.4 శాతం, సెప్టెంబర్‌లో 8.1 శాతం, జూన్ త్రైమాసికంలో 8.2 శాతం చొప్పున నమోదయ్యింది.

అయితే ఈ గణాంకాలు వాస్తవికతకు దగ్గరలేవని, మోడీ సర్కార్ అంకెల గారడీ చేసిందన్న విమర్శలు వెల్లువెత్తిన విషయం విదితమే.

తాజా సర్వేలో రాయిటర్స్ 54 మంది నిపుణుల అభిప్రాయాలను సేకరించింది. చాలా మంది ఆర్థికవేత్తలు తయారీ, సేవల రంగాలలో డిమాండ్ లేమి నేపథ్యంలో వృద్ధి మందగించిందని విశ్లేషించారు. అదే విధంగా వ్యవసాయ రంగంలో కూడా స్తబ్దత చోటు చేసుకుందని భావిస్తున్నారు. 2024 మార్చితో ముగిసిన త్రైమాసికంతో పాటు 2023-24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీడీపీ వివరాలను మే 31న అధికారికంగా కేంద్ర గణంకాల శాఖ వెల్లడించనుంది.

తాము ముందు వేసిన అంచనాల కంటే జీడీపీ తగ్గనుందని ఆర్థికవేత్తలలో మూడింట రెండు వంతుల మంది పేర్కొన్నట్లు రాయిటర్స్ తెలిపింది. మిగిలిన వారు అధికంగా ఉండొచ్చన్నారు. జీడీపీలో 60 శాతం వాటా కలిగిన ప్రయివేటు వినియోగంలోనూ చోటు చేసుకుంటున్న బలహీనమైన వృద్ధి రాబోయే త్రైమాసికాల్లోనూ జిడిపిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. "2024 మార్చితో ముగిసిన త్రైమాసికంలో గొప్ప మెరుగుదల ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నాము. కీలక ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతుంది. కరోనా అప్పటి నుంచి బలహీనమైన డిమాండ్ అల్ప వృద్ధికి కారణమవుతుంది." అని సొసైటీ జనరల్ ఇండియా ఎకనామిస్ట్ కునాల్ కుందు పేర్కొన్నారు.

రాయిటర్స్ పోల్ ప్రకారం.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సగటున 7.7 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా, వచ్చే ఏడాది (2025-26)లో 6,6 శాతానికి వృద్ధి మందగించొచ్చని అంచనా. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్నామని చెబుతోన్న భారత్ స్థిరమైన 8 శాతం వృద్ధి లక్ష్యాలు నెరవేరడానికి ఇంకా దూరంగానే ఉంది. దేశంలో సరిపడ ఉద్యోగాల సృష్టి జరగాలంటే ప్రతీ ఏడాది 8 శాతం వృద్ధి అవసరమని చాలా మంది ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. భారత్‌కు 5-6 శాతం సహేతుకమైన వృద్ధికే అవకాశాలు ఉన్నాయని పాంథియోన్ మాక్రో ఆసియా ఎకనామిస్ట్ మిగ్యుల్ చాంకో పేర్కొన్నారు. ఈ స్థాయి వృద్ధి సాధించాలన్నా మరిన్ని సంస్కరణలను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. మోడీ 2.0 ప్రభుత్వం కొన్ని అడుగులు వెనక్కి తీసుకుందన్నారు. జీడీపీ లో అసంఘటిత రంగం గణంకాలను ఎక్కువగా చేసి చూపుతున్నారని భావిస్తున్నానని ఎఎస్‌జడ్ ఎకనామిస్ట్ ధీరజ్ నిమ్ పేర్కొన్నారు. అందుకే ప్రధాన అంకెలు సూచించినంత స్థాయిలో వృద్ధి ఉత్సాహంగా కనిపించదని విమర్శించారు. భారత జీడీపీలో అసంఘటిత రంగం 50 శాతం వాటాను కలిగి ఉంది. అయినప్పటికీ మోడీ సర్కార్ ఈ రంగం వృద్ధికి పెద్ద చర్యలేమీ తీసుకోలేదనే విమర్శలు చాలా ఉన్నాయి.

19 ప్రశ్నల్లో ఒక్క దానికే సమాధానమా?

మంత్రి ఉత్తమ్ తెలివిగా తప్పించుకున్నారు

- అవినీతిపై కమిటీ వేసి నిగ్గుతేల్చాలి : బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సివిల్ సప్లయ్ శాఖలో జరుగుతున్న అవినీతిపై తాను 19 ప్రశ్నలు సంధిస్తే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక్క ప్రశ్నకే సమాధానం చెప్పి తెలివిగా తప్పించుకున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం వద్ద ఉన్న సన్నవడ్ల స్టాక్‌నే మిల్లింగ్ చేయిస్తామనీ, సన్నబియ్యం కొనుగోళ్ల టెండర్‌ను రద్దు చేస్తామని చెప్పటాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రశ్నిస్తే మీరే కొనుగోలు చేయండి అని మంత్రి వితండవాదన చేయడాన్ని తప్పుబట్టారు. తాము ట్రేడర్స్ బిజినెస్ చేసేవాళ్లం కాదనీ, దందాలు చేసే అలవాటు అసలే లేదని చెప్పారు. గతంలో తప్పులు చేసిన ఎంత మంది మిల్లర్లను డిఫాల్టర్లుగా ప్రకటించారని ప్రశ్నించారు. మిల్లర్ల తప్పులను సాకుగా చూపి వసూళ్లకు పాల్పడటాన్నే తాము ప్రశ్నిస్తున్నామన్నారు. ఏప్రిల్ 18న జలసౌధలో మిల్లర్లతో రాసుకున్న బాండ్ పేపర్లను మీడియా ముందు ప్రదర్శించారు. లంచాలు, కమీషన్లు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అనటం దొంగే దొంగ అన్నట్టుగా ఉందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల వద్దకెళ్తే రైతుల సమస్యలు తెలుస్తాయన్నారు. క్వింటాకు నాలుగు కిలోలకు పైగా ఎక్కువ కాంటా వేసి రైతులను దోచుకోవటంపై మంత్రి కనీసం స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు. తమ పార్టీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి అనుమతితోనే రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ ఎమ్మెల్యేలం సీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చామనీ, ఆ సమయంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా అక్కడే ఉన్నారని చెప్పారు. దీనికి రాజకీయ రంగు పులమటం సరిగాదన్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి చేతులు దులుపుకుంటే తప్పులు ఒప్పులుగా మారవనీ, వాస్తవాలను వెలికి తీసేందుకు కమిటీ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసి వాస్తవాలు తేల్చాలని కోరుతామన్నారు.

బెంగాల్‌లో 'రెమాల్' బీభత్సం

- ఆరుగురి మృతి
- కొనసాగుతున్న వర్షాలు

కోల్‌కత్తా : బెంగాల్‌లో రెమాల్ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ తుపాను బెంగాల్‌లోని సాగర్ ఐలాండ్స్, బంగ్లాదేశ్‌లోని మంగ్లా పోర్టు సమీపంలోని ఖేపుపుర మధ్య ఆదివారం అర్ధరాత్రి సమయంలో తీరం దాటిందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అధికారులు సోమవారం ప్రకటించారు. బెంగాల్‌లో ఈ తుపాను కారణంగా ఆరుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. కోల్‌కత్తాలో గోడకూలి ఒకరు మరణించగా, దక్షిణ 24 పరగణాల జిల్లాలో చెట్టు మీద పడి ఒకరు మరణించారు. పుర్బ బర్ధమాన్‌లో విద్యుత్ షాక్‌తో ఇద్దరు మరణించారు. వీరిని తండ్రీ కుమారులుగా గుర్తించారు. అలాగే ఉత్తర 24 పరగాణాల జిలాల్లో ఒక యువకుడు, కోల్‌కతాలోని మీటిఅబ్రుజ్ ప్రాంతంలో ఒక మహిళ విద్యుత్ షాక్‌తో మరణించారు. భారీ గాలులకు, వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 15 వేల ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగానూ దెబ్బతిన్నాయి. అలాగే అనేక చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకూలినట్లు అధికారులు తెలిపారు. తుపాను ప్రభావానికి హసన్నాబాద్, సందేశ్‌ఖిలీ, గోసన, సాగర్, శ్యాంపుర, హరింఘత ప్రాంతాలకు ఎక్కువగా గురైనట్లు అధికారులు చెప్పారు. రోడ్లు పునరుద్ధరించడానికి, ప్రజలకు సహాయం చేయడానికి ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు చెందిన 14 బృందాలు సోమవారం ఉదయం నుంచి నిర్విరామంగా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెమాల్ తుపాను ప్రభావం త్రిపుర రాష్ట్రంపై కూడా పడింది. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిసాయి. రాజధాని అగర్తల విమానాశ్రయంలో భారీగా నీరు చేరింది. దీంతో 11 విమాన సర్వీసులను రద్దు చేశారు.కోల్‌కతా ఎయిర్‌పోర్టులోనూ అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి 21 గంటలపాటు విమాన సర్వీసులను రద్దు చేశారు. రేమాల్ తుపాను ప్రభావం బంగ్లాదేశ్‌పై అధికంగా ఉంది. ఈ దేశంలో తుపాను కారణంగా ఏడుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత చర్యగా తుఫాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో 8 లక్షల మందికి పైగా ప్రజలను అక్కడి అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాను ప్రభావంతో సోమవారం కూడా అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిసాయి.

నెహ్రూకు కాంగ్రెస్ నేతల ఘన నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత తొలి ప్రధాని, దివంగత పండిత జవహర్ లాల్ నెహ్రూ 60వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం హైదరాబాద్‌లో గాంధీభవన్, ఇందిరాభవన్‌తో పాటు వివిధ చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో నెహ్రూ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇందిరాభవన్‌లో టీపీసీసీ మేధావుల సెల్ ఆధ్వర్యంలో 'నెహ్రూ ఇండియా డెమోక్రసీ' అనే అంశంపై సదస్సు నిర్వహించి ప్రజాస్వామిక ఇండియా పరిరక్షణకు నెహ్రూ ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తుచేసుకున్నారు. శ్యాంమోహన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, జీవన్ రెడ్డి, అజారుద్దీన్, వి. హనుమంత రావు, సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ రాజన్ హర్షే, బెల్లయ్య నాయక్, నెరేళ్ల శారద, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూమన దేశాభివృద్ధికి నెహ్రూ తీసుకున్న చర్యలే కారణమని తెలిపారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నెహ్రూ ప్రతిష్ఠను తగ్గించేందుకు ఆర్ఎస్సెస్, బీజేపీ లు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. వీహెచ్ మాట్లాడుతూ మహాత్మగాంధీ అడుగుజాడల్లో నడిచిన నెహ్రూ దేశాన్ని ప్రగతిపథంలోకి నడిపించారని గుర్తుచేశారు.

రాజేన్ హర్షే మాట్లాడుతూ నెహ్రూగొప్ప ఉదారవాద ప్రజాస్వామ్యవాదనీ, ఆలోచనా స్వేచ్ఛను మేధో స్వేచ్ఛగా, పత్రికా స్వేచ్ఛగా ప్రోత్సహించారని తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా పౌర హక్కులు, మానవ హక్కుల కోసం పోరాడిన సాంప్రదాయ ఉదారవాది, లౌకిక నాయకులు నెహ్రూ అని కొనియాడారు.

మతతత్వం కాదు.. మానవత్వం కావాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బందారు రవికుమార్



నవతెలంగాణ మహబూబ్‌నగర్ /పాన్‌గల్

"మైనారిటీ.. మతో న్మాదం రెండూ ప్రమాదకరమే.. మతో న్మాదాన్ని పాలకవర్గాలే పెంచి పోషిస్తున్నాయి.. దానికి ప్రత్యామ్నాయంగా భావజాల రంగంలో విస్తృత పోరాటం జరగాలి.. దేశానికి మతతత్వం కాదు.. మానవత్వం కావాలి" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బందారు రవికుమార్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలకు రాజకీయ శిక్షణాతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైద్ధాంతిక అంశాలను అధ్యయనం చేయాలన్నారు. స్వయంగా ప్రధాని మోడీనే ప్రజల మధ్య మత విద్వేషాలు రగిల్చేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధిపత్య భావజాలమే కొనసాగాలనే విధంగా ఆయన ప్రసంగాలుంటున్నాయని చెప్పారు. మైనార్టీ ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉండాలనడం సరికాదన్నారు. బీజేపీ హయాంలో చేసిన అభివృద్ధిపై చర్చించకుండా నిత్యం అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజల దృష్టి మరల్చుతున్నారని విమర్శించారు. సామ్రాజ్యవాదం, మతోన్మాదం, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం విస్తృత పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఏ.రాములు, నాయకులు కిల్లే గోపాల్, ఆర్.రామ్‌రెడ్డి, నల్లవెల్లి కురుమూర్తి, వి పద్మ, వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, నాయకులు జి.వెంకటయ్య, ఎం.బాల్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి మృతి బాధాకరం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ బాధిత కుటుంబానికి పరామర్శ
- రూ.లక్ష ఆర్థిక సాయం



నవతెలంగాణ-చందానగర్

ఈదురు గాలులతో కూడిన వర్షానికి రేకులు కూలి చిన్నారి మృతి చెందడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పెంట్ హౌస్‌పై ఉన్న రేకుల షెడ్డు కూలిన ఘటనలో చిన్నారి నమద్(3) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేటీఆర్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీతో కలిసి సాయినగర్‌లోని బాధిత ఇంటికి వెళ్లారు. ముందుగా చిన్నారి మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి.. రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారి మృతి చెందిన ఘటన చాలా దురదృష్టకరమని అన్నారు. ఇలా మృతి చెందడం తనను ఎంతో కలిచి వేసిందని, చిన్నారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఇదే ఘటనలో మరో వ్యక్తి కూడా చనిపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది మృతి చెందారని, వారందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రాణనష్టం జరిగిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అందేలా గ్రేటర్ కమిషనర్, జోనల్ కమిషనర్లతో మాట్లాడాలని ఎమ్మెల్యే గాంధీకి సూచించారు. ఇంటి రేకులు కూలిన వారి కుటుంబాలను జీహెచ్ఎంసీ నైట్ షెల్టర్లకు తరలించాలన్నారు. పరామర్శించిన వారిలో మియాపూర్, లింగంపల్లి డివిజన్ల కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, రాగం నాగేందర్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

9.72 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- వీటి విలువ రూ.16.77 లక్షలు
- వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఘటన



నవతెలంగాణ-కొడంగల్

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్‌లో 9.72 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.16.77 లక్షలు ఉంటుంది. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా ఇడుపులపాడు గ్రామానికి చెందిన వేణుబాబు 20 ఏండ్లుగా కోస్గి మండలం సర్జఖాన్‌పేటలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన హనుమయ్యతో కలిసి రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతున్నాడు. ఈ క్రమంలో హనుమయ్య మామ అయిన హస్నాబాద్ గ్రామానికి చెందిన బోయిని ఆశప్ప ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. ఆ ఇంట్లోనే నకిలీ పత్తి విత్తనాలను నిల్వ ఉంచాడు. కాగా, విశ్వసనీయ సమాచారం మేరకు ఏవో లావణ్య, ఎస్ఐ భరత్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి సోమవారం హస్నాబాద్‌లో సోదాలు నిర్వహించారు. హనుమయ్య, వేణుబాబులను పట్టుకుని విచారించగా.. హస్నాబాద్ పరిసర ప్రాంతాల్లోని రైతులకు ఎక్కువ ధరకు నకిలీ పత్తి విత్తనాలు అమ్మాలనే ఉద్దేశంతో బోయిని ఆశప్ప ఇంట్లో అద్దెకు రూము తీసుకుని నకిలీ విత్తనాలు నిల్వ ఉంచినట్టు వారు ఒప్పుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి లావణ్య పంచనామా నిర్వహించి, ఎస్ఐ భరత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. హనుమయ్య, వేణుబాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేణుబాబు గతంలో కూడా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేశాడు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విత్తనాలు మాత్రమే రైతులు వాడాలని సూచించారు. నకిలీ పత్తి విత్తనాలు నిల్వ చేసినా, అమ్మినా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తగ్గిన పట్టభద్రుల ఓటింగ్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

- 2021 ఎన్నికల్లో 74 శాతం ఉప ఎన్నికలో 68.65 శాతం
- అత్యధికంగా జనగామ జిల్లాలో 71.60 శాతం,అత్యల్పంగా ఖమ్మంలో 65.54 శాతం
- పోలింగ్ స్టేషన్ల సమీపంలోనే డబ్బుల పంపిణీని నిరసిస్తూ ఆందోళనలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉప ఎన్నిక చిన్నపాటి ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 12 జిల్లాల్లో 34 అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో 68.65 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 4,63,839 మంది ఓటర్లకు గాను 3,18,445 మంది 605 పోలింగ్ స్టేషన్‌లలో ఓటు వేశారు. ఉప ఎన్నిక, మూడేండ్ల పదవీకాలమే ఉన్నప్పటికీ అన్ని ప్రధాన పార్టీలు దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. 2021లో ఈ స్థానానికి జరిగిన ఎన్నికల్లో 74శాతం పోలింగ్ జరగ్గా ఇప్పుడు సుమారు 5శాతం తక్కువ ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా జనగామ జిల్లాలో 71.60శాతం పోలింగ్ నమోదవగా, తక్కువగా ఖమ్మంలో 65.64 శాతం మాత్రమే జరగటం గమనార్హం. గత ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 73.86శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి 66.5శాతం మందే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బ్యాలెట్ ద్వారా పోలింగ్, ప్రాధాన్యతక్రమంలో ఓటు వేసే అవకాశం ఉండటంతో కొందరు ఓటర్లు ఒకటి నుంచి 52 మందికి ఓటు వేయడంతో ఓటర్లు తక్కువున్నా పోలింగ్‌లో జాప్యం జరిగింది. సాయంత్రం 4 గంటల లోపు పోలింగ్ స్టేషన్‌లో ఉన్న వారికి కూడా ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు ఉండటంతో మరికొంత పోలింగ్ పర్సంటేజ్ పెరిగే అవకాశం ఉంది.

ప్రతిష్టాత్మకంగా ఎన్నిక..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, సంఖ్యాబలం దృష్ట్యా కాంగ్రెస్‌కు శాసనమండలిలో తక్కువ మంది సభ్యులుండటంతో అధికార పార్టీకి ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా గ్రాడ్యుయేట్లలో తమ ప్రతిష్ట తగ్గలేదని నిరూపించుకునేందుకు శతవిధాలా ప్రయత్నించింది. బీజేపీ ఈస్థానంపై పట్టు సాధించాలని రకరకాల ప్రయత్నాలు చేసింది. మొత్తంమ్మీద మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్), ఏనుగుల రాకేష్‌రెడ్డి (బీఆర్ఎస్), గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. క్రితంసారి ఎన్నికల ఫలితం నాలుగు రోజులకు తేలింది. ద్వితీయ ప్రాధాన్యత ఓటు కీలకంగా మారింది. ఈసారి కూడా అదే సీన్ రిపీట్ అవుతుందేమోనని పరిశీలకుల అంచనా.

ఓవైపు పోలింగ్.. మరోవైపు డబ్బుల పంపిణీ

ఓవైపు పోలింగ్ నడుస్తుండగానే మరోవైపు పోలింగ్ స్టేషన్‌లకు సమీపంలోనే డబ్బుల పంపకాలను ప్రధాన పార్టీలన్నీ చేపట్టాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేశాయి. పోలింగ్‌కు ముందురోజు కొన్ని వార్డుల్లో ఓటర్లకు పంపిణీ చేయగా కొందరికి పంచడం వీలుకాకపోవడంతో సోమవారం పోల్ చీటీలను చూసి రూ.500 చొప్పున ఇచ్చారు. పార్టీల కార్యాలయాల వద్ద పట్టభద్రులు బారులు తీరి మరీ డబ్బులు తీసుకొని వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. గ్రాడ్యుయేట్లై ఉండి ఓట్ల నోట్ల కోసం ఇలా బారులు తీరడం ఏంటని? ప్రజాస్వామ్యం ఎటుపోతుందని కొందరు చర్చించుకున్నారు. డబ్బుల విషయంలో గడిబిడి నెలకొనడంతో ఖమ్మంరూరల్ మండలంలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ఓటర్లను పోలీసులు చెల్లాచెదురు చేయగా.. మరో చోట కౌంటర్ ఓపెన్ చేసి డబ్బులు పంపిణీ చేశారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పోలింగ్ రోజున ఇదే తంతు కొనసాగించగా ఇప్పుడు అధికార, ప్రతిపక్షాలు పోటాపోటీగా కౌంటర్లు ఓపెన్ చేయడం గమనార్హం. నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లిలో డబ్బుల పంపిణీపై ఏకంగా పోలీస్‌స్టేషన్ ఎదుటే ఆందోళన చేయడం గమనార్హం. పోలింగ్ బూత్‌లోకి వెళ్లేదారుల్లో క్యాంపెయినింగ్ చేస్తున్న కార్యకర్తలు, నాయకులు సైతం ఓటర్లను గుట్టుగా పక్కకు తీసుకెళ్లి డబ్బులు చేతిలో పెట్టి పంపించిన దృశ్యాలు సైతం కనిపించాయి. ఇలాంటి ఒకటి, రెండు ఘటనలు మినహా మొత్తమ్మీద ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

జిల్లాల వారీగా పోలింగ్ (సా.4 గంటల వరకు)

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
సిద్దిపేట	4,679	3,267	69.82
జనగామ	23,419	16,767	71.60
హన్మకొండ	43,729	31,141	71.21
వరంగల్	43,812	31,036	70.84
మహబూబాబాద్	34,933	24,285	69.52
ములుగు	10,299	7,677	74.54
జెభూపాలపల్లి	12,535	8,669	69.16
భద్రాద్రి	40,106	27,294	68.05
ఖమ్మం	83,879	54,973	65.54
వై.భువనగిరి	34,080	22,988	67.45
సూర్యాపేట	51,497	36,367	70.62
నల్లగొండ	80,871	53,981	66.75
మొత్తం	4,63,839	3,18,445	68.65

ఓటేసి వస్తుండగా రోడ్డుప్రమాదం

- దంపతులు మృతి



(ఫైల్)

నవతెలంగాణ -టేకులపల్లి

ఎమ్మెల్సీ ఓటును వినియోగించుకుని తిరిగొస్తున్న దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం-ఇల్లందు ప్రధాన రహదారిలోని టేకులపల్లి మండల సమీపంలో సోమవారం జరిగింది. టేకులపల్లి ఎస్ఐ సైదా రాహుప్ తెలిపిన వివరాల ప్రకారం.. సంపత్ నగర్ గ్రామానికి చెందిన పాయం కృష్ణ(42), జానకి(40) దంపతులు ఎమ్మెల్సీ ఓటు వేసేందుకు గ్రామం నుంచి టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి వచ్చారు. అక్కడ ఓటు హక్కును వినియోగించుకొని తిరిగి బైక్‌పై వెళ్తుండగా కొత్తగూడెం నుంచి ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో దంపతులిద్దరికీ బలమైన గాయాలు కావడంతో కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు వారు మృతి చెందినట్టు తెలిపారు. దంపతులకు పాప ఉంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆస్పత్రిలో మృతదేహాలను సందర్శించి కుటుంబసభ్యులకు తమ సంతాపాన్ని తెలిపారు.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోంది

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ డబ్బుల పంపిణీ : మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ-నల్లగొండటౌన్

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ డబ్బులు పంచి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని.. పోలీస్ రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్ అరాచకాలు చేసిందన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తుందని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ఓటర్లు నడుం బిగించారని తెలిపారు. ఇప్పుడు భ్రమలు అన్ని తొలగిపోయాయని.. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు పెరిగిందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా నడుచుకోవాలన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలుగా పని చేస్తున్నారని విమర్శించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు తెలివితో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్, నాయకులు లోడంగి గోవర్ధన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన ఏవో

- ఫెర్టిలైజర్ రెన్యూవల్ కోసం డీలర్ వద్ద రూ.38 వేల డిమాండ్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



నవతెలంగాణ-దహెగాం

విత్తన డీలర్ లైసెన్స్‌ను రెన్యూవల్ చేయడానికి ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల వ్యవసాయ శాఖ అధికారి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. సోమవారం ఫెర్టిలైజర్ రెన్యూవల్ కోసం రూ.38వేలు లంచం తీసుకుంటూ మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ పట్టుబడటం సంచలనం సృష్టిస్తోంది. ఏసీబీ కరీంనగర్ రేంజ్ డీఎస్పీ వివి.రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఐనం గ్రామానికి చెందిన చౌదరి శ్యామ్‌రావు తనకున్న మారుతి ట్రేడర్స్‌లో ఫెర్టిలైజర్, సీడ్స్ రెన్యూవల్ కోసం గత నెల 27న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈనెల 7న ఫెర్టిలైజర్ లైసెన్స్ రెన్యూవల్ కాగా.. సీడ్స్ లైసెన్స్‌లో అడ్రస్ తప్పుగా పడింది. అప్పటికే రెన్యూవల్ కోసం మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ లంచం డిమాండ్ చేశారు.అయితే, అడ్రస్ తప్పును సవరించాలని తిరిగి బాధితుడు శ్యామ్‌రావు వ్యవసాయ అధికారిని సంప్రదించగా.. ఫెర్టిలైజర్ లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.20వేలు, సీడ్ లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.18 వేలు మొత్తం రూ.38 వేలు ఇస్తేనే అడ్రస్ సరిచేస్తానన్నాడు. చేసేదేం లేక ఒప్పుకున్న బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదిం చాడు. సోమవారం బాధితుడి నుంచి మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి రూ.38 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

విద్యుద్ఘాతంతో అమ్మమ్మ, మనుమడు మృతి

- పిడిసిల్ల గ్రామంలో విషాదఛాయలు



(ఫైల్)



నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో అమ్మమ్మ, మనుమడు మృతి చెందిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన ముడతన పల్లి రామలక్ష్మి(60) భర్త ఇటీవల చనిపోగా పిడిసిల్ల గ్రామంలోని తన కూతురు దుంప సరోజన-సుధాకర్ ఇంటికి వచ్చింది. కూతురు ఇంటి పక్కనున్న గోడకు బట్టలు ఆరవేయడానికి ఇనుప దండెం కట్టింది. ఈ దండేన్ని కరెంటు స్తంభం నుంచి వచ్చే విద్యుత్ వైరుకు సపోర్టుగా ఉన్న వైరుకు ఏర్పాటుచేశారు. కాగా, ప్రమాదవశాత్తు సపోర్టు వైరుకు విద్యుత్ సరఫరా కాగా దానికి ఆనుకొని ఉన్న బట్టలు ఆరేసే ఇనుప దండెంకు కూడా విద్యుత్ సరఫరా జరిగింది. అది గమనించక దండెం మీద ఆరేసిన బట్టలు తీయడానికి రామలక్ష్మి వెళ్లింది. దండెం వైరును పట్టుకోగా విద్యుత్ షాక్‌కు గురైంది. రామలక్ష్మి మనుమడు దుంప సాయి చరణ్ గమనించి అమ్మమ్మను కాపాడటానికి దండెం వైరును పక్కకు తీసే ప్రయత్నం చేయగా అతడూ విద్యుద్ఘాతానికి గురవడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, ఎస్ అశోక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి దుంప సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పేరుతో మోసం

- కంబోడియాలో మహబూబాబాద్ వాసి కష్టాలు



నవతెలంగాణ-బయ్యారం

విదేశాల్లో ఉద్యోగం వచ్చిందని సంతోషంతో ఆస్ట్రేలియాకు బయలుదేరిన ప్రకాశ్‌ను ఓ ఏజెన్సీ కంబోడియాకు పంపింది.. అక్కడ ఇబ్బందులకు గురి చేయడంతో తను పడుతున్న కష్టాలను వీడియో రూపంలో సోషల్‌మీడియాలో అతడు పోస్ట్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ప్రకాశ్.. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. విదేశాల్లో ఉద్యోగం చేయాలన్న ఆశతో మూడు నెలల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఏజెన్సీని సంప్రదించాడు. ఏజెన్సీ వాళ్లు ఆస్ట్రేలియా అని చెప్పి బ్యాంకాక్‌కు.. అక్కడి నుంచి కంబోడియాకు తీసుకెళ్లారు. అక్కడ మూడు రోజులకు ఒక పూట తిండి పెడుతూ, మత్తు ఇంజెక్షన్లు చేసి, బెల్టుతో కొడుతూ, షాక్ ట్రీట్మెంట్ ఇస్తున్నారని బాధితుడు సెల్ఫీ వీడియోల ద్వారా తెలిపాడు. రెండు రోజుల క్రితం ప్రకాశ్‌ను కంబోడియా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. తనను ఆదుకోవాలని, అక్కడ వాళ్లు తనని చిత్రహింసలు పెడుతున్నారని ప్రకాష్ ఓ వీడియో ద్వారా తన అన్న ప్రశాంత్‌కు పంపించడంతో పాటు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దాంతో ఈ వార్త మండలంలో చర్చనీయాంశంగా మారింది. కాగా, ప్రకాశ్ తల్లిదండ్రులు చనిపోగా, అతనికి అన్న, చెల్లి ఉన్నారు.

భూ వివాదం.. కత్తులతో దాడి

- యువకుడి మృతి, మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- నారాయణఖేడ్ చాంద్‌ఖాన్‌పల్లిలో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

భూ వివాదంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగ్గా.. ఓ గ్రూపు వారు కత్తులతో దాడి చేయడంతో యువకుడు మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాల్టీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో సోమవారం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. అంకం లక్ష్మయ్య, బాబుకొండ మల్లయ్య కుటుంబ సభ్యుల మధ్య చాంద్‌ఖాన్‌పల్లి శివారులో ఉన్న అసైన్డ్ భూ వివాదం 20 ఏండ్లుగా కొనసాగుతుండగా.. కోర్టులో కేసు నడుస్తున్నది. కాగా, సోమవారం బాబుకొండ మల్లయ్య కుటుంబ సభ్యులు ఆ భూమిలో చెట్లు నరికారు. ఈ విషయం తెలుసుకున్న అంకం లక్ష్మయ్య, కుమారుడు అశోక్‌తోపాటు రాములు ముగ్గురు కలిసి అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ఇరు కుటుంబ సభ్యుల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బాబుగొండ మల్లయ్య గ్రూపు అంకం లక్ష్మయ్య కుటుంబంపై కత్తులతో దాడి చేయగా.. అంకం అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అంకం రాములు తీవ్రంగా గాయపడగా సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రేవంత్‌రెడ్డి నామ్‌కే వాస్తే సీఎం : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రేవంత్‌రెడ్డి నామ్‌కే వాస్తే ముఖ్యమంత్రిగా మారారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు.సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.ప్రజా సమస్యలపైనా, ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అవినీతిపైనా ఆయన ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు.శాఖలవారీగా సీఎం పెడుతున్న సమీక్షలకు సంబంధిత శాఖల మంత్రులే రావడం లేదన్నారు.అధిష్టానానికి మాత్రమే తాము జిమ్మేదారి అన్నట్టుగా అమాత్యులు వ్యవహరిస్తు న్నారన్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో వసూళ్ల కోసం,సర్కారు ఖజానాను దోచుకోవడానికి ఢిల్లీలోని అధిష్టానం పాలనను నడిపిస్తుంటే.. అందులో,రాష్ట్ర మంత్రులంతా పావులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.కాంట్రాక్టర్‌కు రహదారుల శాఖ, రియల్ ఎస్టేట్ వ్యాపారికి రెవెన్యూ శాఖ, అనేక రకాలుగా సప్లయ్ చేసే వ్యక్తికి సివిల్ సప్లయ్ శాఖ మంత్రి పదవులు కట్టబెట్టారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.ఓవైపు రాష్ట్ర ఆస్తులు తరుగుతున్నాయనీ,మరోవైపు మంత్రుల ఆస్తులేమో రోజురోజుకు పెరుగుతున్నాయని ఆరోపించారు.సీఎం రేవంత్ రెడ్డి తరచూ విమానాల్లో వెళ్తూ ఢిల్లీ అధిష్టానానికి డబ్బులు చేరవేస్తున్నారనీ, ఈసారి ఆయన వెళ్లే సమయంలో విమానాన్ని ఈసీ తనిఖీ చేయాలని కోరారు.పరిశ్రమలు,ఐటీ శాఖకు సంబంధించిన విషయంలో చిన్నతరహా,సూక్ష్మ పరిశ్రమలకు వేలకోట్ల రూపాయల సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా దాటవేస్తోందని విమర్శించారు.

హెటిరో ల్యాబ్స్‌లో మంటలు..

- దట్టమైన పొగలతో భయాందోళనలో స్థానికులు
- ఫైర్ ఇంజన్లు మంటలార్పడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు
- ప్రాణ నష్టం జరగలేదు : స్థానికులు



నవతెలంగాణ-జిన్నారం

సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం పారిశ్రామికవాడలోని హెటిరో పరిశ్రమలో సోమవారం ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పరిశ్రమలోని హెడ్ రోలాక్స్ ఈటీపీ ప్రాంతంలో మంటలు చెలరేగడంతో అక్కడున్న రసాయనాలతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన కార్మికులు, స్థానికులు.. అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇవ్వడంతో స్థానిక పారిశ్రామికవాడకే చెందిన పరిశ్రమల నుంచి రెండు, నర్సాపూర్ జీడిమెట్ల ప్రాంతం నుంచి మరో రెండు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఫైర్ సిబ్బంది, సేఫ్టీ విభాగం యంత్రాంగం, ఫైర్ ఇంజన్లు, ఫోమ్ ద్వారా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగక పోవడంతో స్థానికులు, కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఈ ప్రమాద ఘటనపై హెటిరో పరిశ్రమ హెచ్ఆర్ ప్రతినిధి రవికుమార్ మాట్లాడుతూ.. ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియరాలేదన్నారు. ప్రమాదంపై విచారణ చేపట్టినట్టు చెప్పారు. అకస్మాత్తుగా చోటుచేసుకున్న ప్రమాదంపై ఫైర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చీఫ్ విభాగం, సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారులకు సమాచారం అందించామని తెలిపారు.

అధికార యంత్రాంగంపై స్థానికుల మండిపాటు

జిన్నారం మండలంలోని వివిధ పారిశ్రామిక వాడల్లో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నా. సంబంధిత అధికార యంత్రాంగం తగిన జాగ్రత్తలు, నిఘా వ్యవస్థను ఎందుకు ఏర్పాటు చేయడం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భద్రతాపరమైన అంశాలు, ప్రమాద నివారణా కార్యక్రమాలు, ఉత్పత్తుల ప్రక్రియ, ఉత్పత్తుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నైపుణ్యంతో కూడిన శ్రామిక శిక్షణ ఇతరత్రా అంశాలపై పారిశ్రామిక రంగానికి సంబంధించిన వివిధ రకాల విభాగాలు మరింతగా దృష్టి సారించాలని కోరుతున్నారు.



ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సోమవారం శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. పలు కాలనీలలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు.
నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

జూన్ 4న ఓట్ల లెక్కింపు

- పకడ్బందీగా నిర్వహించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్
- ఏడు నియోజవర్గాల ఏఆర్ఓలతో సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జూన్ 4వ తేదీన జరగనున్న మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్ నియోజకవర్గం ఏఆర్ఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ మీటింగ్ హాల్‌లో మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల ఏఆర్ఓలతో కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యల గురించి ఏఆర్వోలకు కలెక్టర్ సూచనలు చేశారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. కౌంటింగ్‌కు కావాల్సిన టేబుల్స్ నియోజకవర్గాల వారీగా.. మేడ్చల్-28, మల్కాజిగిరి-20, కుత్బుల్లాపూర్-28, కూకట్‌పల్లి-20, ఉప్పల్-20, ఎల్బీనగర్-28, సికింద్రాబాద్ కంటోన్మెంట్-14, పోస్టల్ బ్యాలెట్‌కు 20 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు కౌంటింగ్ కేంద్రాలు హెూలీ మేరీ కాలేజీలో, ఎల్బీనగర్‌కు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు సీఎస్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వెస్లీ కాలేజీలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అన్ని నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్స్ కౌంటింగ్ హెూలీ మేరీ కాలేజీలో ఉంటుందని తెలిపారు. ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. మొబైల్ ఫోన్లు లోపలికి అనుమతించం అని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కౌంటింగ్ హాల్స్‌లో టేబుల్స్, సీసీ కెమెరాలు, విద్యుత్, ఇంటర్నెట్, ఫ్యాన్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి టీ, స్నాక్స్, భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, ఏడు నియోజకవర్గాల ఏఆర్ఓలు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రమాబాయ్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం



- డాక్టర్ మల్లు ప్రతిభ రమేష్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్కనాగరాజు ఆధ్వర్యంలో రమాబాయ్, అంబేద్కర్ 89వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, జాతీయ దళిత నాయకులు మల్లు రమేష్ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ మల్లు ప్రతిభ రమేష్ హాజరయ్యారు. రమబాయ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మాత రమబాయ్ అంబేద్కర్ అంటే ఒక త్యాగం, ఒక పోరాటం ప్రతీ మగాడి విజయం వెనకాల ఒక మహిళ ఉంటుంది అనేదానికి రమబాయ్ జీవితమే ఉదాహరణ అన్నారు. చిన్న తనంలోనే అంబేద్కర్‌ను బొంబాయి ఫిష్ మార్కెట్‌లో వివాహం చేసుకొనే సమయానికి ఆమే వయస్సు తొమ్మిది సంవత్సరాలు.. ఉన్నత చదువుల కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ బరోడా మహారాజు సహకారంతో, లండన్‌కు వెళ్ళినప్పు డు ఇంటి భాద్యత తీసుకొని పిడుకలు అమ్మి వచ్చిన డబ్బులు కుటుంబం, అంబేద్కర్ చదువులకు పంపేదని పేర్కొన్నారు. రమబాయ్‌కి పుట్టిన ఐదు మంది సంతానంలో నలుగురు పిల్లలు మందులకు డబ్బులు లేక చిన్నతనంలోనే అనారోగ్యంతో మరణించారు. అయితే ఆమె ఏమాత్రం అధైర్య పడకుండా బడుగు, బలహీనవర్గాల ప్రజ ల కోసం, హక్కుల కోసం తమ కుటుంబాన్ని త్యాగం చేసిన గొప్ప త్యాగమూర్తి రమబాయ్ అంబేద్కర్ అని కొనియాడారు. తన కొడుకు చనిపోయినప్పుడు బాబాసాహెబ్ చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి చూస్తూ.. తన కొంగును చింపి కొడుకు శవం మీద కప్పింది. ఆమె జీవిత కాల కష్టమే ఈ రోజు రాజ్యాంగం ద్వారా అనుభవిస్తున్నారు... అనడంలో సందేహం లెదన్నారు. చివరికి ఈ పోరాటంలో అలిసి జబ్బుపడి చివరగా 1935 మే 27వ తేదీన విషజ్వరంతో ఆమె మరణించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత నాయకులు కర్కపెంటయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్, కార్మిక నాయకురాలు శారదారెడ్డి, అంబేద్కర్ అమరజ్యోతి అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కర్క డాకయ్య, ఏఐఏవైయస్ నగర కమిటి కార్యదర్శి వినయ్ కుమార్, కర్క శివశంకర్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్ జిల్లా, జీడిమెట్ల పరిధిలో దారుణం చోటుచేసుకుంది. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మ నగర్ ఫేస్ -1 కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి దారుణంగా హతమార్చారు. మధుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 24న చింతల్‌లో బిల్డర్ కుప్పాల మధు అదృశ్యమయ్యారు. అనంతరం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో ఆయన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మధును దుండగులు కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. దుండగులు బండరాయి తో మోది, కత్తితో పొడిచి హతమార్చారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వ్యాపారిని కిడ్నాప్ చేసిన వారే హతమార్చి ఉంటా రని అనుమా నిస్తున్నారు. ఆయన దగ్గర ఉన్న రూ.5 లక్షల నగదు, విలువైన ఆభరణాలు మాయమయ్యాయి. మధును శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటికి వచ్చిన కల్పన సొసైటీకి చెందిన మిత్రుడు రేణుకా ప్రసాద్, మరో ఇద్దర నిఖిత్, గోపీలు ఇంటి నుంచి తీసుకెళ్లినట్లు ... ఇంట్లో వారికి ఫోన్ చేసి సదరు ముగ్గురితో కలిసి పని మీద బీదర్‌కు వెళ్లి... తిరిగి వస్తున్నట్లు సమాచారం... సమీపంలోని టోల్ గేట్లలోని సీసీ ఫుటేజీలు ఆధారంగా మధుతో పాటు ఆ ముగ్గురే ఉన్నారని, పైగా వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ ఉండడంతో పాటు జాడ లేకపోవడం వంటి పలు అంశాలు అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం అయ్యి ఉండొచ్చని తెలుస్తోంది.ఆ దశగానే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'స్టాండ్ ఆఫ్ లెర్నింగ్ గ్యాప్స్' ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2021 ప్రకారం మన దేశంలో పిల్లల్లో నేర్చుకునే అంతరాయాల సమస్య 6 కోట్ల మంది పిల్లలపై పడుతుంది. దీన్ని గుర్తించేందుకు పీఅండ్‌జీ ఇండియా ప్రధాన సీఎస్ కార్యక్రమం అయిన పీఅండ్‌జీ శిక్ష తన ప్రచార కార్యక్రమం 'స్టాండ్ ఆఫ్ లెర్నింగ్ గ్యాప్స్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంపై కేంద్రీకృతమైన ప్యానల్ చర్చ రచయిత్రి, మాజీ జర్నలిస్టు ప్రియాంక ఖన్నాతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ సభ్యులు లెర్నింగ్ గ్యాప్స్ సమస్య ఉన్న పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించారు. ఈ సందర్భంగా సభ్యులు సొంత అనుభవాలను ప్రస్తావించారు. పిల్లలందరికీ తోడ్పడే రీతిలో ఉండే అభ్యసన వాతావరణాన్ని సృష్టించడానికి అధ్యాపకులు, తల్లిదండ్రులు, సమాజం మధ్య సహకారం ప్రాముఖ్యతను చర్చించారు.

అల్యూమినియం వర్క్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్

- ఎగిసిన మంటలు
- తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



షార్ట్ సర్క్యూట్ కారణంగా రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్ బస్ స్టాప్ ప్రాంగణం మెయిన్ రోడ్‌లో గల అల్యూమినియం వర్క్ షాప్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గిరినగర్ బస్ స్టాప్ ఆవరణలో రఫీ అల్యూమినియం తలుపులు, కిటికీలు ఇతరత్రా ముడి సరుకు తయారీ వర్క్ షాప్ నడుపుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా ఈ ఘటన జరగడంతో వర్క్ షాప్‌లో పనిచేస్తున్న కార్మికులు ఆందోళన చెంది ఉరుకుల పరుగులు తీశారు. వర్క్ షాప్‌లో గల అల్యూమినియం ముడి సరుకు పూర్తిగా మంటల్లో దగ్ధమైపోయాయి. వెంటనే వర్క్ షాప్ నిర్వాహకుడు రఫీ పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్‌ను రప్పించి, మంటలను ఆర్పి వేశారు.

కొంపల్లిలో 'దాదూస్' అవుట్‌లెట్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సాంప్రదాయ, సమకాలీన భారతీయ స్వీట్లు, స్నాక్స్‌కు ప్రసిద్ధి చెందిన ప్రఖ్యాత బ్రాండ్ 'దాదూస్' తమ సరికొత్త అవుట్‌లెట్‌ను కొంపల్లిలో ప్రారంభించినట్టు ప్రకటించింది. ఈ తాజా అవుట్‌లెట్ నగరంలో వారి పదో స్టోర్‌గా నిలుస్తుంది. అన్ని రకాల ఉత్పత్తులను సౌకర్యవంతంగా ఒకే చోట ఇక్కడ అందించనున్నారు. ఈ సందర్భంగా దాదూస్ యజమాని రాజేష్ దాదు మాట్లాడుతూ " మేం ఇక్కడ నుంచి గొప్ప విజయాన్ని ఆశిస్తున్నాం. మా బ్రాండ్ ఇటీవలి సంవత్సరాల్లో వేగంగా విస్తరిస్తోంది. ఈ ఏడాది రాబోయే అత్యాధునిక ఫ్యాక్టరీ స్థాపనతో గణనీయమైన వద్ధికి సిద్ధంగా ఉంది. ఈ కొత్త అవుట్‌లెట్ దాదుస్ గ్రూప్ మొత్తం పోర్ట్‌ఫోలియోను మెరుగుపరుస్తుంది. మేం సమీప భవిష్యత్‌లో మరిన్ని శాఖలను ఆవిష్కరించడానికి ప్రణాళికలు కలిగి ఉన్నాం" అని అన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం 33/11కెవి హెచ్‌ఎంటి హిల్స్ సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11కెవి ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలోని ఉదయం 11:00 గంటల నుంచి 12:30 గంటల వరకు తులసినగర్ రోడ్ నెం 1,2, హెచ్‌ఎంటీ హిల్స్ వాటర్ ట్యాంక్ లేన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని భాగ్యనగర్ ఎ.ఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 33/11కెవి కేపీహెచ్‌బీ సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11కెవి జల వాయు విహార్ ఫీడర్ పరిధిలోని మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలకాపరులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల నట్టాల నివారణ మందులను తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 10 లక్షల మంది గొర్రెలు మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నారన్నారని తెలిపారు. గొర్రెల మంద వద్దకు వెళ్లి నట్టాల మందులను సరఫరా చేయాలన్నారు. రాష్ట్రంలో సుమారు 2 కోట్ల గొర్రెలు, మేకలు ఉన్నాయనీ, వీటికి నట్టాల నివారణ మందులను సకాలంలో పంపిణీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో గొర్రెల కాపరులు ప్రయివేటు దాఖానాలకు వెళిలి నట్టాల నివారణ మందులను తెచ్చుకుని అప్పులపాలవుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే గొర్రెల పంపిణీ చేస్తామన్న హామీని సీఎం రేవంత్ రెడ్డి తుంగలో తొక్కారన్నారు. గొల్ల కురుమలు డీడీలు కట్టి ఏండ్లు గడుస్తున్నా గొర్రెలు రాక అప్పులపాలయ్యారన్నారు. గతంలో ఉన్న టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు సకాలంలో నట్టాల నివారణ మందులను పంపిణీ చేశాయని గుర్తు చేశారు.



ఆల్విన్ కాలని డివిజన్ ఆల్విన్ కాలనీ పరిధిలోని, భవ్యస్ తులసివనం అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో, నిర్వహించిన వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనిల్ రెడ్డి, ఆనంద్ ప్రసాద్, ఎం.ఆర్.కె రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ -కూకట్‌పల్లి

విద్యుత్ షాక్‌కు గురై .. చికిత్స పొందుతు మహిళ మృతి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



విద్యుత్ షాక్ గురై చికిత్స పొందుతు వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో హసన్ అన్సారీ, భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఓ ప్రయివేటు ప్లాస్టిక్ కంపెనిలో పని చేస్తు జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 26న రాత్రి సమయంలో ఇంటిలో విద్యుత్ సౌకర్యం లేక పోవటంతో అపార్ట్‌మెంట్ ఉన్న ఇతర గదిలోకి వెళ్ళబోయిన సమయంలో ఆ గది తాళంను ఇనుప రాడ్డుతో భార్య నేహ కతున్ (27) పగుల గొట్టిన సమయంలో పైన ఉన్న విద్యుత్ వైర్ షాక్ గురై అక్కడికి అక్కడే పడి పోయినట్లు తెలిపారు. ఆమెను హుటా హుట్యాటిన చికిత్స నిమిత్తం కాటేదన్‌లోని జయదేవ్ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆస్పత్రి కి తరలించగా... చికిత్స పొందుతూ 3గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భర్త పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

'కామినేని'లో తలసేమియా చికిత్సలు

- తల్లిదండ్రులకు పరీక్షలు, జన్యు కౌన్సెలింగ్
- హెమటాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ సచిన్ జాదవ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

థలసేమియా లాంటి ప్రమాదకరమైన వ్యాధి గురించిన అవగాహన, జన్యు కౌన్సెలింగ్, చికిత్సలన్నీ అందించే సమగ్ర క్లినిక్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్నారు. ఆస్పత్రికి చెందిన హెమటాలజీ, బోన్మారో ట్రాన్స్ప్లాంటేషన్ విభాగాధిపతి, ఇంటర్నేషనల్ హెమటాలజీ కన్సార్షియం చైర్మెన్ డాక్టర్ సచిన్ జాదవ్ పలు అంశాలను వివరించారు. "థలసేమియాను ముందుగానే గుర్తించగలం. పెండ్లికి ముందు జాతకాలు చూపించినట్టే కాబోయే వధూవరులిద్దరికీ థలసేమియా పరీక్షలు కూడా చేయించాలి. ఇద్దరిలో ఎవరైనా థలసేమియా క్యారియర్లు అయితే ముందుగానే జన్యుకౌన్సెలింగ్ తీసుకోవడం చాలా ముఖ్యం. దానివల్ల భవిష్యత్తులో పుట్టే పిల్లలకు ఇబ్బందులు రాకుండా ఉంటాయి. ఒకవేళ ఆ దశలో పరీక్షలు చేయించకపోయినా, గర్భం దాల్చినప్పుడైనా చేయాలి. భార్యకు థలసేమియా మైనర్ ఉందని తెలిస్తే అప్పుడు భర్తనూ పరీక్షించాలి. ఇద్దరికీ ఉంటే 15-16 వారాల సమయంలో పిండానికి కూడా పరీక్షలు చేస్తాం. ఒకవేళ పుట్టే బిడ్డకు థలసేమియా మేజర్ ఉంటుందని తెలిస్తే, ఆ సమయంలోనే తల్లిదండ్రుల ఇష్టాన్ని బట్టి గర్భస్రావం చేయించుకోవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత 5-6 నెలల వరకు ఎలాంటి సమస్య ఉండదు. ఆ తర్వాత హెమోగ్లోబిన్ 4-5 గ్రాములకు పడిపోతుంది. అప్పుడు పిల్లల వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్తే పరీక్షించి రక్తం ఎక్కిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి నెలకు ఒకటి నుంచి రెండుసార్లు ఇలా రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. థలసేమియా వ్యాధిగ్రస్తులకు జర్మనీ ఫౌండేషన్ సాయంతో ఉచితంగా హెచ్ఎల్ఏ పరీక్షలు చేస్తున్నాం. దీనికి ఒక్కొక్కరికి దాదాపు రూ.15 వేలు అవుతుంది" అని వివరించారు. అనంతరం పీడియాట్రీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రీషియన్ డాక్టర్ ఎస్.నరసింహారావు, కన్సల్టెంట్ పీడియాట్రీషియన్, పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ కంచన్ ఎస్.చన్నావర్ ప్రసంగించారు. అనంతరం థలసేమియాపై అవగాహన కల్పించేందుకు కేసు స్టడీలతో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ పీడియాట్రీషియన్, నియోనాటాలజిస్టు డాక్టర్ ఆర్.వి.సౌజన్య, కన్సల్టెంట్ హెమటో ఆంకాలజిస్టు డాక్టర్ వై.నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో- కన్వీనర్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ-నాగోల్

విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో - కన్వీనర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శిల్పా క్రియేషన్స్, ఆర్ట్స్ కాపర్తి కాన్సర్ ఫౌండేషన్ ట్రస్ట్, బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ తిరుపతి, శిల్ప ఆర్ట్స్ చైర్మెన్ కాపర్తి ప్రకాశ్ ఆధ్వర్యంలో శ్వేత గార్డెన్ కొత్తపేటలో 2023-2024 సం॥ లో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 55 మంది విద్యార్థులకు పురస్కారాలు సన్మానించారు. 10 మంది ఆదర్శ దంపతుల పురస్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి తల్లిదండ్రలకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అలాగే భవిష్యత్‌లో ఐఏఎస్, ఐపీఎస్ లాంటివి సివిల్ సర్వీసులను సాధించి, తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్ వి కుమార్, ఎంఎల్ఆర్ గుప్త, దిల్సుక్ నగర్ సాయి బాబా దేవాలయం చెర్మెన్ గుండ మల్లయ్య, బచ్చు గంగాధర్ గుప్త, భుగ్గరపు దయానంద్, ఉపేందర్, ఎల్ వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



- కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రతీ కార్యకర్త బీజేపీ బలోపేతానికి సైనికుడిలా పని చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్ కార్యకర్తలకు భరోసానిచ్చారు. సోమవారం సాయంత్రం నియోజకవర్గ పరిధి గాజుల రామారం డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షుడు సాయినేతల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల విస్తృత సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ చరిత్ర సృష్టించబోతుందని జోస్యం చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు అండ కమలం జెండా అని పేర్కొన్నారు. అనంతరం అసెంబ్లీ కన్వీనర్‌గా జెకె.శేఖర్ యాదవ్, కో కన్వీనర్‌గా శివాజీ రాజులు ఎన్నికైన సందర్భంగా బీజేపీ శ్రేణులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగారం మల్లేష్, చక్రి, బాలకృష్ణ, యాదగిరి రెడ్డి, మురళి, కార్యకర్తలు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రావాలని ఆహ్వానం



నవతెలంగాణ-ఆల్వాల్

జూన్ రెండో తేదీన బొల్లారంలో నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం రావాలని మల్కాజిగిరి నియోజకవర్గం టీజేఎస్ నాయకులు, మచ్చ బొల్లారం ఉద్యమకారులు ఆహ్వానించారు. సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకులు ఏర్పుల దయాకర్, రెడ్డిపల్లి శ్రీనివాస్, పుట్నాల కృష్ణ, గణేష్, తదితరులున్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

మంగళవారం | మే 28, 2024 | www.navatelangana.com

నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : వర్కాల శివకిషోర్‌గౌడ్



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రభుత్వ నిబంధనలను ఉలంఘించే ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యువజన సంఘాల నాయకుడు వర్కాల శివకిషోర్ గౌడ్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి సర్కారు జీవో నెంబరు1 తీసుకువచ్చిందని పేర్కొన్నారు. సదరు జీవో ప్రకారం ప్రయివేటు పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయించవద్దని తెలిపారు. కొన్ని ప్రయివేట్, కార్పొరేటర్ పాఠశాలలు జీవో నెం1 ఆటకెక్కించి మితిమీరిన ఆగడాలను ప్రదర్శిస్తున్నాయని వాపోయాడు. పాఠ్యపుస్తకాలతో పాటుగా యూనిఫారంలను విక్రయిస్తూ తల్లిదండ్రుల రక్తం తాగుతున్నారన్నారు. అదే విధంగా తిరుపతిరావు కమిటీ ప్రకారం ఫీజులను వసూళ్లు చేయడం లేదని, ఏడాపెడ ఫీజులు పెంచుతూ చదువులను అమ్ముకోంటున్నారని పేర్కొన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ స్పందించాలని డిమాండ్ చేశారు.

అన్నపూర్ణ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ సమస్యలను తెలుసుకోడానికి కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ సోమవారం పర్యటించారు. ఖాళీ ప్లాట్‌లో ఉన్న మినీ డంపింగ్‌ను సందర్శించి చాలా రోజులుగా పేరుకుపోయిన చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..ఖాళీ ప్లాట్‌లో చెత్త భారీ మొత్తంలో ఉండడంతో స్థానిక ప్రజలకు ఇబ్బంద్దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దుర్వాసనతో అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉన్నందున్న చెత్త తరలింపునకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పాండాల నరసింహ గౌడ్, సెక్రెటరీ సంజయ్ నాయక్, ఆర్గనైజర్ సెక్రెటరీ రాజమల్లు, కాలనీ పెద్దలు, మహిళలు, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

సివరేజ్ ఔట్ లేట్‌ను పరిశీలించిన శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లో 25 మీటర్ల సివరేజ్ ఔట్ లేట్ పాక్షికంగా దెబ్బతినడంతో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ జీహెచ్‌ఎంసీ, యూజీడీ ఏఈ సందీప్, ఇంజనీరింగ్ ఏఈ కీర్తిలతో కలిసి సోమవారం పరిశీలించారు. దెబ్బతిన్న సివరేజ్ అవుట్‌లేట్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కీసర

కీసర మండల కేంద్రంలో గండు సత్తమ్మ పుంద్రు రమేష్ చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను కీసర మాజీ ఎంపీటీసీ బలిదే రమేష్ గుప్తా సోమవారం పరామర్శించారు. తన వంతు సాయంగా రూ. 5వేల చొప్పున ఇద్దరి కుటుంబాలకు రూ.10వేలు అంత్యక్రియల కోసం అందజేశారు. ఈ సందర్భంగా పేదలకు ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానన్నారు.

పనుల్లో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు : కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. సోమవారం చిల్కానగర్ డివిజన్‌లోని సాయిరాం నగర్, కాలనీలో సీవరేజ్ పైప్‌లైన్ పనులను వాటర్ వర్క్స్ ఏజీఎం సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాటా డుతూ.. ఎలన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా తీరుస్తాన న్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమైన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి వచ్చే వర్షాకాలం కల్లా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, బాలు, శ్యామ్ సాయిరాం నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు దుర్గాప్రసాద్, నరసింహ, వేణుగోపాల్‌రెడ్డి, వర్మ, సాంబశివశాస్త్రి, రూమి, ప్రసాద్, సునంద, పద్మ తదితరులున్నారు.

ఉప్పల్‌లో సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ డివిజన్‌లోని ప్రజా సమస్యలపై, వర్షాకాలంలో తీసుకున్న ముందస్తు చర్యల పై, పారిశుధ్య డ్రయినేజీ, అక్రమ కట్టడాలు, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ వాటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బీజేపీ నాయకులు గొరిగే కృష్ణ, దేవేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, పాలకులు విఫలమైయ్యారని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రావుల బాలకృష్ణాగౌడ్, మహిళా మద్దెల పద్మ, డివిజన్ దువ్వాల రమేష్, యువ మోర్చా డివిజన్ అధ్యక్షులు ఈదులకంటి నవీన్ గౌడ్, శాంత రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాలు లేక అవస్థలు

- జవహర్ నగర్‌లో మూత పడిన సెంటర్లు
- ఏడాదిగా ఇబ్బంది పడుతున్న ప్రజలు
- మార్పులు, చేర్పులకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి

నవతెలంగాణ-జవహర్ నగర్

ఆధార్ కేంద్రాలు మూతపడి ఉండడంతో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతేడాది నుండి స్థానిక రెవెన్యూ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో ఆధార్ సెంటర్లను మూసివేశారు. వాటి నిర్వాహకులు నమోదు ప్రక్రియలో కొన్ని పొరపాట్లు చేయడం మూలంగా ఆపరేటర్లను తొలగించారు. వారి స్థానంలో తిరిగి కొత్తవారిని నియమించాల్సి ఉన్నా అందుకు జిల్లా ఆధార్ కేంద్రం యూఐడీ నిర్వాహకులు ముందుకు రాకపోవడంతో ఈ సమస్య వెంటాడుతున్నది. జవహర్ నగర్ పేరుకు గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్ గ్రేడ్ చెందిన ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది.



జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం



మూతపడిన ఆధార్ నమోదు కేంద్రం

దేశంలోని ప్రతి పౌరుడికి విశిష్ట సంఖ్య ఉండాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆధార్‌ను అమలు చేశారు. ఆధార్ అనేది భారత ప్రభుత్వం అందించిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య. భారతీయులకు ఆధార్ కార్డ్ ఇప్పుడు అత్యంత ముఖ్యమైన పత్రం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అన్నింటికీ ఆధార్‌ను అనుసంధానం చేయడంతో, ఇంతకుముందు ఉన్న ఓటర్ కార్డ్, రేషన్ కార్డులకు భిన్నంగా ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్పుగా ఉండటంతో ప్రభుత్వ పథకాలను పొందేందుకు ఇబ్బందికరంగా మారుతుంది. దీంతో ప్రభుత్వ అధికారులు ఆధార్ అప్డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఎండాకాలం సెలవులు ముగిసి వచ్చే నెల నుంచి విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల పుట్టిన తేదీలు, ఫింగర్ ప్రింట్ల అప్డేట్ కోసం పిల్లల తల్లిదండ్రులు ఆధార్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. పెద్దవాళ్ల గ్యాస్ సబ్సిడీ, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి కావడంతో అడ్రస్, ఫింగర్ ప్రింట్, పుట్టిన తేదీల మార్పుల కొరకు ఆధార్ సెంటర్లకు వెళ్లిన వారికి నిరాశ ఎదురవుతుంది. సుమారుగా మూడు లక్షల జనాభా కలిగిన జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 28 డివిజన్లు ఉండగా ఒక ఆధార్ సెంటర్ కూడా లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు తక్షణమే జవహర్‌నగర్‌లో ఆధార్ సెంటర్ లను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే

జవహర్ నగర్ వాసులు కొత్త ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలనా, చేర్పులు, మార్పులు చేసుకోవడానికి దమ్మాయిగూడ, అల్వాల్, ఏఎస్‌రావు నగర్ తదితర దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడకు వెళ్లినా పనులు త్వరితగతిన కావడం లేదు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ పథకాల నేపథ్యంలో ముందు చూపుగా ప్రతి కేంద్రంలో ప్రజలు బారులు తీరుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని మూతపడిన ఆధార్ కేంద్రాలను తెరిపించాలని పలువురు కోరుతున్నారు.

ఆధార్ కేంద్రం లేక ఇబ్బంది పడుతున్నాం



నాకు ఇద్దరు పిల్లలు రేషన్‌కార్డు లింక్ కోసం రేషన్ షాపునకు వెళ్లాను. అక్కడ పిల్లల వేలి ముద్రలు పడకపోవడంతో ఆధార్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. జవహర్ నగర్ లో ఎక్కడికి వెళ్లినా ఆధార్ సెంటర్లు అన్ని మూతపడి ఉన్నాయి. ఇందుకోసం దమ్మాయిగూడకు వెళ్లాల్సి వచ్చింది. వెంటనే మూతపడిన ఆధార్ కేంద్రాలను తెరిపించాలి.

-గాజుల తిరుపతి, ప్రగతి నగర్ నివాసి

ఆధార్ కేంద్రం ఇక్కడే ఏర్పాటు చేయాలి



నాకు నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు. ఆధార్ కార్డు నమోదు కోసం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లితే ఆధార్ సెంటర్ నడవడం లేదని మున్సిపల్ సిబ్బంది తెలిపారు. దీంతో ఏఎస్ రావు నగర్‌కి వెళ్లి చిన్న బాబుతో వేచి ఉండేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. అదే మన దగ్గర ఉంటే ఇలాంటి ఇబ్బంది తప్పేది. తక్షణమే ఆధార్ కేంద్రాలను తిరిగి ఏర్పాటు చేయాలి.

-వడ్డేపల్లి శివకుమార్, బీజేఆర్ నగర్ నివాసి

ప్రజా అవసరాలను గాలికి వదిలేసిన పాలకవర్గం



ప్రజల అవసరాలు తీర్చేందుకు ఎన్నుకోబడ్డ కార్పొటర్లు అవిశ్వాసం పేరుతో డబ్బులు వెనకకు వేసుకోవడం తప్ప ప్రజల అవసరాలను పట్టించుకోవడం లేదు. ఏడాదిగా ఆధార్ సెంటర్ మూతపడి ఉన్నా ఏ ఒక్క కార్పొరేటర్ దీనిపై దృష్టి సారించలేదు. ఇప్పటికైనా ప్రజల అవసరాలను గుర్తించాలి. సంక్షేమ పథకాలకు ఆధార్‌ను అనుసంధానం చేసే అధికారులు, ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా ఆధార్ కేంద్రానికి వచ్చే ప్రజలకు సత్వరమే పనులు జరిగేలా చూడాలి.

-జంగిడి శ్రీనివాస్, బాలాజీ నగర్ నివాసి

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం



గతంలో ఉన్న ఆపరేటర్లు చిన్న చిన్న పొరపాట్లు చేయడం మూలంగా జిల్లా యూఐడీ అధికారులు వారిని తొలగించారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత నూతన సిబ్బందితో ఆధార్ సెంటర్లను తెరిపించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తాం.

-తాజ్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్

చెరువు కాలువను పూడ్చి ప్లాట్లు ఏర్పాటు

- కాలువ కబ్జాతో కోట్లు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



నవతెలంగాణ-కీసర

వచ్చే వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా వరదనీటి ప్రవాహానికి నాలాలు, కాలువలు క్లియర్ చేయాలని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇక్కడి అధికారులకు ఇవేమీ పట్టడం లేదు. చెరువులు, కుంటలు, కాలువల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన వారు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో కబ్జాలకు గురవుతున్నాయి. నగర శివారులో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో అక్రమార్కులు చెరువులు, కాలువలకు డాక్యుమెంట్‌లు సృష్టించి పాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కాలువను పూడ్చి పాట్ల హద్దురాళ్లు పాతి దర్జాగా మార్కెట్‌లో పెడుతున్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి పాత చెరువు కాలువను కొందరు రియాల్టర్లు కబ్జా చేసి ప్లాట్లుగా మార్చడంతో ఇటీవల స్థానికులు అడ్డుకున్నారు.

రాంపల్లి గ్రామంలోని పాత చెరువు సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువుకు రెండు కాల్వలు ఉండగా వర్షం నీరు భారీగా చేరినప్పుడు ఈ కాల్వల ద్వారా నీరు ప్రవహిస్తుంది. ఒక కాలువ నుండి రాంపల్లి, చర్లపల్లి రోడ్డులో నీరు ప్రవహిస్తుండగా మరో కాలువ శ్రీరామలింగేశ్వర కాలనీ, సుచిత్ర కాలనీల గుండా చెరువు నీరు ప్రవహిస్తుంది. దీంతో సమీప రైతులు వ్యవసాయం చేసుకుంటారు.



చెరువు కాల్వను పూడ్చి..ప్లాట్‌లుగా మార్చి..

చెరువు కాలువ దారి శ్రీరామలింగేశ్వర కాలనీ సర్వే నంబర్ 380కి, సుచిత్ర కాలనీ సర్వే నంబర్ 342, 344, 374, 375, 376, 377 రెండింటికీ అనుకుని ఉంది. ప్రస్తుతం చెరువు కాలువను కొందరు వ్యక్తులు పూడ్చి ప్లాట్‌లుగా మార్చారు. సుచిత్ర కాలనీ లేఔట్ చేసినప్పుడు లేఔట్‌లో 163 ప్లాట్‌లు ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు మరో లేఔట్‌గా సృష్టించి ప్లాట్ నంబర్‌లు 164 ,165 ,166 ,167 ,168 ,169 ,170 ,171 ,172,173లుగా రాసి కడీలను పాతారు. కోట్ల విలువ చేసే స్థలాన్ని అమాయక ప్రజలకు విక్రయించేందుకు రియాల్టర్లు సిద్ధమయ్యారు.

కాల్వ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



చెరువు కాల్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు పూడ్చి ప్లాట్‌లుగా మార్చేందుకు ఆ స్థలాన్ని చదును చేసి కడీలను ఏర్పాటు చేసి ప్లాట్ నంబర్లు రాశారు. సోమవారం రాంపల్లి గ్రామ యువకులు అక్కడికి చేరుకుని చెరువు కాల్వను జేసీబీ సహాయంతో కాల్వను యథావిధిగా తొవించారు. ప్లాట్ లు చేసిన వ్యక్తితో గ్రామస్తులు వాగ్వివాదం చేశారు. చెరువు కాల్వ కబ్జాదారులపై అధికారులకు ఫిర్యాదు చేస్తాం. కాల్వ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి.

-రామారం వినోద్ గౌడ్, రాంపల్లి గ్రామస్తుడు

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను పరిశీలించిన స్పెషల్ టీమ్



నవ తెలంగాణ-శామీర్ పేట

పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలమేరకు సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్పెషల్ టీమ్ సభ్యులు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను, ప్రస్తుతం జరుగుతున్న పనులను వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం, నర్సరీలు, కంపోస్టు షెడ్లు, హరితహారం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌డీ స్పెషల్ ఆఫీసర్ మమత, డీఆర్‌డీవో సాంబశివరావు, ఈసీ సూర్య, శివ తదితరులు పాల్గొన్నారు.



మేడిపల్లి పోలీసుల అదుపులో చిన్న పిల్లల విక్రయ ముఠా ?

- గుంటూరులో పట్టుకున్న పోలీసులు
- ఢిల్లీ కేంద్రంగా దందా కొనసాగిస్తున్న మధ్యవర్తులు

నవతెలంగాణ-బోడుప్పల్

చిన్న పిల్లలను విక్రయించే ముఠాను పట్టుకుని వారి నుంచి 23 రోజుల బాలికను స్వాధీనం చేసుకుని ముఠాను అదుపులోకి తీసుకున్న సంఘటన మేడిపల్లి పీఎస్‌లో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్లితే.. చిన్న పిల్లల విక్రయించే ఓ వ్యక్తి పిల్లల అమ్మకం ఏజెంట్‌గా ఉంటూ సరోగసి, ఐవీఎఫ్, టెస్ట్ ట్యూబ్ బేబి నుంచి అమ్మకాలకు పెడుతున్న ఘటన కలకలం రేపింది. ఢిల్లీలో ఉంటూ మధ్యవర్తుల నుంచి విజయవాడ గుంటూరు జిల్లాలకు ఇతర వ్యక్తుల నుండి చిన్న పిల్లలను తరలిస్తూ రూ.2.50 లక్షల చొప్పున వారికి తెలిసిన వ్యక్తులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు గుంటూరులోని నరసరావుపేట దగ్గర పిల్లలను అమ్ముతుండగా మేడిపల్లి పోలీసులు మాటు వేసి ముఠాను పట్టుకున్నారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి బాలికను అప్పజెప్పారు. ఆ బాలికకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి శిశు విహార్‌కి తరలించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలల సమితి సభ్యురాలు అర్చన, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం విభాగం సభ్యులు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు. కాగా వారం రోజుల క్రితమే మేడిపల్లి పోలీసులు పీర్జాదిగూడ లో ఆడపిల్లను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఈ ముఠా మూలాలు ఇంకా ఎక్కడెక్కడ విస్తరించి ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-కీసర

కీసర మండల పరిధిలోని భోగారం గ్రామంలోని హెూలీ మేరీ కళాశాలలో మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం అసెంబ్లీ సెగ్మెంట్‌లైన మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి,ఉప్పల్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను మల్కాజిగిరి జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్, కమిషనర్ ఆఫ్ పోలీస్ తరుణ్ జోషి, డీసీపీ పద్మజతో కలిసి కలెక్టర్ గౌతమ్ సోమవారం పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి కౌంటింగ్ సెంటర్‌లో సీసీ కెమెరా, బారికెడింగ్, కరెంటు ఇంటర్నెట్, మౌలిక వసతుల గురించి కలెక్టర్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు వివరించారు. ఏజెంట్‌ల సమక్షంలో కౌటింగ్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి తదితరులున్నారు.

గుట్కా నిషేధంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం

- కాంగ్రెస్ నేత కుండ భానుచందర్



నవతెలంగాణ-మేడ్చల్

గుట్కా నిషేధంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ యువ నాయకుడు కుండ భానుచందర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పొగాకు, గుట్కా, పాను మసాలాలాంటి వ్యసనాలకు అలవాటు పడి ఎంతో మంది యువత అనారోగ్యానికి గురై కుటుంబాలకు దురమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు, గుట్కా పాన్ మసాలాలు తీసుకోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. పొగాకు గుట్కాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధి బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. యువత చెడు అలవాట్లు మానుకొని మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. చెడు అలవాట్లకు పోయి తల్లిదండ్రులకు భారం కావద్దని విజ్ఞప్తి చేశారు.

మేడ్చల్ నుంచి కిష్టపూర్ వెళ్లే రోడ్డు గుంతలమయం

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- వార్డు కౌన్సిలర్ చొరవ చూపాలని విన్నపం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ నుంచి కిష్టాపూర్‌కు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు పై ఏర్పడ్డ గుంతలతో, ఇష్టానుసారంగా తవ్వకాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు కేఎల్‌ఆర్ వెంచర్ కమాన్ నుంచి వాగు వరకు అంతర్గత డ్రయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిస్తే మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. మురుగునీరు పోవడానికి రోడ్డు పక్కన కొంత దూరం మేర తీసిన కాలువతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇండ్లకు అంతర్గత డ్రయినేజీ, మంచి నీటి కోసం, వివిధ కేబుల్ వైర్లు, ఇతర పనుల నిమిత్తం రోడ్డును ఇష్టానుసారంగా తవ్వి సక్రమంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారి పడుతున్నారు. మున్సిపల్ అధికారులు రోడ్డును తొవ్వడం కోసం నగదు డిపాజిట్ చేసుకోవడంపై పెట్టిన దృష్టి సదరు వ్యక్తులు తవ్విన రోడ్డుకు సరైన మరమ్మతులు చేశారా లేదా అని పరిశీలించకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. స్థానిక 15వ వార్డు కౌన్సిలర్ జంగా హరికృష్ణ యాదవ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షాకాలానికి మొక్కలు సిద్ధంగా ఉంచుకోవాలి

- జడ్పీసీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి
- మాడ్గులలో నర్సరీ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

రాబోయే వర్షాకాల సీజన్‌కి అన్ని గ్రామాల్లోని నర్సరీలలో మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సిహెచ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మాడ్గుల మండల కేంద్రం లోని నర్సరీని సోమవారం అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొక్కల పెరుగుదలకు పలు సూచనలు సలహాలు అందజేశారు. అదేవిధంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి ప నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సరస్వతి, ఎంపీఓ వేజన్న, పంచాయతీ కార్యదర్శి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దేశ మొదటి ప్రధాని నెహ్రు 60వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ తెల్లదొరల బానిస సంకెళ్ల నుం చి దేశానికి విముక్తి కల్పించిన వారిలో ఒకరని తెలిపారు. భారత స్వాతం త్ర పోరాటంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్య క్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, వైస్ ప్రెసిడెంట్ టి.కు మార్‌రావు, జనరల్ సెక్రెటరీ అల్లం భాస్కరరావు, రాజపుట్, కోటరీ, కాం గ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ దొంగలించిన కేసులో ముగ్గురి రిమాండ్..



నవతెలంగాణ, ఓయూ

సెల్ ఫోన్స్ దొంగలించిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నార్త్ లాలగూడా ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సోహెల్ (19) విద్యార్థి, మిర్జాల గూడకు చెందిన మహ్మద్ మెహబూబ్(19) విద్యార్థి. స్నేహితులైన వీరిద్దరూ ఈ నెల 23న, మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో విజయపురి కాలనీలోని మీసేవా వద్ద సురేష్ అనే కొరయర్ బాయ్ ఫోన్ మాట్లాడుతుండగా అతని వద్దకు వెళ్లి చేతిలో నుంచి ఫోన్ లాక్కొని పరారయ్యారు. దీంతో వెంటనే అతను స్థానిక లాలాగూడ పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ పుటేజీల ఆధారంగా ఇద్దరు సెల్‌ఫోన్ స్నాచర్లతో పాటు దొం గిలించిన ఫోన్లను కొనుగోలు చేస్తున్న జగదీష్ మార్కెట్‌కు చెందిన షకీల్ ఖాన్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఒక సెల్ ఫోన్ ఒక బజాజ్ ప్లాటినా బైక్ ను స్వాధీనం చేసుకున్నారు.

భారతదేశ ప్రగతికి మార్గం చూపిన దార్శనికుడు పండిట్ నెహ్రూ

- నివాళులర్పించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు



నవతెలంగాణ,ఓయూ

భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర సమరయోధులు, భారతరత్న జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా సోమవారం తార్నాకలోని క్యాం పు కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర ఉద్యమంలో ఆయన చేసిన విశిష్ట సేవలను, తొలి ప్రధానిగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన వారి పాలన దక్షతను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ టీటీయూసీ ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

రోగ నిరోధక శక్తి గర్భిణీలకు అవశ్యం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



గర్భిణీ స్త్రీలకు రోగనిరోధక శక్తి అనేది అత్యంత ఆవశ్యకమని, రోగనిరోధక శక్తి ఉంటేనే తల్లి- బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ హరిత రామ్ తెలిపారు. ఈ టీకాలు బిడ్డ పుట్టుక ముందు తీసుకునే జాగ్రత్తలు చాలా కీలకమైన అంశమని గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పిస్తూ అనేక విషయాలు వెల్లడించారు. రోగనిరోధక వ్యవస్థ పెరుగుతున్న పిండానికి అండగా ఉంటుందని, అంటు వ్యాధులు తీవ్రమైన సమస్యలకు గురి చేస్తాయని గర్భధారణ సమయంలో టీకాలు వేయడం వల్ల తల్లులలో తీవ్రమైన వ్యాధులను నివారించవచ్చుని నవజాత శిశువుకు ముందస్తు రక్షణను కూడా అందిస్తాయని తెలిపారు. గర్భ ధారణ సమయంలో సిఫార్సు చేసే టీకాలు ఇన్ఫ్లుఎంజా టీకా. గర్భిణులకు సిఫా ర్సు చేయబడుతుంది ఎందుకంటే గర్భధారణ సమయంలో ఇన్ఫ్లుఎంజా తీవ్రం గా ఉంటుంది. ఈ టీకా గర్భం ఏ దశలోనైనా వేయవచ్చునని ఇది సురక్షిత మైనదని అనేక దశాబ్దాలుగా మిలియన్ల మంది గర్భిణులకు వేశారని టెటానస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ (కోరింత దగ్గు) నుంచి ప్రత్యేకంగా 27, 36 వారాల మధ్య పిండానికి రక్షణగా ఉంటుందని ఇది నవజాత శిశువుకు టీకాలను స్వీకరించ డానికి తగినంత వయస్సు రాకముందే రోగ నిరోధక శక్తిని అందిస్తుందని తెలిపారు. కోవిడ్ 19 తీవ్రత దృష్ట్యా ముఖ్యంగా గర్భిణులకు టీకాలు వేయాలని గట్టిగా సిఫార్సు చేశారు. ప్రెగ్నెన్సీ సమయంలో నివారించాల్సిన టీకాలు ఎంఎంఆర్ (తట్టు, గవదబిళ్ళలు, రుబెల్లా) వ్యాక్సిన్, వరిసెల్లా (చికెన్‌పాక్స్) టీకా వంటి లైవ్ వైరస్‌లను కలిగి ఉన్న వ్యాక్సిన్‌లు పిండానికి ప్రమాదం కారణంగా సిఫార్సు చేయరని అందువల్ల ఈ సమయంలో ఈ టీకాలకు దూరంగా ఉండటం ఉత్తమమం అని తెలిపారు.

ప్రతినెల 7వ తేదీనే వేతనాలు ఇవ్వాలి

- ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో కార్మికుల ధర్నా

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలలో కాంట్రాక్ట్ కార్మికులకు చట ప్రకారం ప్రతినెల 7వ తేదీ వేతనాలు ఇవ్వాలని హాస్పిటల్ ముందు సీఐటీయు నాయకులతో కలిసి కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూని యన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్ మాట్లాడుతూ ఆల్ సర్వీస్ గ్లోబల్ కాంట్రాక్టర్ రెండు నెలలకు ఒక్కసారి జీతాలు ఇస్తున్నారని, ప్రతినెల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదని వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు నిత్యావసర సరుకులు ఇంటి కిరాయిలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ లో చేసిన పనికి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదని సూపర్‌డెంట్ కాంట్రాక్టు మీద, కాంట్రాక్టు సూపర్‌డెంట్ మీద చెప్పుకుంటూ, మా వేతనాలు ఇవ్వడం లేదని వెంటనే ఏప్రి ల్ నెల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓం ప్రకాష్, శ్రీధర్, భాగ్య, లక్ష్మి లత శోభ ,అమ్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ సెట్ ఫీజులపై విద్యార్థుల ఆగ్రహం

- జాతీయ స్థాయి పరీక్షలకు, గ్రూప్స్ పరీక్షలకు కూడా ఇంత ఫీజులు లేవు
- ఆర్థిక భారంగా మారిందంటున్న విద్యార్థి సంఘాలు
- ఎక్కువ సబ్జెట్స్ రాయడానికి అవకాశం కల్పించాలి
- నా హయాంలో పెంచలేదు.. గతంలో ఉన్న ఫీజులే కంటిన్యూ చేస్తున్నా
- చైర్మెన్ దృష్టికి సెట్ మెంబర్ సెక్రేటరీ ప్రొ. నరేష్ రెడ్డి



ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వినతి



ఏఎస్‌యు ఆధ్వర్యంలో వినతి



పీడీఎస్‌యు ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ,ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24న తెలంగాణ స్టేట్ ఎలిజిబులిటి టెస్ట్ (టీఎస్ సెట్ 2024) 29 సబ్జెక్ట్‌లకుగాను నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రవేశ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా 10 ఉమ్మడి జిల్లాలో ఆగస్టు 28, 29, 30, 31 తేదీల్లో నిర్వహించను న్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి నేటి వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గల వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల విద్యార్థులు సహేతుకంగా లేని గ్రామీణ ప్రాంతాలకూ చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి వర్గాల్లో ఉన్న నిరుపేద విద్యార్థులకు సెట్ - 2024 ప్రవేశ పరీక్ష ఫీజులు ఆర్థిక భారంగా మారాయని సెట్ మెంబర్ సెక్రటరీకు వేరు వేరుగా వినతిపత్రాలు అందజేస్తూ ఫీజులు తగ్గించాలని అభ్యర్థిస్తున్నారు.

సెట్ ఫీజులతో పేద గ్రామీణ విద్యార్థుల పరేషన్

ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూ ట్రాన్స్ జెండర్స్‌కు రూ. 1000, బీసీ విద్యార్థులకు రూ.1500, ఓసీ విద్యార్థులకు రూ. 2000లుగా ఫీజులు నిర్ణయించారు. దీనితో ఇప్పటికే పలువురు విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్న విషయం తెలిసిందే.

జాతీయ స్థాయి ప్రవేశాల్లో కూడా ఇంత ఫీజులు లేవు..

జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న యూజీసీ నెట్, గ్రూప్స్, ఎంసెట్ లాంటి ప్రవేశ పరీక్షలకు కూడా ఇంత మొత్తంలో ప్రవేశ ఫీజులు లేవని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఎలాంటి పెలోషిప్స్ లేవని, విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూల్ చేయడం తగదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫీజులు నిరుపేద విద్యార్థులకు సెట్ అర్హత సాధించాలనే ఆశ కలగానే మారుతుందని అసంతృప్తితో ఉన్నారు. పలు పోటీ పరీక్షలతో పాటుగా వివిధ కోర్సుల్లో విద్యను మహా నగరంలో అద్దెకు ఉంటూ రెంట్ చెల్లించక లేక అటు పుస్తకాలు కొనుగోలు చేయలేని దుస్థితిలో విద్యార్థులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓకే సబ్జెక్ట్ సబ్జెట్స్ విధానం ఎత్తివేస్తూ, మల్టిపుల్ సబ్జెక్ట్స్ రాసేందుకు అవకాశం ఇవ్వాలి

కేవలం ఒక సబ్జెక్ట్ లో మాత్రమే ఎంపిక చేసుకోవానే నిబంధన ఎత్తివేయాలని విద్యార్థులకు ఇష్టమైన సబ్జెక్ట్‌లో (మల్టిపుల్) పరీక్ష రాసేందుకు వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. మరికొన్ని విద్యార్థి సంఘాల అయితే స్థానిక భాషల్లో కూడా సెట్ రాసుకొనే అవకాశం ఇవ్వాలని సెట్ మెంబర్ సెక్రటరీకు ప్రతిపాదనలు డిమాండ్ రూపంలో ఉంచారు. ఫోక్ ఆర్ట్స్ , థియేటర్ ఆర్ట్స్ , కోర్సుల్లో సహితం ప్రవేశ పరీక్ష నిర్వహించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రూప్స్ పరీక్షలు ఉన్నాయి ప్రవేశ పరీక్షల తేదీలను మార్చాలంటూ వినతి

ఇక కొందరు విద్యార్థులు సెట్ ప్రవేశ పరీక్షల తేదీలను మార్చాలని కోరుతు వినతిపత్రం అందజేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ జూన్ నెలలో, గ్రూఫ్ 2 ఆగష్టు నెలలో, గ్రూఫ్ 3 నవంబర్ నెలలో ఉండటంతో పాటుగా టెట్, డీఎస్సీ లాంటి పరీక్షలు మే, జూన్, ఆగస్టు నెలలో వరుసగా ఉన్నాయని ఇవ్వని సెట్ నిర్వాహకులు పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరం అయితే విద్యార్థుల తో సమావేశం నిర్వహించి సెట్ తేదీలను మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఫీజులు నా హయాంలో పెంచలేదు విద్యార్థుల వినతులు చైర్మెన్ దృష్టికి..

సెట్ మెంబర్ సెక్రటరీ ప్రొ.నరేష్ రెడ్డి



సెట్ పరీక్ష ఫీజులు నా హయాంలో పెంచలేదు. 2022-23 సంవత్సరంలో ఉన్న ఫీజులు కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. ఇక యూజీసీ నెట్ లో కూడా ఒకే సారి ఒకే సబ్జెక్ట్ లో రాసే అవకాశం ఉందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర పరీక్షల తేదీలను పరిశీలించే తేదీలు ప్రకటించాం. విద్యార్థి సంఘాలు ఇచ్చిన వినతిపత్రాలను సెట్ చైర్మెన్ దృష్టికి తీసుకువెళ్లాను.

పాతకక్షలతో వ్యక్తిపై కత్తితో దాడి..



నవతెలంగాణ, ఓయూ

పాత కక్షలతో వ్యక్తిపై దాడి చేసి పారిపోతూ దారి మధ్యలో తనస్నేహితులతో కలిసి మరో వ్యక్తిని బెదిరించి అతని వద్ద సెల్‌ఫోన్, డబ్బులను లాక్కెళ్లిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు సోమవారం లాలాగూడ పోలీస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ రావుల గిరిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్త్ లాలగూడలోని జామియా మసీదు ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ ఆసిఫ్ రెహ్మాన్ (31) అలియాస్ టైగర్ అనే వ్యక్తి ఆటోడ్రైవర్. తన ఇంటి సమీపంలో నివాసముండే తాడూరి కృష్ణ అనే వ్యక్తితో పాత గొడవలు ఉన్నాయి. అవి మనసులో పెట్టుకున్న ఆసిఫ్ రెహ్మాన్ ఈ నెల 24న కృష్ణపై కత్తితో దాడి చేయగా, అతని మెడపై గాయమైంది. దీంతో అక్కడి నుంచి పరారైన ఆసిఫ్ రెహ్మాన్ తన స్నేహితులైన సోహెల్ షేక్ చాంద్(19) అలియాస్ సోహేల్ (వృత్తిరీత్యా పెయి ంటర్), మరో బాలుడితో రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్లిపోయారు. ఈ క్రమంలో లాలాగూడలోని రైల్వేక్వార్టర్స్ ప్రాంతంలో మహ్మద్ అఫ్రోజ్ అనే వ్యక్తికి కత్తి చూపించి బెదిరింపులకు పాల్పడి, అతని వద్ద నుంచి సెల్ ఫోన్ రూ.70ల నగదును లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి ఒక ఫోలెడ్ కత్తి, హీరోప్యాషన్ బైక్, హోండా యాక్టివా. ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరిని రిమాండుకు తరలించి బాలుడిని జూవైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు. రౌడీ షీటర్ ఆసిఫ్ రెహ్మాన్‌పై ఇదివరకు లాలాగూడ పీఎస్‌లో ఆర్మ్స్ యాక్ట్, హత్యాయత్నం, ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసులు ఉన్నాయని, బాలుడిపై మార్కెట్ పీఎస్ లో ఐపీసీ 382, లాలాగూడ పీఎస్ లో 379 సెక్షన్ల కిందకేసులు గతంలో నమోదైనట్లు డీసీపీ గిరిధర్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఏసీపీ జైపాల్ రెడ్డి , ఇంచార్జ్ ఎస్ఏ రమేష్ గౌడ్, ఎస్సైలు నాగరాజు యాదవ్, షాహిద్ పాషా, కానిస్టేబుల్ నాయుడు, రాజశేఖర్ అమంత్ జగదీష్ నవీన్, గణేష్, వినయ్ గలిబ్ వేణులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ వెంచర్ శ్రీ భార్గవి ఆస్పత్రి పార్కుకు

ఇరువైపులా అక్రమ పార్కింగ్



- పట్టించుకోని ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్, కళ్యాణ్ నగర్ వెంచర్ శ్రీ భార్గవి ఆస్పత్రి ముందు గల పార్కుకు ఇరువైపులా, కార్లు అక్రమంగా రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. పార్కింగ్ చేస్తున్నవారు కాలనీకి సంబం ధించిన వారివి కాదని, కాలనీ చుట్టూ ఉన్న బస్తీలలోని వారు సుమారు 5,10 కిలోమీటర్ల దూరం నుండి వచ్చి కళ్యాణ్ నగర్ రోడ్డుపై అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. పార్క్ ఫెన్సింగ్‌కు పార్కుకి ఇరువైపులా 50 మీటర్లకు ఒక బ్యానర్‌ను ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ఈ ప్రదేశంలో కార్లు పార్కిం గ్ చేయొద్దని చేస్తే రూ.1,000లు జరిమానా చెల్లించాలని పెద్ద బ్యానర్లు ఏర్పాటు చేసి హెచ్చరిక అని పెట్టారు. అయినా కూడా కార్ల యజమానులు పార్కు కు ఇరువైపులా ప్రతిరోజు సుమారు 20 నుండి 30 వరకు కార్లు, బోర్లు రిపేర్ చేసే వాహనాలు, చెడిపోయిన ఆటోలు, కార్లు పార్కింగ్ చేస్తు న్నారు. పార్కింగ్ చేస్తున్న వారికి ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చలానాలు వేయటం లేదని, నిర్భయంగా పార్కింగ్ చేస్తున్న వాహనాలను చూస్తే అర్థమవుతుంది. ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు వెంటనే చర్యలు తీసుకొని పార్కుకు ఇరువైపులా అక్రమంగా పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. కొన్ని నెలల పాటు పార్కింగ్ చేసిన వాహనాలు కూడా ఉన్నాయని, ఇక్కడ పార్కు చేసిన ప్రతి వాహనం నంబర్లను తనిఖీ చేసి అవి చోరీ చేసిన వాహనాల? లేక అక్రమంగా ఎందుకు పార్కింగ్ చేస్తున్నారో తెలుసుకుని పెద్ద మొత్తంలో చలాన్లు వేయాలని, అక్రమ కార్ల పార్కింగ్ వల్ల కార్లకు చాటుగా కూర్చొని యువకులు మద్యం సేవిస్తున్నారని, అనేకసార్లు 100 నెంబర్ కు డయల్ చేస్తే పోలీసులు హారన్ మోగిస్తూ వస్తారని వారు వచ్చేలోపు అందరూ పారిపోతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

గడువు తర్వాతే జరిగే పరిణామాలకు బాధ్యులు మీరే

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర కులాల రిజర్వేషన్ అమలు చేసి ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ జూన్ 10 వరకు గడువు తర్వాతే జరిగే పరిణామాలకు బాధ్యులు మీరే అంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మందకృష్ణ మాదిగ సవాల్ చేశారు. అంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సూచన, డిమాండ్, ఏదైనా అనుకోండి త్వరితగతిన రిజర్వేషన్లు పెంచాలని జూన్ 10 తేదీవరకు సమయం.. ఎన్ని రాజకీయ కుల మత సంఘాల వారిని సామాజిక వేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో 15 శాతం వరకు రిజర్వేషన్ అమలు చేయడం జరుగుతుంది. సాంఘిక శాఖ మంత్రి ఎందుకు లేరు ఆ శాఖ సీఎం వద్దనే ఉంది ఎందుకు మౌనంగా ఉండిపోయారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే తప్పుడు హామీలు ఇచ్చారు. ఓబీసీ లెక్కలు చేపట్టకుండా కాలయాపన ఎందుకు చేస్తున్నారో చెప్పాలనీ డిమాండ్ చేశారు.రిజర్వేషన్ పెంచకపోతే నష్ట పోయేది బహుజనులే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు టివి నరసింహం మాదిగ ఎమ్మెస్ ఎఫ్ అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, ఎంఎస్పి సీనియర్ నాయకులు వీఎస్. రాజు మాదిగ, అరుణ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున మాదిగ ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శాంసన్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భైరపోగు శివకుమార్ మాదిగ, శ్రీకిషన్, కొండ్రపల్లి శివ, సుజాత, రేణుక, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నారాయణమ్మ కాలేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుక



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జి.నారాయణమ్మ కాలేజీ 2020-24 బ్యాచ్ యొక్క బీటెక్, బీటెక్ మైనర్ డిగ్రీ, ఎం టెక్ బ్యాచ్ విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ వేడుక సికింద్రాబాద్‌లోని ఇంపెరియల్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ప్రొఫెసర్ సునైనా సింగ్ నలంద విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ , ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ వైస్ ప్రెసిడెంట్ చీఫ్ గెస్ట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్.లింబద్రు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. జీఎన్ఐటీఎస్ చైర్మెన్, వైస్ చైర్‌పర్సన్ జి. విద్యారెడ్డి అతిథులు, విద్యార్థులు వారి కుటుంబాలను స్వాగతించారు. ఈ కార్యక్రమ ంలో జీఎన్ఐటీఎస్ పాలక మండలి సభ్యులు, మహాత్మాగాంధీ సెంట్రల్ యూనివర్సిటీ, బీహార్ ప్రొ వైస్.ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. గోపాల్ రెడ్డి, యూ పీఎస్ ఇండియా కార్పొరేట్ వైస్ ఛాన్సలర్ కిరణ్మాయీ పెండ్యాల పాల్గొ న్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రమేష్ రెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జి. విద్య విశిష్ట అతిథులను స్వాగతించారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి తన స్వాగత ప్రసంగంలో నాలుగు సంవత్సరాల తరువాత మహిళలు తమ జీవితంలో అధిక, వేగవంతమైన ప్రకాశవంతమైన లక్ష్యాలను సాధించడానికి ప్రపంచం మరింత సమ్మిళి తంగా ఉన్న ప్రస్తుత స్వర్ణ యుగంలో వారు అద్భుతమైన అవకాశాలను చూస్తారు. ప్రొఫెసర్ సునైనా సింగ్ విద్య యొక్క ఉద్దేశ్యం స్వావలంబన అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ భయాలను స్వీకరించాలని, వాటిని ఎలా అధిగమించాలో నేర్చుకోవాలని, వారి ఆత్మవిశ్వాసాన్ని హరించడానికి అనుమతించవద్దని ఆమె సూచించారు. ప్రొఫెసర్. లింబద్రు విద్యార్థులకు శుభాకాంక్షలను తెలియజేశారు. వారి గ్రాడ్యుయేట్ డిగ్రీలను కలిగి ఉన్నందున వారు గొప్ప గర్వం ఆనందంతో నిలబడి ఉండటానికి కష్టపడి పనిచేసి, త్యాగం చేసిన వారి తల్లిదండ్రులకు గొప్పగా ఉండాల్సిన అవసరా న్ని నొక్కి చెప్పారు. ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి పుల్లారెడ్డి గొప్ప దార్శనికతను గుర్తుచేసుకున్నారు. వారి కళాశాల, తల్లిదండ్రులు దేశానికి తిరిగి ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. వారు ప్రవేశిస్తున్న పోటీ ప్రపంచంలో బలంగా స్థితిస్థాపకంగా ఉండాలి. దీని తరువాత ప్రతి శాఖలో టాపర్లు సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, ఈటీఈ, ఐటీ, బీటెక్, ఎంటెక్‌లో మొత్తం టాపర్లు వారి తల్లిదండ్రులతో పాటు వారి బంగారు పతకాలను అందుకున్నారు. బీటెక్ మైనర్ డిగ్రీ విద్యార్థులకు, ప్రతి శాఖ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ రోల్స్‌ను అందజేసే గౌరవాన్ని విశిష్ట సభ్యులు డీఎన్ఎస్ చేశారు. జాతీయ గీతం ఆలపించడంతో పాటు ప్రముఖులు వేదికపై నుంచి లాంఛనంగా వాకౌట్ చేయడంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి 2020-24 బ్యాచ్‌కు చెందిన 900 మంది డిగ్రీ హోల్డర్లు 3000 మందికి పైగా గర్వించదగిన తల్లిదండ్రులు ఎంతో ఆనందంతో గర్వంగా హాజరయ్యారు.



మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ 60వ వర్ధంతి సందర్భంగా అబిడ్స్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ యాదవ్, విజి పురుషోత్తం, ఆర్‌వి వినోద్ కుమార్, చంద్రమోహన్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, తదితరులు నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఘనంగా జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి



నవతెలంగాణ-బంజారాహిల్స్

స్వాతంత్ర్య సమరయోధులు భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని గాంధీ భవన్‌లో వారి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించిన ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి, ఎస్కే షరీఫ్, ఖైరతాబాద్ డీసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ధనరాజ్ రాథోడ్, ఖైరతాబాద్ నియోజకవర్గ మైనార్టీ చైర్మెన్ ముజఫర్ అలీతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సోమాజిగూడ కార్పొరేట్ అభ్యర్థి నరికెళ్ళ నరేష్ ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

మూఢనమ్మకాలను పారదోలేదే జ్యోతిష్య వాస్తు శాస్త్రం

- జోతిష్య, వాస్తు సిద్ధాంతులకు సత్కారం



నవతెలంగాణ-ముషీరాబాద్

మూఢనమ్మకాలను పారదోలేదే జ్యోతిష్యం వాస్తు శాస్త్రమని జ్యోతిష్య నిపుణులు తెలిపారు. సూర్యచంద్ర కల్చరల్ అండ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జోతిష్యులు, వాస్తు సిద్ధాంతులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారీ హాజరై అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతా గోపిశర్మ సిద్ధాంతికి వాస్తు బ్రహ్మ, వారి శిష్యులు చాడ హనుమశాస్త్రికి జ్యోతిష భూషణ్, ముక్కు సుబ్రహ్మణ్యంకు జ్యోతిష భూషణ్, భాగవతుల భవానీ శర్మకు భారతీయవాస్తు సుధాకర, కవితా ఫణి శర్మకు జ్యోతిష ప్రవీణ, కామవరపు విజయమారుతి శర్మకు జ్యోతిష కేసరి, శర్మధకు జ్యోతిష ప్రవీణ అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు.

ఖగోళా యాత్రను జయప్రదం చేయండి



నవతెలంగాణ-అంబర్‌పేట

లోక కళ్యాణం కోసం చేసే ఈ భూమండల యాత్ర కలియుగ చరిత్రలో నిలవడం ఖాయమని భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు పేర్కొన్నారు. అనంతరం భద్రాచలం శ్రీ రాములవారి టెంపుల్ అమెరికాలో నిర్మిస్తున్న అర్చకులు శ్రీ పద్మనాభ ఆచార్యులు బీజేపీ నగర కార్యాలయానికి విచ్చేసి డాక్టర్ ఎన్ గౌతమ్ రావును వేదమంత్రాలు తో ఆశీర్వదించి, ఖగోళ యాత్ర గురించి వివరించి ఇన్విటేషన్ కార్డును అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ సీతా రాముల వారి సంకల్పంతో నిర్వహించే ఖగోళా యాత్ర కనీవినీ ఎరగని రీతిలో విజయవంతం కావాలని గౌతమ్ కోరారు. అమెరికాలో నిర్మించబడుతున్న భద్రాద్రి సీతారాముల వారి ఆలయం పూర్తి కావాలని ప్రార్థించారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలి

- బీజేవైఎం నగర కార్యదర్శి దేవర వంశీ



నవతెలంగాణ-మెహిదీపట్నం

కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయం మార్కెట్ వద్ద డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని బీజేవైఎం నగర కార్యదర్శి దేవర వంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జలమండలి జీఎం మహేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా డ్రయినేజీ పొంగిపొర్లుతు ఉండడంతో పాదచారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే జలమండలి అధికారులు స్పందించి పాత పైపు స్థానంలో పెద్ద పైపు లైను వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరాజ్ యాదవ్, అనీల్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత రాగుల ప్రవీణ్ మృతి

- పాడే మోసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ నేత రాగుల ప్రవీణ్ ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయనకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఆదివారం రాత్రి తీవ్ర గుండెపోటు రావడంతో కాచిగూడలోని సీసీ షరాఫ్ ఆస్పత్రికి వెళ్లి అక్కడి నుండి టీఎక్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స చేశారు. మళ్లీ గుండె పోటు రావడంతో ఆస్పత్రిలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సోమవారం రాగుల ప్రవీణ్ అంత్యక్రియలు కాచిగూడ స్మశాన వాటికలో నిర్వహించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ మృతి బాధాకరమని నియోజకవర్గానికి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం ప్రవీణ్ అంతక్రియలను పాడే మోసి శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు సిద్దార్థ ముదిరాజ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు బస్తీ వాసులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-ధూల్‌పేట్

వ్యక్తి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ గుఫా మందిర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్(45) ఆటో డ్రైవర్. ఈ నెల 17వ తేదీ ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లి రాత్రి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా రక్త సంబంధికులు, బంధు మిత్రులతో వాకాబు చేశారు. ఫలితం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేది వర్షాకాలం.. జాగ్రత్త..

- క్షేత్ర స్థాయిలో మాన్ సూన్ మేనేజ్ మెంట్ ప్లాన్
- తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించాలి
- రంగంలోకి ఈఆర్టీ, ఎస్పీటీ బందాలు
- ఏ రోజుకు ఆ రోజు నివేదిక సమర్పించాలి
- డీప్ మ్యాన్ హెూల్లకు ఎరుపు రంగు వేయాలని ఎండీ ఆదేశం





నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చే వర్షాకాలంలో శక్తి వంచన లేకుండా పని చేయాలని ఎండీ సుదర్శన్ రెడ్డి సూచించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జలమండలి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించిన ఆయన వర్షాకాల ప్రణాళికను ప్రకటించారు. ఎండీ మాట్లాడుతూ మరో వారం రోజుల్లో వర్షాకాలం ప్రారంభమయ్యే నేపథ్యంలో డైరెక్టర్లు మొదలుకొని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపైన దష్టి సారించాలని తెలిపారు. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా కాకుండా అందులో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. సీవరేజీ ఓవర్ ఫ్లో ను సీరియస్‌గా తీసుకుని ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. వివిధ అంశాలపై వచ్చే ఫిర్యాదుల్ని వెంటనే పరిష్కరించాలన్నారు. వాటర్ హాట్ స్పాట్లు గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మ్యాన్ హెూల్స్‌కు సేఫ్టీ గ్రిల్స్ బిగింపు, ప్రమాదకర మ్యాన్ హెూల్స్ వద్ద రెడ్ ఫ్లాగ్స్, సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వివరించారు. వర్షాకాలంలో కలుషిత నీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ యంత్రాలను సమర్థంగా ఉపయోగించుకోవాలని ఎండీ సూచించారు. జలమండలి, జీహెచ్ఎంసీ 120 వాటర్ లాగింగ్ పాయింట్లను నిత్యం పర్యవేక్షించాలని ఎండీ తెలిపారు. మ్యాన్ హెూళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్) ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ముంపునకు గురైన మ్యాన్హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారుల మీద ఉన్న మ్యాన్ హెూళ్లకు ఎరుపు రంగు వేయాలని ఎండీ ఆదేశించారు. డీప్ మ్యాన్ హెూళ్ల దగ్గర సీవరేజి సూపర్వైజర్లు ఉండేలా చూడాలన్నారు. బోర్డు సిబ్బంది అంతా ఈ సీజన్‌లో విమర్శలకు తావు లేకుండా జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల అధికారులను సమన్వయం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కష్ణ, రెవెన్యూ డెరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన 'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్' 5వ ఎడిషన్



- 12విభాగాల్లో అవార్డ్స్ ప్రదానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రౌండ్ టేబుల్ ఇండియా నిర్వహించిన 'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్' 5వ ఎడిషన్ నోవాటెల్ (హెచ్ఐసీసీ) హైదరాబాద్‌లో ఘనంగా ముగిసింది. విద్య అభివృద్ధి చేయడం, సమాజ సేవ పట్ల నిబద్ధతను బలోపేతం చేసేందుకు రౌండ్ టేబుల్ ఇండియా కృషి చేస్తోంది. వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డ్స్‌ను అందించారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం సమాజం, సమాజం యొక్క ఎదుగుదల, అభివద్ధికి అసాధారణమైన సహకారాన్ని అందించిన వారిని గుర్తిస్తుంది. 12 విభాగాల్లో అవార్డ్స్‌ను ప్రదానం చేశారు.

52 దేశాలల్లో ...

ఇంగ్లాండ్‌లోని నార్విచ్‌లో 1927లో స్థాపించబడిన రౌండ్ టేబుల్ 52 దేశాలలో 43,000 మంది సభ్యులతో ప్రపంచ స్నేహ సంస్థగా పరిణామం చెందింది. రౌండ్ టేబుల్ ఇండియా 1957 నుండి క్రియాశీలంగా ఉంది. 375 కంటే ఎక్కువ పట్టికలు, 5000 సభ్యులు సమాజ సేవకు కట్టుబడి ఉన్నారు. నిధులన్నీ నేరుగా వెనుకబడిన వారి కోసం, పాఠశాలలను నిర్మించడానికి ఖర్చుచేస్తున్నారు. ప్రైడ్ ఆఫ్ తెలంగాణా అవార్డ్స్ 2024 కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు భాగస్వాములు, స్పాన్సర్‌తో పాటు మద్దతుదారులందరికీ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎన్టీఆర్ 101వ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ 101వ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పి.సాయిబాబా సోమవారం తెలిపారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఉదయం 10:30గంటలకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పిస్తామన్నారు. ఉదయం 8:30 గంటలకు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళ్లుఅర్పిస్తామని అనంతరం అన్ని నియోజకవర్గాలల్లో, డివిజన్లలో అన్నదానం, పండ్ల పంపిణీతోపాటు పేదలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సీతాఫల్ మండి చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సాయంత్రం 5:30 గంటలకు సంగీత విభావరి నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి నందమూరి రామకృష్ణతోపాటు పలువురు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు, నాయకులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పీ.బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం దొంగతనాలు..

- ఇద్దరు పాత నేరస్థులు అరెస్టు..
- ఒక ద్విచక్ర వాహనం, రూ.4 వేలు స్వాధీనం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సోమవారం సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి లతో కలిసి వివరాలను వెల్లడించారు. దారుషిఫాకు చెందిన లియాఖత్ హుస్సేన్(30) వంట లేబర్, చాదర్‌ఘాట్ కాలికాబర్‌కు చెందిన గౌస్ పాషా(30) ప్లంబర్. పాత నేరస్తులైన ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. ఈ క్రమంలో ఇద్దరు జల్సాల కోసం వాహనాలను దొంగలించేందుకు పథకం వేశారు. ఈ నెల 14న అర్ధరాత్రి ఇద్దరూ కలిసి అఫ్జల్ గంజ్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ వద్ద ప్లాటినా వాహనాన్ని చోరీకి పాల్పడ్డారు. అనంతరం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కోఠిలోని ఉస్మానియా మహిళా కళాశాల వద్ద ఉన్న బస్టాండ్ కు చేరుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మనీ భార్గవ్ అనే వ్యక్తి ఖమ్మంలో తన ఓటు హక్కును వినియోగించుకొని బంజారాహిల్స్‌లోని తన స్నేహితుడి ఇంటికి వెళ్లేందుకు కోఠిలో దిగి రాపిడో బుక్ చేసుకున్నాడు. బస్ స్టాప్ వద్ద ఒంటరిగా వేచి ఉన్న అతనిని గమనించిన ఇద్దరు నిందితులు అతని చేతిలో ఉన్న ఐ ఫోన్ లాక్కొని పారిపోయారు. అనంతరం కోఠిలోని ఓ వ్యక్తికి రూ. పదివేలకు అమ్మి సమానంగా పంచుకున్నారు. బాధితుడు మనీభార్గవ్ సుల్తాన్ బజార్ పోలీసులు ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 4వేల నగదుతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో చాదర్‌ఘాట్, అఫ్జల్ గంజ్, సుల్తాన్ బజార్, మీర్ చౌక్, బేగం బజార్ పలు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి, ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. గొయ్యి మరిచారు..



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

లాలు దర్వాజా మోడ్ శాలి బండ నుండి చార్మినార్ వెళ్లే మెయిన్ రోడ్డుపై గత రెండు నెలలుగా క్రితం రోడ్డు వేసిన అధికారులు.. అక్కడి మ్యాన్ హెూల్ పై కవర్లు వేయడం మరిచారు. రెండు నెలాలు గడుస్తున్న దానిపై ప్రమాదానికి సంకేతమైన గుర్తు పెడుతున్నారు తప్పా దానికి మరమ్మతులు చేయడం లేదు. వాహనదారులకు తీవ్ర గాయాలపాలవుతున్న ఎవరు పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో లైట్ల వెలుగులో చాలా మంది బైక్ రైడర్లుకు గోతి కనపడక పోవడంతో గోతిలో పడి గాయాల పాలవుతున్నారు. మ్యాన్ హెూల్ ఉన్న ఈ గొయ్యిని రోడ్డు కిందకు ఉండడం వల్ల ప్రమాదంగా మారింది. మ్యాన్‌హెూల్ లేపి దానికి పైకప్పును వేసి రోడ్డుకు సమాంతరంగా చేయాలని వాహన దారులు వాపుతున్నారు.

ప్రభుత్వ భూమిలో ఉన్న బోర్డులు తొలగించిన నిందితుడు అరెస్టు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రభుత్వ స్థలంలోని బోర్డులను తొలగించి అక్రమంగా స్థలంలోనికి ప్రవేశించిన నిందితుడిని బోరబండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఆర్ నగర్ ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ సారధి సొసైటీలోని 400 గజాల ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే అక్కడ ఉన్న బోర్డును తొలగించి ఆదివారం సాయంత్రం స్థలం కబ్జా చేయాలని చూసిన నిందితుడు డి.షేక్ జావీద్ వృత్తి ప్రయివేట్ ఉద్యోగం, బోరబండ నివాసిపై ఖైరతాబాద్ ఆర్ఐ కిరణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడిని సోమవారం అరెస్టు చేసి ,అతనిపై క్రైమ్ నెంబర్ సీఆర్ నెం. 418/2024 యు/ఎస్ 323, 354, 504, 506, 509 ఐపీసీ, సీఆర్ నెం. 417/2024 యుఎస్ 447, 427, 186 ఆర్‌డబ్ల్యూ34 ఐపీసీ, సెక్షన్ల ప్రకారం ప్రభుత్వ భూమిలోకి నేరపూరితంగా చొరబడినందుకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనట్లు తెలిపారు. ఎస్ఆర్‌నగర్ డివిజన్ పరిధిలో ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన బోర్డులు తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ వెంకటరమణ తెలిపారు.

పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు..

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వి.విక్టర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అధికారులు నిమగ్నమయ్యారు. జూన్ 4న పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వి. విక్టర్ విక్టర్ ఏర్పాట్లు ప్రారంభించినట్లు తెలిపారు. హైదరా బాద్ పార్లమెంటు పరిధిలోని గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్లో మొత్తం 2,74,522 ఓట్లకు గాను 1,50,207 ఓట్లు పోల్ అయ్యా యని ఆయన తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ప్రారంభించామని విక్టర్ వివరించారు. కోఠి ఉమెన్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు 14 టేబుళ్ల ద్వారా 17 రౌండ్లలో ఈ ఓట్ల లెక్కింపు జరుగుతుం దన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచిన ఈవీఎంలను వివిధ పార్టీల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. కట్టుదిట్టమైన భద్రత వలయంలో ఉన్న ఈవీఎంలను పార్టీ అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు ఎన్నికల పర్యవేక్షకుల సమక్షంలో కౌంటింగ్ హాల్ కు తీసుకువచ్చి ఓట్ల లెక్కింపు చేపడుతామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో సెల్ ఫోన్లకు అనుమతి లేదని ఏఆర్ ఓ విక్టర్ వెల్లడించారు. కౌంటింగ్ హాల్ లోపలికి పార్టీల ఏజెంట్లకు పాసులు జారీ చేస్తామని, పాసులు ఉన్నవారికే లోపలికి అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ హాల్ పరిస రాల్లో సీఆర్పీఎఫ్, స్పెషల్ పోలీస్, స్థానిక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
13
హైదరాబాద్
HMDA
మంగళవారం | మే 28, 2024 | www.navatelangana.com

ఇల్లు లేని వారికి ఇంటి స్థలం మంజూరు చేయాలి

- సీపీఐ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి రామకృష్ణ

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

మియాపూర్‌లోని ఇల్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని శేరిలింగంపల్లి సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగపల్లి నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలు చాలీచాలని వేతనాలతో ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలను చదివించలేక ఇబ్బందులకు గురవుతున్నారని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని 2022లో తహసీల్దార్‌కు 1500 మందితో కూడిన లిస్టును తహసీల్దార్‌కు అందజేసినట్టు తెలిపారు. అప్పుడు తహసీల్దార్ సానుకూలంగా స్పందించి సోషల్ ఎకనామి కల్ సర్వే చేయి స్తానని హామీ ఇచ్చారన్నారు. రెండేండ్లు గడుస్తున్నప్పటికీ సోషల్ ఎకనామికల్ సర్వే చేయలేదని తెలిపారు.

విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

- వ్యవసాయ అధికారి వసంత

నవతెలంగాణ-మర్పల్లి

విత్తనాల కొనుగోలులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వసంత అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు రావులపల్లి, వీర్లపల్లి, గుర్రం గట్టు తండా, బిల్ కల్, పెద్దపూర్, తదితర గ్రామాలలో రైతులకు విధానాలపై క్లస్టర్ల వారిగా ఏఓతో పాటు ఏఈవోలు రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దని రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణంకు సంబంధించిన రశీదులు తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్, బిల్లులు పంటకాలం పూర్తయ్యేభద్రంగా దాచుకోవాలన్నారు. వ్యవసాయశాఖద్వారా గుర్తింపు పొందిన ఆదీకృత డీలర్లవద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని వారు చూసించారు. కార్యక్రమంలో ఏఈ ఓ లు నీరజ, జోష్న, మహేష్, స్వాతి, మాధవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలి



- జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3 నుంచి 13 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించ నున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలో 12,186 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరికోసం 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా జరిగేలా చూడాలన్నారు. పరీక్ష సమయంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు అధికారులను సూచించారు. పరీక్షా కేంద్రాల్లో శానిటైజ్ చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను, కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను, ఏఎన్ఎంను, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖను, నిరంతరంగా విద్యుత్ సరఫరా ఉండాలని విద్యుత్ శాఖను, పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా అదనంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీకి సూచించారు. నీటిని సరఫరా, శానిటేషన్ బాగుండేలా చూడాలని మెట్రో వాటర్ వర్క్స్ శాఖకు అదనపు కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో బాలికల కోసం టాయిలెట్స్ ఏర్పాటు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సెంటర్స్‌లోకి సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదనిన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. సెంటర్ గేట్ వద్ద ఐడెంటీ కార్డు, అడ్మిట్ కార్డ్ పరిశీలించాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షలు సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్. రోహిణి, డీసీపీ ఎం.బాపు రావు, టీఎస్ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కె.మహేష్ కుమార్, డీపీఆర్వో అబ్దుల్ కలీం, డీఎంఅండ్‌హెచ్ ఓపీవో డాక్టర్ సుధా మాధవి, ఎలక్ట్రిసిటీ ఏడిఈ కేఎస్ ప్రధాన్, హెచ్ఎండబ్ల్యుఎం ఏ.నదీమ్, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా యువజన, క్రీడా అధికారి సుధాకర్ రావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి భారత ప్రభుత్వం ప్రదానం చేసే పద్మశ్రీ, పద్మభూషణ అవార్డులకుగాను సంబంధింత రంగాలలో సేవలు అందించిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడా అధికారి ఎన్.సుధాకర్ రావు కోరారు. ఎంపిక అయిన అభ్యర్థులు 2025 జనవరి 26వ తేదీన ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. జిల్లాలో కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం, లిటరెచర్, విద్య, క్రీడలు, సివిల్ సర్వీసులు, ఇతర రంగాలలో సాధించిన లక్ష్యాలను చేసిన కృషిని 800 పదాలు మించకుండా ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5గంటల లోపు లక్డీకాపూల్‌లోని స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్ కలెక్టరేట్ కాంప్లెక్‌లోని జిల్లా యువజన, క్రీడా అధికారి కార్యాలయంలో అభ్యర్థులు నాలుగు సెట్ల దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యాడబ్ల్యాడబ్ల్యా.పద్మఅవార్డ్స్.గౌ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

'అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలి'



నవతెలంగాణ-పరిగి

అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలని సోమవారం పరిగి పట్టణ కేంద్రంలోని టీఆర్ఆర్ నివాసంలో ఉమ్మడి చాకల్ పల్లి గ్రామ పంచాయతీ రైతులు మాజీ సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి చాకల్పల్లి గ్రామ రైతులకు అటవీ భూమల సేద్యం విషయంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం యాజమాన్య హక్కులు కల్పించిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి రైతులను ఇబ్బందులకు గురి చేసిందని ఎమ్మెల్యేకు వివరించారు. ఇప్పుడు మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కావున భూములకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్‌రెడ్డిని కోరారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అమాయకత్వమే ఆసరాగా వ్యాపారం

నవతెలంగాణ-కోడంగల్

అమాయక రైతులను నకిలీ పత్తి విత్తనాలు నట్టేట ముంచుతున్నాయి. ఏటా పెరుగుతున్న దళారుల ఆగడాలకు అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి, ప్రభుత్వం ఎన్ని విధాల ముందస్తు చర్యలు చేపట్టిన అక్రమ దందాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఖరీఫ్ పంట కాలానికి అమాయక అన్నదాతలు లక్ష్యంగా నకిలీ విత్తనాలు రైతులకు అంటగట్టి వ్యాపారులు లక్షలు గడిస్తున్నారు, పోలీస్ శాఖ తనిఖీలు, ఆకస్మిక దాడులతో నకిలీ దందాను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న నకిలీ పత్తి విత్తన దందా చాప కింద నీరులా అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా గ్రామాలలో దళారులను నియమించుకొని రైతులకు నకిలీ పత్తి విత్తనాలను అంటగడుతున్నట్టు సమాచారం. పోలీసు శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేసిన నకిలీ విత్తనాల దళారులు మాత్రం ఆగడం లేదు. విత్తనం మొలకెత్తితేనె పంట పండేది, అందులోనూ మొలకెత్తిన విత్తనాలు అన్నిరకాల చీడపీడలను తట్టుకొని ఖాతా కాస్తేనే దిగుబడి వచ్చేది, ఎన్నో రకాల విత్తనాల కంపెనీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి, తమ కంపెనీ విత్తనం మొలకెత్తడం గ్యారెంటీతో పాటు అధిక దిగుబడి ఇస్తుందని, అన్ని రోగాలను తట్టు కుంటుందని ఇలా ఆకర్షణ పేర్లతో రంగురంగుల కలర్లతో ప్యాకెట్లను తయారుచేసి అడ్డగోలు ధరలతో మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నారు. కొన్ని కంపెనీల విత్తనాలు సరిగా మొలకెత్తక పంట సరిగా పండక రైతులు నష్టపోతున్నారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు రాజ్యమేలిన రైతులు మరిన్ని నష్టాల బారిన పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పండాలంటే మేలైన విత్తన రకాలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు, సలహాలు చేస్తున్న నకిలీ పత్తి విత్తన దళారులు రైతుల పాలిట యమ పాశాలుగా మారుతున్నారు. గతంలో రైతుల వారి పంట నుండి విత్తనాలను కట్టి మళ్లీ విత్తు కునేవారు. రానురాను వ్యవసాయం కొత్తపుంతలు తొక్కడంతో రైతులు కొత్త సాగుకు అలవాటు పడ్డారు. ఇందులో భాగంగానే నకిలీ పత్తి విత్తనాలు తయారు చేసి అతి తక్కువ ధరలకు అమాయక రైతులకు అమ్ముతున్నారు. అధికారులు ఇతర పంటలు పలుమార్లు పరిశీలించి సర్టిఫై చేసిన వాటిని మాత్రమే కొనాలి. విత్తనాలను ప్రయోగశాలలో పరిశీలించి వంద విత్తనాలలో ఎన్ని మొలకెత్తుతాయె శాతాన్ని నిర్ధారించి లాట్ సంఖ్యను కేటాయిస్తారు. కానీ ఇవన్నీ లేకుండానే సొంతంగా పత్తి విత్తనాలు తయారు చేసి రంగురంగుల ప్యాకెట్‌లో ఆకర్షణీ యంగా చేసి రైతులకు అంటగడుతున్నారు. విత్తనాలు మొలవక మొలసిన సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. దేశానికి వెన్నెముక వ్యవసాయం అట్టి వ్యవసాయం చేసే రైతన్నలు క్షేమంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్న నానుడి వాదనను కొందరు లాభాల కోసం దొడ్డిదారిన నకిలీ పత్తి విత్తనాలను దొడ్డిదారిన అమ్ముతూ రైతన్న జీవితాలతో చెలగాట మాడుతున్న దుస్థితి నెలకొంది.

ఈ సీజన్లో ఎక్కువగా పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపడం వలన విత్తనాలకు డిమాండ్ ఉండడంతో ఇది అదునుగా భావించిన దళారులు నకిలీ విత్తనాలతో కాసులకు కక్కుర్తిపడి నకిలీ విత్త నాలను రైతులకు అందించి మోసాలకు పాల్పడు తున్నరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,

PUBLIC NOTICE

The general public is hereby informed through this notice that my client **P. Srinivas S/o.P.Naganna Dorah**, restling at Flat.No.102, 192 B.Saikrupa Residency, Aruna Society, Jaya Nagar, Opp: KPHB Colony, Hyderabad is the absolute owner of property Flat No: 202, (in Second Floor) with buit-up area of 410 Sq. feet (inclusive of common area) along with an undivided share of land admeasuring 22.00 Sq.Yards or 18.39 Sq. mts., (out of 152 Sq Yards) in h. No.22-223/1, on plot No.192/8, in Sy. No.133,134,135/1 to 4, 136/1, 3 and 1941, situated at Aruna Society, Kukataplly Village, (previous Balanagar Mandal. Rangareddy District) Kukat pally Mandal, Malakajgiri District having purchased under registered sale Deed Bearing Document No.6055/2011 dated 31-12-2011.

It is brought to the notice of general public that the original registered link sale deed document bearing No. 3441/2001 Dated 30-06-2001 duly registered with SRO, Kukatpally on 30-06-2001 in favour of M.Venkata Rao S/o M. Suranna have been lost misplaced while he traveling from Gachibowli to Manikonda by my client and in spite of his best efforts he is unable to trace out the same.

My client apprehension is that the above said documents if found by 3rd parties may misuse the same or create any charge on the above said property by showing fictitious owners. The general public is here by informed through this notice not to enter into any kind of transaction, provide any lone by taking deposit of the original sale deeds to any person or persons. In the event any person finds the above said documents, kindly contact the under signed. Inspite of this notice if any person or persons mis-utilizes the above said registered documents, they will be solely responsible and will be prosecuted with criminal liability and in case of any third party transaction/s are held inrepect of the said properties, the same shall not bind on my client and will not get any right over said properties

A.SUDARSHAN REDDY
Advocate
#2-22-1-16/1T053, Flat No, 108, Alluri Residential Complex, Bhagyanagar Colony, Kukatpally. Hyd-500 072
Th. No, 9908122977

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT COMPLEX, AT: SECUNDERABAD
O.S.No. 284 OF 2024

Between:
Aluri Sitadevi & Another ...Plaintiff
AND
The Tahshildar cum M.R.O., Secunderabad and Others ...Defendant

NOTICE

To,
All Concerned

Please take notice that the above named plaintiff has filed the above suit for declaration of legal heirs of the Aluri Venkateshwar Rao against the defendants before this Hon'ble Court and the same is posted to **14.06.2024** for your appearance before the said Hon'ble Court at 10: 30 a.m., any one of you have any objections come along with your objections, failing which the matter will be decided in your absence and decreed exparte.

(By order of the Hon'ble Court)
Sd/- **M.TRIVENI,**
G R K PRASAD, Advocates,
Safilguda, Malkajgiri,
Hyderabad.

In The Hon'ble Court of the I Addl Junior Civil Judge-Cum-VIII Addl Metropolitan Magistrate At: Athivelli
O.S.No: 103/2023

Between:
Kasaraboina @Parvathapuram Shankaraiah, S/o late P. Nagaiah, aged 61 years, Occ: Auto Driver, A resident of Keshavaram, Shamirpet Mandal, Medchal-Malkhajgiri District-500014 Presently residing at Sree Sai Residency, H.No: 1-6-147, Road N: 37: Chaitanyapuri, Hyderabad-500060 Aadhar card No: 382114913675, Mobile: 9290403211 .... Plaintiff

And:
1. Kasaraboina @ paravathgapuram Krishnaiah, S/o late P. Nagaiah, aged 61 years, Occ: Retired Govt employee, aged 53 years, A resident of Keshavaram, Shamirpet Mandal, Medchal-Malkhajgiri District – 500014
2. Parvathapuram Kasheraboina Prashanth Kumar, S/o Kasaraboina @ paravathgapuram Krishnaiah Occ: Real estate business, aged 30 years, A resident of Keshavaram, Shamirpet Mandal, Medchal-Malkhajgiri District-500014 ...Defendants

NOTICE TO DEFENDANTS

WHEREAS this day 10/11/2023 was fixed for the hearing of the above suit and a summons was issued to you, the plaintiff has appeared in this Court and you did not appear, so the Hon'ble Court issued a summons for your appearance. Still, from the return of the Nazir, it has been proved to the court that the summons was not served on you although you are permanently residing at the address given in the cause title.

Therefore, to enable you to appear and answer on the day fixed in the said summons; Notice is hereby given to you that the hearing of the suit is adjourned this day and that the 10th day of June 2024, is now fixed for the hearing of the same; in default of your appearance on the given adjournment date, the suit will be heard and determined in your absence.

G.S.L.P. RUPA DEVI, K. Delli Rao
Advocate, Hyderabad
Res: Flat No.110, Plot No.32, Kranti Harika Apts., HUDA Complex, Saroornagar, Hyderabad-500035.
Ph:9248774197, 8790887842

IN THE COURT OF THE XX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
I.A.No.235 of 2024
in
OS No.1116 of 2024

Between:
B.Vijaya through GPA holder B.Balaiah ...Plaintiff
And
N.Dwaraka ...Defendants

NOTICE

To,
Sri.N.Dwaraka Occ: Business S/o.Lal Chand, Aged 61 yrs, Prop. of Raj Rajeshwari Trading Company Grain Merchants, Commission Agent, # 15-2-184/4 & 15-2-184/5, Maharaj Gunj, Hyderabad-500 012. And also at Sri.N.Dwaraka, S/o Lal Chand, R/O.H.No.15-2-209, Maharaj Gunj. Hyderabad-500 012.

Take notice that the Plaintiff has filed the above suit against you for Eviction. Plaintiff also filed above IA under Rule 15A of CPC, said IA stands posted **on 19/06/2024 at 10.30 am**. for your appearance. Failing which the matter will be decided ex-parte.

(BY ORDER OF THE COURT)
M. SURYA PRAKASH
S.Manohar Rao, Advocates
1-8-315 & 315, Viswanatha Nilayam Street No.17, GHMC No. 1077, Chikkadpally, Hyd-20.
Cell:.09908380063/ 9490190304

IN THE COURT OF HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S.NO.1816 OF 2024

BETWEEN:
SRI KSHTRI BALA BHARGAV SINGH And Others ...PLAINTIFFS
AND
THE TAHASILDAR, AMBERPET And Another ...DEFENDANTS

TO,
ALL CONCERNED

NOTICE

Please take notice that the Plaintiffs herein had filed in the above suit seeking Declaration to declare them as the legal heir Late Sri Kshtri Durga Bhan Singh which is posted to 05.06.2024 by the Hon'ble Court to receive the objections or persons opposing.

If any person or persons have any objections, claim or concern of whatsoever against such relief, they may put forth their objections before the Hon'ble XIX Junior Civil Judge, City Civil Court, at Hyderabad **on 05.06.2024 at 10:30 a.m.** either personally or through authorized counsel or otherwise the matter will be adjudicated in due process of law. Hence, this NOTICE,

[BY ORDER OF THE COURT]
BHAKTI B TURAKHIA
ADVOCATE
#Flat No.501, Sri Vishnu Enclave, 3-3-615/1, Kachiguda, Hyderabad-500 027.
Mobile No: 7416833196

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, సూర్యాపేట వారి సమక్షంలో
I.A.No.267 OF 2023
IN
O.S.No.27 OF 2023

Between:
సయ్యద్ జలీల్ పాషా ...పిటిషనర్/వాది
మరియు
దేప వంశీధర్‌రెడ్డి ...రెస్పాండెంట్/ప్రతివాది

To,
దేప వంశీధర్‌రెడ్డి తండ్రి: మల్లారెడ్డి R/o.ప్లాటు నెం.501,ప్లాటు నెం.302, మార్వెల్ పిల్లల హాస్పిటల్ ఎదురుగా, శ్రీరాం పురం కాలనీ, బి.యన్.రెడ్డి నగర్ కాలనీ, వనస్థలిపురం, రంగారెడ్డి జిల్లా.

పై నెంబర్ గల దావాలో పై పిటిషన్ను పై పిటిషనర్/వాది మీపై పై గౌరవ కోర్టులో వేసినారు. మీకు పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ అవి అందక తిరిగి వచ్చుచున్నవి. కావున పై దావా మరియు I.A. మీ హాజరు కొరకు తేది:12.06.2024 కి వాయిదా వేసినారు. కావున ఆ తేదిన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా కానీ లేక న్యాయవాది ద్వారా కానీ పై గౌరవ కోర్టు వారి ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలియజేసుకోగలరు. లేని యెడల పై కేసును గౌరవ కోర్టువారు మీ పరోక్షంలో చట్టప్రకారం తీర్పు చేయగలరు.
(గౌరవ కోర్టువారి అనుమతితో)

ఇట్లు
వి.వెంకటేశ్వరరావు
రాధా కృష్ణ పత్తిపాక
న్యాయవాదులు,సూర్యాపేట.
సెల్:9848202964.

IN THE COURT OF THE HONOURABLEXITH JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.S. NO. 442 OF 2022

BETWEEN:
Subramanyam Dandala ...Plaintiff
AND
Mr. Sailesh Kumar Gujjar ...Defendant

Mr. Sailesh Kumar Gujjar, S/o Late Nagender Rao Gujjar Aged 55, Business, at 4-1-42, 43, 45/A, Old Bhoiguda, Secunderabad 500 003 ...Defendant

Whereas the Plaintiff Subramanyam Dandalahas instituted a suit for recovery of money for Rs.19,51,166/-against you. You are hereby summoned to appear in the Court of XITH JUNIOR CIVIL JUDG, City Civil Court at Secunderabad in person or through an advocate duly instructed, on 11-06-2024 at 10:30 A.M. failing which the matter will be heard and decided Ex-Parte.

(BY ORDER OF THE COURT)
G.V. Giridhar,
B.N. Radhakrishna Yadav,
B. Naveen Kumar
Advocates
Plot No. 77, Syndicate Bank Colony, West Marredpally, SECUNDERABAD-500026.
Cell.No. 8341742340

IN THE COURT OF THE HON'BLE III Addl.JUNIOR CIVIL JUDGE-Cum-III Addl. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT AT :L.B. NAGAR
O.S.No: 1154 of 2022

Between :
State Bank of India ...Plaintiff
AND
K.Vijaya Kumar ...Defendant

To,
K.Vijaya Kumar S/o.Venkataiah, Aged: 48 Yrs, Occ: Employee, R/o.H.No 2-155, Sai Baba Colony, Chowdariguda, Korremulu Ghat kesar R.R.District - 500068.

NOTICE

Take notice that the plaintiff bank filed the above suit for recovery of amount against the defendant and the said suit is stands posted for your appearance on 11.06.2024. Hence your are hereby directed to appear before the said court **on 11.06.2024 at 10.30 AM** personally or through an advocate failing which the matter will be heard in your absence.

//By order of the Court//
B.Sriram Kartik,
S Kishore, Advocates,
Plot No.22, Sri Sai Nagar Colony,
Road No.4, GSI Post,
Hyderabad-500068.

PUBLIC NOTICE

It is informed to the general public that my client Sri. SB Karan Kumar S/o. Basanthlal Jayakumar & Smt. P.Swetha W/o. Karan Kumar has informed that they misplaced Original Regd. Sale Deed Doc. No.2127/1977, dated: 27-05-1977 at SRO, Hyderabad(R.O) by Mr. Qamaruddin in favour of Smt. P. Laxmi of the below mentioned Schedule of Property. If anybody found the above Document same may be intimated / hand over to the below mentioned office. My Client further states that they want to avail loan by mortgaging the schedule mentioned property. If any person has any claim / interest / dispute over the said transaction, the same may be intimated to the undersigned within 7 (seven) days from the date of this publication, failing which, no further claims / objections will be entertained and my clients will proceed with the same.

SCHEDULE OF PROPERTY

All that Residential House bearing No.1-7-87/2/1 (PTI No.1010104720), on portion of Plot bearing No.G-158, in Sy.Nos.317 & 318, admg 210.0 Sq.Yds., having Ground+2 Floors, plinth area 4432 Sft., with RCC Roof, situated at Kamala Nagar Housing Colony, Kushaiguda, Kapra Village, under GHMC Kapra Circle, Kapra Mandal, Medchal-Malkajgiri District, T.S. and bounded by: North : Northern Portion of Plot No.158, South : Plot Nos.153 & 152, East: Plot No.159, West: 30' Wide Road.

Sd/- **P. Santosh Kumar**, Advocate
#1-8-506/2/A/1, Adnan Chambers, Prakashnagar, Begumpet, Secunderabad,-16. Ph:09440067560

PUBLIC NOTICE

he General Public is Hereby Informed that My Client Smt. Bollineni Lakshmamma W/o Haribabu, R/o: H.No. Koyavari palem, petluru (P), Kondepi (M) Prakasam District, Andhra Pradesh-523270 with respect to Residential Open Land Admeasuring 202 Sq. Yds in Plot bearing Number 09, Situated At Bachupally Village & Mandal, Medchal - Malkajgiri District, Telangana State had entered into an Agreement of Sale with Possession with Sri. B. Srisailam S/o. Bumaiah and also paid part sale consideration to him.

It is hereby warned the General Public that they should not proceed with any transactions with regard to the aforesaid property with Sri. Sri. B. Srisailam S/o. Bumaiah, or his Family members/representatives/ agents/ Power of Attorney holder/s as the above-said property have entered an Agreement of Sale with my client.

If any person/s proceeds with any type of understanding/transaction for the above said property, with the people mentioned above and inform to me within 15 days from this notice publication date and they will be held responsible for the cost and consequence thereof and my client will not be held responsible for the same.

JN MALLESWARI
G VENU GOPALA RAO
Advocates & Associates
Flat No. 401, Mathrusri Nagar, Miyapur, Hyd-49, Email: mallij@gmail.com
Ph: 9885882972

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: WANAPARTHY
I.A.No.418 / 2023
in
O.S.No.31 / 2019

Between:-
Smt.Nukala Suvarchala &(2) Others ...Petitioners/Plaintiffs
AND
Sri.Akuthota Devaraj 5 others ...Respondents/Defendants

To,
Mr.Uppu Gandhishetty, S/o.Uppu Narayanashetty, Age:74yrs, Occ: Business, R/o.H.No.122/A/1, Flat No.40, Purnima Residency Western Hills Colony, Near Narayana Concept School, Addagutta Society, Kukutpally, Tirmulgiri, Hyderabad - 500 072.

The Petitioner herein has filed the above said IA.No.418/2023 in O.S.No.31/2019 against you in the above Court Under Order IX, Rule IX CPC for Restoration of Main suit OS.No.31/2019. Please take notice that the said case is posted to 11-06-2024 for your appearance, if you fail to appear before the above mentioned court **on 11-06-2024 at 10-30 AM** either in person or through Advocate, you will be set exparte and the case will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
Yanamandra Nagaraju
K.MANJULA
ADVOCATES
Flat.No. G-1, Sai Ganesh Towers, H.No.16-11-94, Moosarambagh, Hyderabad-500036
Cell: 9985726398

IN THE HON'BLE COURT OF THE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.No.3018 OF 2020

Between:
State Bank of India, RACPC-III, Hyderabad. ...Plaintiff
And:
Rayanki Naveen ...Defendant

To,
Rayanki Naveen, S/o.Rayanki Srinivas Rao, Aged about 34 yrs, Occ: Business, Flat No.306, Plot No.44, Aadhya Mansion,Prasanthi Hills, Pragatinagar, Hyd-500 090.

Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at **10-30 AM on 03-06-224** in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

SMT.RAPAKA ARUNA,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar, Gaddiannaram, Hyd-500 060.
Cell: 9030617991

IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE CUM VI METROPOLITAN MAGISTRATE MEDCHAL-MALKAJGIRI DISTRICT (UPPAL) AT:L.B.NAGAR
O.S.No.134 OF 2024

BETWEEN:
1.Bomerica Ranga Reddy, S/o. Late Janga Reddy, Aged about: 82Yrs, Occ: Retd Employee, R/o Flat No.304, Block No.A13, Sariskthuti Town Ship, Pocharam Village, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District.
2.Bomerica.Anil Reddy, S/o. Ranga Reddy, Aged about: 52Yrs, Occ: Business, R/o.Flat No.407, A-46, Sanskruthi Town Ship, Pocharam Village, Ghatkesar Mandal, Medchal-Malkajgiri Dist ...Plaintiffs
AND
1.Regional Transport Officer, RTA Uppal, Medchal-Malkajgiri District.
2.Mandal Revenue Officer, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District.
3.All Concerned ...Defendants

To
All Concerned ...Defendant No.3

Please take notice that the above named Plaintiffs filed the above suit against the Defendants for Declaration of Legal heirs of Deceased Late Bomerica. Surachitha for the purpose of legal status, The same is posted on 10.06.2024 for your appearance. If any of you have any objections, claim, title or interest you may appear before the above mentioned court **on 10.06.2024 at 10:30 a.m.** either in person or through an Advocate, otherwise the Hon'ble Court will proceed with the matter in your absence.

//BY ORDER OF THE COURT//
L.SATYANARAYANA
Advocate

N THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE : R.R.DISTRICT :: AT: L.B.NAGAR
I.A.No.710 OF 2022
IN
O.S.No.150 OF 2021

BETWEEN:
P.Viswanath Reddy ...Petitioner/Plaintiff
AND
1.Mrs.Sayeeda Begum & others ...Respondent/Defendant
2.Smt.Syeda Ayesha Begum & others ...Proposed Defendants No.4 to 7

To,
1.Smt.Syeda Ayesha Begum W/o Mohammed Aijazuddin, Aged about 55 yrs, Occ: House wife.
2.Smt.Uzma AijazD/o.Mohammed Aijazuddin, Aged about 30 yrs, Occ: Not known.
3.Smt.SalmaAijzaD/o.Mohammed Aijazuddin, Aged about 29yrs, Occ: Not known.
4.Mr.Mohammed Abranuddin S/o Mohammed Aijazuddin, Aged about 24yrs, Occ: Not known.
All are R/o.H.No.11-3-831, New Mallepally, Hyderabad-500001. ...Proposed Defendants No.4 to 7

Please take Notice that, the above said Plaintiff have filed the Suit for Specific Performance of Suit Agreement of Sale, Dt:17-02-2018 in respect of suit schedule property against the defendants and during the pendency of the suit the Defendant No.3 i.e., Sri.Mohammed Aijazuddin was died on 20-05-2021 leaving behind you are the legal heirs, as such the plaintiff filed the above I.A. to bring you as LR's in the above said suit, the said case is posted **on 05-06-2024** for your appearance **at 10.30 a.m.** on the above said court, as such please make it convenient to attend on the said date i.e., 05-06-2024 either in person or through an Advocate, failing which, the matter will be decided Ex-parte.

//BY ORDER OF THE COURT//
D.VENKAT REDDY
Advocate.
H.No.11-8-157/A, Road No.9, Kranthi Nagar, Kothapet, Hyderabad

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, సూర్యాపేట వారి సమక్షంలో
O.S.No.27 OF 2023

Between:
సయ్యద్ జలీల్ పాషా ....వాది
మరియు
దేప వంశీధర్‌రెడ్డి ....ప్రతివాది

To,
దేప వంశీధర్‌రెడ్డి తండ్రి: మల్లారెడ్డి R/o.ప్లాటు నెం.501,ప్లాటు నెం.302, మార్వెల్ పిల్లల హాస్పిటల్ ఎదురుగా, శ్రీరాం పురం కాలనీ, బి.యన్.రెడ్డి నగర్ కాలనీ, వనస్థలిపురం, రంగారెడ్డి జిల్లా.

పై వాది మీపై పై నెంబర్ గల దావాను పై గౌరవ కోర్టులో వేసినారు. మీకు పలుమార్లు సమన్లు పంపినప్పటికీ అవి అందక తిరిగి వచ్చుచున్నవి. కావున పై దావా మీ హాజరు కొరకు తేది:12.06.2024 కి వాయిదా వేసి నారు. కావున ఆ తేదిన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా కానీ లేక న్యాయవాది ద్వారా కానీ పై గౌరవ కోర్టు వారి ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలియజేసుకోగలరు. లేని యెడల పై కేసును గౌరవ కోర్టువారు మీ పరోక్షంలో చట్ట ప్రకారం తీర్పు చేయుబడును.
(గౌరవ కోర్టువారి అనుమతితో)

ఇట్లు
వి.వెంకటేశ్వరరావు
రాధా కృష్ణ పత్తిపాక
న్యాయవాదులు,సూర్యాపేట.
సెల్:9848202964.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGERANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR
O.S.NO. 379 OF 2024

Between:
Datla Ramalinga Raju & others Represented by their G.P.A. Holder Sri P.Ramesh Babu ...Plaintiffs
AND
N.Ramalinga Reddy & others ...Defendants

To,
All Concerned ...Defendant No.3

NOTICE

That the above named Plaintiffs have filed the above suit for declaration to declare them as legal heirs of deceased Smt.Datla Surya Prabhavathi, who died intestate on 16-05-2005 at Mamuduru village and Grampanchayath, Penumantra Mandal, West Godavari District, A.P. due to ill-health against you and others before the Hon'ble Principal Junior Civil Judge, Ranga Reddy District at Hayathnagar and the above suit is posted on 14-06-2024 for objections. If any person/s he/she/they are having any objections he/ she/ they may appear before the Hon'ble Junior Civil Judge, Ranga Reddy District at Hayathnagar **on 14-06-2024 at 10:30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided as Ex-parte in your absence.

SCHEDULE OF PROPERTY

All that part and parcel of Open Plot No.54, admeasuring 222 sq. yards or 185.08 sq. meters, forming part of Sy.No.186, situated at Bagh Hayathnagar village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, Telangana State and bounded by: **NORTH:** Road 25', **SOUTH:** Plot No.53, **EAST:** Road 25', **WEST:** Plot No.42

(BY ORDER OF THE COURT)
M/s.HEMANTH PRAVEEN KUMAR
Advocate & Associates,
Plot No.71,Raghavendra Colony, Hayathnagar, Ranga Reddy
District Counsel for the Plaintiffs
Phone No.9396489059

IN THE COURT OF THE HON'BLE II ADDL, DISTRICT JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL
O.S.181 of 2023

Between:
P.Venkata Bhaskar ...Plaintiff
AND
M.Suresh Kumar Raju ...Defendant

To.
MUDUNURI SURESH KUMAR RAJU, S/o.M.Subba Raju, aged 47yrs, Occ: Pvt. Employee, R/o. Flat No.301,SriChaitanyaNilayam, CBCID Colony, Hydemagar, Kukatpally, MedchalMalkajgiri District, Hyderabad, T.S-500085.

NOTICE

Please take notice that the Plaintiff PINNAMARAJU VENKATA BHASKAR, filed the above suit against the Defendant vide O.S.181/2023 on the file of the above said Hon'ble Court for Specific Performance of Agreement of Sale, dated.05-06-2023 in respect of the Property i.e., Residential House bearing No.6-C134, with plinth area of 386.0Sft.built on Plot No.134, in Survey Nos.276, 277 & 282, admeasuring 100 Sq. Yards or equivalent to 83.6 Sq. Mtrs., situated at Apuroopa Township, Jeedimetla Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana State and the said suit stands posted **to 11-06-2024** for the appearance of the Defendant for objections if any in granting relief.

Therefore the defendant is directed to appear before the above court **on 11-06-2024 at 10.30 A.M.** either in person or through Advocate, failing which, the matter will be heard and decided as exparte.

//BY ORDER OF THE HON'BLE COURT//
G.MALYADRI YADAV
Advocate
48-348/1, Ganesh Nagar, Chintal, HYDERABAD-54.
Cell No.7799473803.

ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి



నవతెలంగాణ - నాగోల్

భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ - తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఏవి నగర్ కాలనీ ఫేస్ 2 కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు సోమవారం చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని చైర్ పర్సన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ గౌరవ అధ్యక్షుడు వరదాచార్యులు, అధ్యక్షుడు దామోదర్ రావు, బొడ్డుపల్లి వెంకట్ ఉన్నారు.



రూ.8లక్షలు వసూలు చేసి మృతదేహం అప్పగింత

- వైద్య ఖర్చుల కోసం చందాలు వేసుకొని రూ.7.50లక్షలు పోగుచేసిన బంధువులు, స్నేహితులు
- న్యాయం చేయాలంటూ హాస్పిటల్ ఎదుట బంధువులు ధర్నా



నవతెలంగాణ - చైతన్యపురి

ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై 70శాతం కాలిన గాయాలతో ఉన్న ఓ వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతనికి నయం చేస్తానంటూ రూ.8లక్షల కట్టించుకొని మృతదేహాన్ని అప్పగించారని బంధువులు చైతన్యపురిలోని షణ్ముఖ వైష్ణవి హాస్పటల్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నేపాల్ రాజధాని ఖాట్మండుకు చెందిన కమల్ బహదూర్(38) బతుకు దెరువు కోసం నేపాల్ నుంచి కుటుంబ సభ్యులతో నగరానికి వచ్చాడు. కొన్ని రోజులు ఓ ప్రాంతంలో వాచ్‌మెన్‌గా పనిచేసి ఆ తర్వాత నల్గొండ జిల్లా చిట్యాలలోని ఓ కంపెనీలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజుల కిందట తన సొంత ఊరు ఖాట్మండుకు బయలుదేరి వెళ్లాడు. ఖాట్మండుకు వెళ్తున్న తరుణంలో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో షార్ట్ సర్క్యూట్‌కి గురయ్యాడు. దాదాపు ఆ ప్రమాదంలో 70 శాతం వరకు కాలిపోయాడు. చికిత్స నిమిత్తం అతన్ని నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. మరింత నాణ్యమైన చికిత్స కోసం అత్తాపూర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ డబ్బులు చెల్లించలేక మళ్లీ ఉస్మానియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. తర్వాత చైతన్యపురిలోని షణ్ముఖ వైష్ణవి ఆస్పత్రిలో నాణ్యమైన చికిత్స అందించి అతనికి నయం చేస్తానని ఆస్పత్రి యజమాన్యం భరోసా ఇవ్వడంతో ఈ నెల 21వ తేదీన షణ్ముఖ వైష్ణవి ఆసుపత్రిలో చేర్పించారు. నేపాల్‌కు చెందిన బంధువులు స్నేహితులు అందరూ కలిసి చందాలు వేసుకొని దాదాపు రూ.7.50లక్షలు(వైద్యం ఖర్చు, మెడిసిన్స్, ఇతర పరీక్షలకు) పోగు చేసి ఆస్పత్రికి చెల్లించినట్లు తెలిసింది. సోమవారం అతను చనిపోయినట్లు ఆస్పత్రి యజమాన్యం కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలియజేశారు. సరైన వైద్యం అందించకపోవడం వలనే అతడు మృతి చెందాడని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ మేరకు హాస్పిటల్ ముందు చైతన్యపురి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చైతన్యపురి, నాగోల్, ఎల్బీనగర్‌లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు గట్టి బందోబస్తూ నిర్వహించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

సర్కిల్ కార్యాలయంపై పేరుకుపోయిన పాకూరు



నవతెలంగాణ - ఎల్బీనగర్

నగరాన్ని రోజు పరిశుభ్రంగా ఉంచేది 'జీహెచ్ఎంసీ'. ఉదయం పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తూ చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. ఇందులో పారిశుద్ధ కార్మికులు అలసత్వం వహిస్తే జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి జీహెచ్ఎంసీ అధికారులు.. సర్కిల్ కార్యాలయంపై నెలల తరబడి అపరిశుభ్రంగా ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఎల్బీనగర్, హయత్ నగర్, సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయాలు ఒకే చోట మూడు అంతస్తుల్లో ఉన్నాయి. దీంతో సర్కిల్ కార్యాలయాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. సర్కిల్ కార్యాలయం స్లాబు పైన వర్షపు నీరు ఎటు వెళ్లలేక అక్కడే నిలిచి పాకూరు పట్టింది. దీపం అందరికీ వెలుగునిస్తూ తన కింద ఉన్న చీకటిని గుర్తించినట్లుగా జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు కార్యాలయం స్లాబులపైన వర్షపు నీరు నిలిచి పాకురు పట్టిపోయినా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. జీహెచ్ఎంసీ అధికారుల తీరు 'ఇంట్లో ఈగలమోత బయట పల్లకి మోత' లాగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. స్లాబంతా చెడిపోతున్నా అధికారులకు పట్టింపు లేదని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ కమిషనర్లు తమ చాంబర్లను అందంగా తీర్చిదిద్దుకుంటున్నారు. కానీ కార్యాలయం పైన, పరిసర ప్రాంతాలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ లోపం వలన సర్కిల్ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండడం లేదని అక్కడికి వచ్చే ప్రజలు అంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను అధికారులు పట్టించుకోకపోయినా అడిగే వారు లేకపోవడంతో కార్యాలయం ఇలా పాకూరు పట్టుకుపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్లాబ్ పైన పేరుకుపోయిన పాకూరును తొలగించి సర్కిల్ కార్యాలయాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు.

ఇంటర్మీడియట్‌లో మిగిలి ఉన్న
సీట్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ రఘునందన్ రావు

నవతెలంగాణ - బడంగ్‌పేట్


10వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల నుండి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కందుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.రఘునందన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి తూర్పు రీజియన్ పరిధిలోని నాన్ సిఓఈ కళాశాలల్లో మిగిలిన సీట్ల వివరాలు కందుకూర్ అండ్ కొందుర్గు కళాశాలలో ఎంపీసీ, బైపీసీ శంషాబాద్ కళాశాలలో ఎంఈసీ, సీఈసీ, అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలోని ఈ విద్యాలయాల్లో అన్ని కోర్సులో ప్రవేశం పొందడానికి 10వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు అని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https://www.tswreis.ac.in/ వెబ్సైట్ సందర్శించి రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 24 నుంచి 31వ తరగతి వరకు దరఖాస్తులు స్వీకరణ ఉందని పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారని కందుకూరు ప్రిన్సిపాల్ పి.రఘునందన్ రావు తెలిపారు.

గిరిజన ఆలయ నిర్మాణానికి
స్థలం కేటాయించాలని వినతి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడ ప్రాంతంలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవా లాల్ మహారాజ్, అమ్మవారి దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సిఎంఓ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలను అందజేసినట్టు గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బహుగుణ నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేక కాలనీల్లో ఎన్నో సంవత్సరాలుగా గిరిజనులు నివాసం ఉంటున్నారని తెలిపారు. గతంలో అల్మాస్‌గూడ తిరుమల నగర్ కాలనీలో నివాసముంటున్న మేం ప్రభుత్వ స్థలంలో సంత్ సేవాలాల్ మహారాజ్, అమ్మగారి విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ విగ్రహాలను తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించిన సమయంలో మాకు తెలియకుండా ఆ విగ్రహాలను అక్కడి నుండి వేరే స్థలంలో పెట్టారన్నారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆ విగ్రహాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం మారడంతో తమకు స్థలం కేటాయించడంలో ఆలస్యం అవుతుందని తెలిపారు. తిరుమల నగర్ ఆనుకొని ఉన్న నాదర్‌గుల్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 92లో 1ఎకరం భూమి కేటాయించాలని కోరారు. అంతకు ముందు గిరిజన సంక్షేమ సంఘం నాయకుల కోరిక మేరకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కొంత ప్రభుత్వ భూమిని కేటాయించడం జరిగిందని, ఆ స్థలాన్ని మాకు తెలియకుండా రెడ్డి సంఘం నాయకులు స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి.. గిరిజనుల ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించి, తమ జాతికి న్యాయం చేయాలని కోరారు.



నవతెలంగాణ - బడంగ్‌పేట్

చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ సోమవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లతో మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాయిరాం కాలనీ కార్యాలయంలో డాక్టర్ రమాబాయి భీమ్ రావ్ అంబేద్కర్ 89వ వర్ధంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీవైఎస్ రాష్ట్ర సిల్మర్తి శేఖర్ మాట్లాడుతూ ఈ దేశానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలు వెలకట్టలేనివని, వారి త్యాగం ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బైండ్ల సంఘం అధ్యక్షులు నందిగామ వెంకటేష్, నందు, రాములు, వెంకటేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం



సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : ఎమ్మెల్యే



నవతెలంగాణ- నాగోల్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో వరమని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని జైపురి కాలనీకి చెందిన అరవింద్ కుమార్ వెన్నుముక సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయన ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బు కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేశారు. అందుకుగాను 1,50,000(ఒక లక్ష యాభై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరైంది. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే లబ్ధిదారుడికి ఆ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి దోహదపడుతుందన్నారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరం అని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని అన్నారు. అర్హులు సీఎంఆర్ఎఫ్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితుడి తల్లి ప్రసన్నరాణి, రాకేష్ ఠాగూర్ పాల్గొన్నారు.

మురుగునీరు
ఇళ్లల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి

- కార్పొరేటర్ రంగా నరసింహా గుప్తా



నవతెలంగాణ - చైతన్యపురి

మురుగు నీరు ఇండ్లలోకి రాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నరసింహా గుప్తా అన్నారు. చైతన్యపురి డివిజన్ న్యూ మారుతీ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 12 ఎ లో డ్రైనేజ్ మెయిన్ లైన్ డామేజ్ అయిన విషయం తెలుసుకున్న కార్పొరేటర్ అధికారులను వెంట పెట్టుకొని స్థానికులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే డామేజ్ అయిన లైన్ మార్చి కొత్త లైన్ వేయాలని అన్నారు. మురుగు నీరుతో ఇండ్లు మునగకుండా చూసుకోవాలని అధికారులను కోరారు. ఈ పరిశీలనలో ఏఈ రవీందర్ రెడ్డి, సురేందర్, జవాన్ శ్రీకాంత్, బీజేపీ నాయకుడు శ్రీనివాస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పత్తుల్లాగూడలో ప్రారంభమైన పోలీసుల పర్యవేక్షణ



నవతెలంగాణ - నాగోల్

నాగోలు డివిజన్ పరిధిలోని పత్తుల్లాగూడ వంద అడుగుల రోడ్డుపై మద్యం సేవిస్తూ ఓ యువతి, యువకుడు హల్చల్ సృష్టించి వాకర్సుతో వాగ్వాదానికి దిగిన సంగతి తెలిసిందే. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడం వలనే పత్తుల్లాగూడ 100 అడుగుల రోడ్డులో ఇలాంటి ఘటనలు వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయని స్థానికుల నుండి ఆరోపణలు కూడా వినిపించాయి. దీంతో అప్రమత్తమైన నాగోల్ పోలీసులు పత్తుల్లాగూడ 100 అడుగుల రోడ్డులో పర్యవేక్షణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రోడ్డుపై తిరుగుతున్న బైకులు, కారులను నిలిపి తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా వాహనదారులను ఎక్కడికి వెళ్తున్నారు, స్థానికంగా ఉండే వారేనా లేక ఇతర ప్రాంతం నుండి వచ్చారా అని ఆరా తీస్తూ వివరాలను అడిగి మరి తెలుసుకుంటున్నారు. మొన్న జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసుల పర్యవేక్షణ, తనిఖీలు ఎంతో ఉపయోగపడతాయని స్థానికులు అంటున్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్టు అనుమానం కలిగినట్లయితే వెంటనే సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని నాగోల్ పోలీసులు స్థానిక ప్రజలకు సూచించారు.

మన్సూరాబాద్ కల్లు గీత
సహకార సంఘం అధ్యక్షుడిగా పాతూరి శ్రీధర్



నవతెలంగాణ - హయత్ నగర్

మన్సూరాబాద్ కల్లుగీత సహకార సంఘం ఎన్నికలు సోమవారం ఎక్సైజ్ శాఖ అధికారి మొహమ్మద్ రఫీ ఎలక్షన్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పాతురి శ్రీధర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా పాతూరు వెంకటస్వామి గౌడ్, డైరెక్టర్లుగా పాతూరి సాయి దాస్ గౌడ్, పాతూరి సునీల్ గౌడ్, పాతూరి వసంతలు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతూరి బాలరాజు గౌడ్, మల్లేష్ గౌడ్, దేవేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రమేష్ గౌడ్, రాజేందర్ గౌడ్, నాగరాజు గౌడ్, మహేందర్ గౌడ్, రఘు గౌడ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శారదా నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ కళ్లెం



నవతెలంగాణ - వనస్థలిపురం

నిన్న మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కారణంగా డివిజన్ లోని శారదా నగర్‌లో భారీ వృక్షం విరిగి ఓ ఇంటిపై పడింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తర్వాత అధైర్యపడవద్దని కాలనీ వాసులకు సూచించారు. అనంతరం వెంటనే సంబంధిత డిఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హయత్ నగర్ డివిజన్‌లోని చాలా కాలనీలల్లో నిన్న కురిసిన అకాల వర్షం కారణంగా పదులకొద్ది చెట్లు విరిగిపోయాయని చెప్పారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ఆయన వెంట కేంద్ర సెన్సర్ బోర్డు సభ్యులు డాక్టర్ అప్పారావు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.





వికలాంగ మహిళల ఆశాదీపం

ఇరా సింఘాల్... దీర్ఘకాలిక వెన్నెముక సమస్యతో బాధపడుతూ కూడా కృషి, పట్టుదలతో అధిగమించింది. చాలెంజ్డ్ అన్న పదానికి అర్థాన్నే మార్చివేసింది. తనలాంటి వారు ఈ సమాజంలో స్వేచ్ఛ, సమానత్వంతో బతకాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించింది. యూపీఎస్సీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి గాజు కప్పును బద్దలు కొట్టింది. నేడు ఓ ఐఏఎస్ అధికారిగా ఇతరులకు మార్గం సుగమం చేసిన ఆమె పరిచయం నేటి మానవిలో...

మీరట్‌కు చెందిన ఇరా తల్లి అనితా సింఘాల్, తండ్రి రాజేంద్ర సింఘాల్. కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేస్తున్న తన తల్లిదండ్రులను చూస్తూ పెరిగింది ఇరా. కనుక సమాజానికి తిరిగి ఇవ్వాలనే తపన చిన్నతనంలోనే ఆమె మనసులో నాటుకుపోయింది. అయితే చిన్నతనం నుండి ఇరా హైపర్‌కైఫోసిస్ స్కోలియోసిస్ అనే వెన్నెముక సమస్యతో బాధపడేది. వంగడానికి వచ్చేది కాదు. కాలక్రమేణా ఆ సమస్య ఆమెను అంగవైకల్యానికి గురి చేసింది. అలాంటి ఆమె 2014 యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) పరీక్షలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు.

పోస్టింగ్ నిరాకరించింది

2010, 2011, 2013 ఇలా మూడుసార్లు పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఆ ర్యాంకులకు ఐఆర్ఎస్ వస్తుంది. యూపీఎస్సీ పరీక్షలో అన్నిసార్లు ఆమె ఉత్తీర్ణత సాధించినప్పటికీ వైకల్యం కారణంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆమెకు పోస్టింగ్ నిరాకరించింది. మరో అధికారైతే ఎగతాళిగా 'మీకొచ్చే బరువైన పార్శిళ్లను ఈ వైకల్యంతో విప్పలేరు' అన్నాడు. అంతేనా. 'అటెండర్ పనికి కూడా పనికి రావు' అని అభ్యంతరం పెట్టారు. అందుకే మరింత కసిగా చదివి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. ఒక్కసారిగా అందరి చూపూ తనవైపు తిప్పుకున్నారు. భారతదేశంలో ప్రతిభావంతులైన సివిల్ సర్వీసెస్ ఆశించేవారి మార్గంలో వైకల్యం ఎలా వస్తుందో ఆమె మొదటిసారిగా గ్రహించారు. 'నా వైకల్యం కారణంగా ఏ డిపార్ట్‌మెంట్ నన్ను అంగీకరించదని చెప్పి వారు నా అభ్యర్థిత్వాన్ని రద్దు చేశారు. యుపిఎస్‌సి పరీక్షకు రెండు ప్రమాణాలు ఉన్నాయి. వైకల్యాలు, సామర్థ్యాలు. నేను నా పోస్టింగ్‌కి సంబంధించిన విషయంలో అవసరమైన సామర్థ్యం కలిగి ఉన్నాను. అయినప్పటికీ తిరస్కరించబడ్డాను' అంటూ ఇరా పంచుకున్నారు.



నాలుగేండ్ల పోరాటం చేసి

2014లో తన చివరి ప్రయత్నం తర్వాత ఇరా తనను తిరస్కరిస్తున్న వారిని సవాలు చేస్తూ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. నాలుగేండ్ల న్యాయ పోరాటం తర్వాత ఎట్టకేలకు హైదరాబాద్‌లోని కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ సర్వీస్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించబడ్డారు. ఇలా పోరాడి విజయం సాధించారు. వికలాంగుల హక్కుల కోసం పోరాడే వీరవనితగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ప్రస్తుతం అరుణాచల్ ప్రదేశ్‌లోని తిరాప్ జిల్లాలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

అల్లర్ల ప్రభావం

తన సామర్థ్యాలను మెరుగుపరుచుకుని బలంగా నిలబడాలనే సంకల్పం ఆమెలో దశాబ్దాల కిందటే పుట్టింది. 1990వ దశకంలో ఆమె పెరిగిన ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో తరచూ అల్లర్ల చెలరేగేవి. దాంతో కొన్ని రోజుల కర్ఫ్యూ విధించేవారు. ఇలా జరిగినప్పుడు ఇరా ఆరు నెలలు పాఠశాలకు వెళ్లలేకపోయేవారు. ఇలా సంఘర్షణలతో నిండిన ప్రాంతంలో పెరిగిన ఆమె వాటి పట్ల బాగా ప్రవితమయ్యారు. చిన్నతనం నుండి విద్యలో చాలా చురుగ్గా ఉండేవారు. కనుక ఈ అల్లర్లపై అవగాహన పెంచుకున్నారు. అస్థిరమైన సమయాల్లో నగరాన్ని ప్రశాంతంగా ఉంచాలంటే అధికారాన్ని ఉపయోగించే ప్రభుత్వ అధికారులు సివిల్ సర్వెంట్లని ఆమె గమనించారు.



సివిల్ సర్వెంట్ అయితే...

'అల్లర్లను తగ్గించడానికి జిల్లా మేజిస్ట్రేట్ చట్టాలను రూపొందించారనే విషయాలను మేము నిరంతరం వార్తల్లో వినేవాళ్ళం. ఇదే సివిల్ సర్వెంట్లతో నా తొలి పరిచయం. రాష్ట్రంలోని కీలక సమయాల్లో వారు కలిగి ఉన్న అధికారం నన్ను ప్రభావితం చేసింది' అని ఆమె పంచుకున్నారు. 1995లో ఆమె కుటుంబం ఢిల్లీకి వెళ్లింది. అక్కడ ఎవరూ ప్రభుత్వ ఉద్యోగాల గురించి ఆలోచించేవారు కాదు. అందరూ కార్పొరేట్ ప్రపంచంలోకి ప్రవేశించాలనే లక్ష్యంతో ఉండేవారు. ఇది కూడా ఇరాను ప్రభావితం చేసింది. ఆమె కుటుంబ సభ్యుల్లో చాలామంది వ్యాపారవేత్తలుగా, న్యాయవాదులుగా, వైద్యులుగా, చార్టర్డ్ అకౌంటెంట్లుగా స్థిరపడ్డారు.

విలువలతో కూడిన జీవితం

తర్వాత కాలంలో ఇరా కూడా నేతాజీ సుభాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి బి.టెక్ పూర్తి చేసి ఢిల్లీ యూనివర్సిటీలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ ఫ్యాకల్టీ నుండి ఎంబీఏ చేశారు. తర్వాత కోకా-కోలా కంపెనీలో మార్కెటింగ్ ఇంటర్న్‌గా, క్యాడ్‌బరీకి స్ట్రాటజీ మేనేజర్‌గా కొంతకాలం పనిచేశారు. 'ఈ ఉద్యోగాలు చేస్తూ నేను అత్యధిక ఇంక్రిమెంట్‌లను పొందుతున్నాను. కానీ ప్రజల కోసం విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని గ్రహించడానికి నాకు కొంత సమయం పట్టింది' అని ఆమె పంచుకున్నారు. తను చేస్తున్న పని సమాజానికి ఎలా సహాయపడుతుందో ఆలోచించడం ప్రారంభించింది. ఇక ఉద్యోగం మానేసి యూపీఎస్సీ పరీక్ష రాసి సివిల్ సర్వీసెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు.

ఎక్కువ కష్టపడాలి

విద్యార్థిగా ఉన్నప్పుడు వైకల్యంతో పాటు ఓ మహిళగా ఉన్న ఆమె కొన్ని అవకాశాలు ఎలా తగ్గిపోయాయో గ్రహించారు. 'సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళలకు స్టేజ్‌పై క్యాట్‌వాక్ చేయాల్సిన పాత్రలకు పరిమితం చేసేవారు. మగ విద్యార్థులు మహిళలకు ఇతర పాత్రలు ఇవ్వకుండా అడ్డుకునేవారు. ఇలాంటి సమాజంలో మీరు ఒక మహిళగా అందునా వైకల్యాలున్న వ్యక్తి అయితే ఏదైనా చేయడానికి మీరు అర్హులని నిరూపించుకోవడానికి ఇతరుల కంటే ఎక్కువ కష్టపడాలి' అని ఆమె జతచేస్తున్నారు. ఇప్పటికీ తాను ఇదే చేస్తున్నానంటూ పంచుకున్నారు. ■

విద్య ఒక్కటే మార్గం

2014లో యూపీఎస్సీ పరీక్షలో తన చివరి ప్రయత్నంలో ఆమె నంబర్ వన్ కంటే తక్కువ ర్యాంక్ సాధించి ఉంటే ప్రభుత్వ పదవిని పొందే అవకాశం చాలా తక్కువ అని ఆమె అభిప్రాయపడ్డారు. 'వైకల్యాలున్న వ్యక్తులు ఏమీ చేయలేరు, ఒకరిపై ఆధారపడి ఉంటారు అనే ఒక నిర్దిష్ట భావన ప్రబలంగా ఉంది. ఓటింగ్ కేంద్రాలు మాత్రం వికలాంగులకు అనుకూలంగా ఉంటాయి' అని ఇరా అంటున్నారు. సమాజంలో సమానత్వం సాధించాలంటే విద్య ఒక్కటే మార్గమని ఆమె బలమైన అభిప్రాయం. 'సివిల్ సర్వెంట్ అవ్వడం లేదా కాకపోవడం అనేది ఇప్పటికీ నా ఎంపిక. అయితే చదువు విషయంలో అలా కాదు. ఎందుకంటే మన స్వేచ్ఛ, సమానత్వానికి చదువు ఒక టికెట్. అందుకే వికలాంగ పిల్లలందరికీ విద్యను అందుబాటులోకి తీసుకురావాలనేది నా కల' అంటూ ఆమె తన మాటలు ముగించారు.



బార్లీతో ఇలా...

రోజురోజుకూ వేడి పెరుగుతున్నది. ఉష్ణోగ్రతల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే తప్పనిసరిగా కొన్ని ఆరోగ్య సూత్రాలను పాటించాలి. శరీరం డీహైడ్రేట్ కాకుండా చూసుకోవడం చాలా అవసరం. అందుకు, తప్పనిసరిగా ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

బార్లీ నీళ్లు సేవిస్తే మన శరీరానికి అనేక ప్రయోజనాలు అందుతాయి. బార్లీ నీళ్లు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఈ నీటితో క్యాల్షియం, ఐరన్, జింక్, రాగితోపాటు అనేక రకాలైన మినరల్స్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అందుతాయి. బార్లీ నీళ్లు తాగడం వల్ల జీర్ణాశయం శుభ్రపడుతుంది. తద్వారా అజీర్ణ సమస్యలు దూరమవుతాయి. బార్లీలో ఉండే పీచు పదార్థం జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. కడుపులో మంట, ఎసిడిటీ, గ్యాస్‌ను నివారిస్తుంది. మలబద్ధకం సమస్యను రూపుమాపుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.

బార్లీలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. డైటరీ ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం తీసుకుంటే కొన్ని రకాలైన దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే ఒక గ్లాస్ బార్లీ నీళ్లు తాగితే.. మహిళలను ఎక్కువగా బాధించే మూత్రనాళ ఇన్ఫెక్షన్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. కిడ్నీల్లో రాళ్ల సమస్యకు కూడా బార్లీ నీళ్లతో చెక్ పెట్టవచ్చు.

ఇలా చేసుకుందాం..

ఒక పాత్రలో గుప్పెడు బార్లీ గింజలను వేసి అందులో ఒక లీటర్ నీటిని పోయాలి. 15 నుంచి 20 నిమిషాలపాటు ఆ నీటిని బాగా మరిగించాలి. దీంతో బార్లీ గింజలు మెత్తబడి.. వాటిలోని పోషకాలన్నీ నీటిలోకి వెళ్తాయి. కాసేపయ్యాక గింజలను వడగట్టాలి. ఈ నీళ్లలో కొద్దిగా నిమ్మరసం, ఒక టీస్పూన్ తేనె కలుపుకొని తాగేయాలి. బార్లీ నీటిలో మజ్జిగ కలుపుకొని తాగినా శరీరంలో వేడి ఇట్టే మాయమవుతుంది. ■

తెలంగాణ అధికారిక చిహ్నం ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

దాంట్లో కొన్ని మార్పులు చేయాలని వారికి సూచించారు. గత చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణాలు ఉన్నాయి. అయితే రాజరిక ముద్రలకు ప్రత్యామ్నాంగా ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమం, త్యాగధనుల బలిదానాలు ప్రతిబింబించేలా అది ఉండాలని సీఎం భావిస్తున్నారు. ఆయన సూచనలకు అనుగుణంగా ఎంపిక చేసిన దానిలో మార్పులు చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడి పదేండ్లు గడుస్తున్న నేపథ్యంలో జూన్ 2న ఈ చిహ్నాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ లోపు పూర్తి చేయనున్నారు.

రాష్ట్ర గీతంగా 'జయ జయహే'

తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రముఖ కవి అందెశ్రీ రాసిన "జయ జయహే తెలంగాణ" గీతాన్ని ఇటీవల సీఎం ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం కీరవాణికి దాని బాధ్యతలు అప్పగించారు. సీఎం సూచనల మేరకు గీత రచయిత అందెశ్రీ భావం, భావోద్వేగం మారకుండా రెండు నిమిషాల్లో పూర్తయ్యేలా దానికి మార్పులు చేశారు. సీఎం, అందెశ్రీ సూచనలకు అనుగుణంగా కీరవాణి స్వరకల్పన చేస్తున్నారు. మరో వైపు తెలంగాణ తల్లి విగ్రహం రూపకల్పన కూడా తుది దశకు చేరుకున్నట్టు సమాచారం. రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహం మొత్తం మూడింటినీ జూన్ 2న ఆవిష్కరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇందు కోసం అధికారులకు సీఎం ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం.

రెండువేల మందికి పైగా సజీవ సమాధి

- ఐక్యరాజ్య సమితికి పపువా న్యూగినియా అధికారులు వెల్లడి



పోర్ట్ మోర్స్‌బై : పపువా న్యూగినియాలో కొండచరియలు విరిగిపడి 2వేల మందికి పైగా ప్రజలు సజీవ సమాధి అయ్యారని ఆ దేశ అధికారులు ఐక్యరాజ్య సమితికి సోమవారం తెలియచేశారు. పెద్ద ఎత్తున కొండచరియలు కూలిపోవడంతో మారుమూల గ్రామం మొత్తంగా నేలమట్టమై పోయిందని చెప్పారు. తీవ్ర స్థాయిలో విధ్వంసం చోటు చేసుకుందన్నారు. దేశ రాజధాని పోర్ట్ మోర్స్‌బైలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయానికి ఈ మేరకు దేశ జాతీయ విపత్తుల నిర్వహణా కేంద్రం సమాచారం అందించింది. ఎంగా ప్రావిన్స్‌లో పర్వత సానువుల్లో గల మారుమూల కుగ్రామం దాదాపు కనుమరుగైందని అధికారులు తెలిపారు. ముంగలో పర్వతం నుంచి పెద్ద కొండచరియ శుక్రవారం తెల్లవారు జామున విరిగిపడడంతో వందలాది ఇళ్ళు శిథిలమయ్యాయి, అందులో పడుకుని నిద్రపోతున్న వారు అలాగే శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. తొలుత 670మందికి పైగా మరణించారని ఐక్యరాజ్య సమితి శరణార్థ సంస్థ అంచనా వేసింది. కానీ జరిగింది పెను విపత్తని దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపించేదని అధికారులు పేర్కొన్నారు. ఆ గ్రామానికి దారి తీసే ప్రధాన రహదారి కూడా పూర్తిగా ధ్వంసమైందని చెప్పారు. ఇంకా చిన్నాచితకా రాళ్ళురప్పలు నెమ్మదిగా పడుతుండడంతో పరిస్థితి ఆందోళనకరంగానే వుందని, సహాయక బృందాలకు కూడా ముప్పు పొంచి వుందని చెప్పారు. అన్ని వర్గాల నుండి తమకు సాయం అందాల్సి వుందని అధికారులు కోరారు.

ఈసారి అధిక వర్షాలే..

(మొదటిపేజీ తరువాయి)

పడతాయని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర ఆన్‌లైన్ పత్రికా సమావేశంలో తెలిపారు. కేరళకు అనుకున్న సమయంలో రుతుపవనాలు రావడానికి ప్రస్తుతం పరిస్థితులు సానుకూలంగా వున్నాయన్నారు. నాలుగు నెలల పాటు (జూన్ నుండి సెప్టెంబరు వరకు) సాగే వర్షాకాలంలో 106శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం వుందని అంచనా వేసినట్లు గత నెల్లో ఐఎండి తెలిపింది. సుదీర్ఘ కాల సగటు వర్షపాతం 87సెంటిమీటర్లు వుంది. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లు ప్రధానంగా వర్షపాతం మీదే ఆధారపడే వ్యవసాయం సాగించే ప్రాంతాలుగా వున్నాయి. జూన్‌లో (సుదీర్ఘకాల సగటు 166.9 మి.మీ.లో 92-108 శాతం) సాధారణ వర్షపాతం కురిసే అవకాశాలు వున్నాయని అంచనా వేసినట్లు మహాపాత్ర చెప్పారు.

రుతుపవనాల రాకకు అంతా సానుకూలం

మే 31 నాటికి కేరళకు నైరుతి రుతుపవనాలు చేరతాయని భావిస్తున్నారు. దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కన్నా అధికంగా, గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భావిస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఐదు రోజుల్లో కేరళకు రుతుపవనాలు వచ్చేందుకు పరిస్థితులన్నీ సానుకూలంగా వున్నాయని తెలిపారు. దేశంలో చాలా ప్రాంతాలు తీవ్రమైన వడగాడ్పులు, ఉష్ణోగ్రతలు, కరువు తరహా పరిస్థితులతో ఇబ్బందులు పడుతుండగా, సాధారణం కంటే అత్యధికంగా వర్షాలు కురుస్తాయనే అంచనాలతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే సాధారణ వర్షపాతం దేశమంతా ఒకే రీతిన వుంటుందని హామీ ఇవ్వలేమని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో వర్షాలు పడే తీరు కూడా మార్పులకు లోనవుతుంది. సాధారణ వర్షపాతం నమోదయ్యే రోజుల సంఖ్య తగ్గుతుండగా, మరోపక్క తక్కువ వ్యవధిలోనే భారీ వర్షాలు అంటే సాధారణం కన్నా చాలా అధికంగా వర్షాలు పడడం ఎక్కువవుతోందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ఈ పరిస్థితి బాగా పెరుగుతోంది. దీనివల్ల తరచుగా దుర్భిక్ష పరిస్థితులు నెలకొనవచ్చు లేదా వరదలకు దారి తీయవచ్చు.

52శాతం వ్యవసాయం వర్షాధారమే..

భారతదేశ వ్యవసాయ రంగానికి రుతుపవనాలు చాలా కీలకమైనవి. సాగు భూమిలో 52శాతం వర్షాధారమే. అలాగే తాగునీటికి కీలకమైన రిజర్వాయర్లు నిండడానికి, విద్యుత ఉత్పాదనకు కూడా ఇవి ముఖ్యమే.

కేంద్ర జల సంఘం అందచేసిన సమాచారం ప్రకారం, దేశంలో 150 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత వారంలో కేవలం 24శాతానికి చేరుకున్నాయి. దీనివల్ల చాలా రాష్ట్రాల్లో నీటి కొరత దారుణంగా ఏర్పడింది. జల విద్యుత్ ఉత్పాదన కూడా దెబ్బతింది. వ్యవసాయానికి జూన్,.జులైలు కీలకమైన మాసాలు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నాయని, ఆగస్టు, సెప్టెంబరుల్లో లానినా పరిస్థితులు నెలకొనవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1951-2023 కాలంలో డేటాను పరిశీలించినట్లైతే, లానినా తర్వాత ఎల్‌నినో ఏర్పడిన 9 సందర్భాల్లోనూ సాధారణం కంటే అధికంగానే వర్షపాతం నమోదైంది. 22 లానినా సంవత్సరాల్లో 20 సంవత్సరాల్లో సాధారణం లేదా సాధారణం కంటే అధికంగా వర్షాలు పడ్డాయి.

ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

వరుసలో ఉన్న వారికి ఓటేసేందుకు అధికారులు అనుమతించారు. వారి ఓటింగ్ పూర్తయితే పోలింగ్ శాతం మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు కచ్చితమైన సమాచారం తెలుస్తుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ 11 గంటల నుంచి ఊపందుకుంది. మొదటి రెండు గంటల్లో 11.34 శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తర్వాత వేగం పుంజుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు 29.30 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 49.53 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ అనంతరం భారీ బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్స్‌లను నల్లగొండలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డి పోటీ చేశారు. వారితో పాటు 39 మంది ఇండిపెండెంట్లతో కలిపి మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నిక ఫలితాన్ని జూన్ 5వ తేదీన వెల్లడించనున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్త హంగులు

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయాన్ని అందిస్తున్న ఆ శాఖను మరింత పటిష్ట పరచాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. రిజిస్ట్రేషన్లకు వచ్చేవారికి కూర్చోడానికి కనీసం కుర్చీలు కూడా లేకపోవడంతో చెట్ల కింద, నీడ దొరికిన చోట నిరీక్షిస్తున్నారనీ, ఇకపై ఆ పరిస్థితి ఉండకూడదని అన్నారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. "రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో 38 ఆఫీసులు మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. ఆదిలాబాద్‌లో బోథ్, మేడ్చల్ జిల్లా షామీర్ పేటలో కొత్తగా నిర్మించిన కార్యాలయాలు ఎన్నికల కోడ్ తర్వాత ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతా 104 ఆఫీసులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 52 చోట్ల ఆఫీసులకు అవసరమయ్యే భవనాల నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయించింది" అని సీఎంకు అధికారులు వివరించారు. భూములు సిద్ధంగా ఉన్న చోట వీలైనంత త్వరగా మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులను నిర్మించాలనీ, మిగతా 52 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడే స్థలాలను అన్వేషించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. పబ్లిక్ యుటిలిటీ కింద సేకరించిన స్థలాలు అందుబాటులో ఉంటే అక్కడే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

ఆదాయం వచ్చే ఆఫీసులపై ఫోకస్

ఆదాయం ఎక్కువగా తెచ్చిపెడుతున్న రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణాలకు మొదటి దశలో ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. అక్కడికి వచ్చే క్రయ విక్రయదారులు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసే వరకు మంచి ఆతిథ్యమిచ్చేలా సౌకర్యాలు ఉండాలనీ, వెయిటింగ్ హాల్, డ్రింకింగ్ వాటర్, కెఫేటేరియా లాంటి అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే చోట సిబ్బంది కొరత లేకుండా చూడాలనీ, ఆదాయం తక్కువగా ఉన్న జిల్లాల ఆఫీసుల నుంచి ఎక్కువ పని ఉన్న చోటికి సిబ్బందిని సర్దుబాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

భూముల ధరల పెంపుపై చర్చ

భూముల ధర పెంపుపై ఈ సందర్భంగా సీఎం అధికారులకు పలు సూచనలు చేసినట్టు సమాచారం. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భూములు, స్థిరాస్తుల ధరలు భారీగా పెరిగినా, అదే స్థాయిలో రెవెన్యూ ఆదాయం ఎందుకు పెరగడం లేదని అధికారులను ఆయన ప్రశ్నించారు.

"గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు పెద్దమొత్తంలో గండి పడుతున్నది" అని అధికారులు సీఎంకు వివరించారు. ఈ క్రమంలో నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉన్న నేపథ్యంలో తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్మెంట్లకు సంబంధించి వేటికి ఎంత సవరించాలనేదాన్ని శాస్త్రీయంగా నిర్ధారించి నిబంధనల ప్రకారం పెంచాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న స్టాంప్ డ్యూటీ విధానాన్ని కూడా అధ్యయనం చేయాలనీ, ఆదాయం పెరిగేలా ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని సీఎం సూచించారు.

ఎలా బాగుచేద్దాం?

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించారు. బ్యారేజీపై కుంగిన వంతెన, ఏడవ బ్లాక్‌లో దెబ్బతిన్న పిల్లర్లను పరిశీలించి, కుంగుబాటుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పునరుద్ధరణ పనుల సమయంలో గుర్తించిన బొరియలు, కుంగిన పిల్లర్స్, గేట్ల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పుటేజీలను సేకరించారు. మేడిగడ్డ బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఉన్న తాజా పరిస్థితులను పరిశీలించారు. బ్యారేజీలోని 15 నుంచి 21వ పిల్లర్లు, గేట్ల వద్ద ఇసుక మేటలను అధికారులు తొలగించి.. గేట్ల మరమ్మతులను పరిశీలించారు. 20,21వ పిల్లర్ల మధ్యలో యంత్రాల ద్వారా కౌంటింగ్ పనులు చేస్తున్నారు. భూగర్భంలో ఎంతవరకు ఇసుక నిల్వలు ఉన్నాయో ఈ కౌంటింగ్ ద్వారా తెలుస్తుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. బ్యారేజీ దిగువన నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా సీసీ బ్లాక్‌లో పనులు జరుగుతున్నాయి. బ్యారేజీ పిల్లర్ల దిగువన ఉన్న స్ట్రీమ్ వాల్ కొట్టుకుపోకుండా ఉండేందుకు డ్రిల్లింగ్ చేసి కాపర్ షీట్లను భూమిలోకి పంపుతున్నారు. సీట్ల వెనుక భాగంలో సీసీ పనులను చేస్తున్నారు. ఉబికి వస్తున్న నీటిని భారీ యంత్రాల సహాయంతో తోడేస్తున్నారు. వర్షాకాలం సీజన్ మొదలు కాకముందే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్‌డీఎస్‌ఏ అధికారులు ఇంజినీరింగ్ అధికారులకు, నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ అధికారులకు సూచించారు. వారి వెంట నిపుణులు నాగేందర్, మోహన్, రామగుండం సీఈ సుధాకర్ రెడ్డి మేడిగడ్డ ఈఈ తిరుపతిరావు, డీఈలు, ఏఈలు, ఎల్అండ్ఎస్ సంస్థ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

జూన్ రెండున కార్నివాల్



(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. అదే రోజు శిక్షణ పొందిన ఐదు వేల మంది పోలీసు అధికారులు బ్యాండ్ ప్రదర్శనలో పాల్గొంటారని ఆమె తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై దాదాపు 80 రకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. హస్త కళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వస్తువులతోపాటు నగరంలో పేరొందిన హోటళ్ల ద్వారా ఫుడ్ స్టాళ్లను కూడా ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రావతరణ దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ రెండున ఉదయం గన్‌పార్కులోని అమరవీరుల స్థూపానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని వివరించారు. ఆ సందర్భంగా సీఎం...రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. అదేరోజు రాత్రి ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే వేడుకలకు హాజరయ్యే పౌరులు, పిల్లల కోసం పలు క్రీడలతో కూడిన వినోదశాలలను కూడా ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఆకర్షణీయమైన బాణాసంచా ప్రదర్శనతోపాటు లేజర్ షో కూడా ఉంటుందని వెల్లడించారు. వీటిని తిలకించేందుకు విచ్చేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలంటూ సీఎస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రావతరణ ఉత్సవాల సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిశోర్, శైలజా రామయ్యార్, శ్రీనివాసరాజు, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇక సిసలైన ధనాధన్!

వేసవిలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) హంగామా ముగిసింది. ఇక అసలైన ధనాధన్ సమరానికి రంగం సిద్ధమైంది. ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్ జూన్ 2 నుంచి ఆరంభం కానుంది. వార్మప్ మ్యాచులు సోమవారమే షురూ కాగా.. తొలిసారి టీ20 వరల్డ్‌కప్‌లో ఏకంగా 20 జట్లు పోటీపడుతున్నాయి. 2007 ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ విజయం సాధించిన టీమ్ ఇండియా.. మళ్లీ పొట్టి కప్పు అందుకునేందుకు అమెరికాలో అడుగుపెట్టింది. ఇంగ్లాండ్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతుంది. మరో వారంలో ఆరంభం కానున్న పొట్టి ప్రపంచకప్ పోరు గురించి వివరాలు..

- జూన్ 2 నుంచి టీ20 ప్రపంచకప్
- తొలిసారి టైటిల్ వేటలో 20 జట్లు

సోమవారం నుంచే వార్మప్ మ్యాచులు షురూ



ICC MEN'S T20 WORLD CUP WEST INDIES & USA 2024

నవతెలంగాణ క్రీడావిభాగం

టీ20 ప్రపంచకప్ షెడ్యూల్

2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ జూన్ 2 (స్థానిక కాలమానం ప్రకారం జూన్ 1)న ఆరంభం కానుంది. సుమారు నెల రోజుల పాటే టోర్నమెంట్ టైటిల్ పోరు జూన్ 29న షెడ్యూల్ చేశారు. టీ20 ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్ డల్లాస్‌లోని గ్రాండ్ ప్రైరీ స్టేడియంలో జరుగనుంది. టైటిల్ పోరుకు బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్ ఆతిథ్యం ఇవ్వనుంది. టీమ్ ఇండియా తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో తలపడనుంది. గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో కెనడాతో ఆడనుంది.

ఎక్కడ జరుగుతుంది?

ఓ ఐసీసీ టోర్నమెంట్‌కు తొలిసారి అమెరికా సంయుక్త రాష్ట్రాలు (యుఎస్‌ఏ) ఆతిథ్యం ఇవ్వనుంది. వెస్టిండీస్‌తో కలిసి యుఎస్‌ఏ సంయుక్తంగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తుంది. గతంలో వెస్టిండీస్‌లో రెండుసార్లు ఐసీసీ టోర్నమెంట్లు నిర్వహించారు. 2007 వన్డే వరల్డ్‌కప్, 2020 టీ20 ప్రపంచకప్‌కు వెస్టిండీస్ ఆతిథ్యం ఇచ్చింది. ఇప్పుడు మూడోసారి ఐసీసీ టోర్నీకి వేదిక కానుంది. రెండు సార్లు మహిళల టీ20 ప్రపంచకప్‌కు సైతం కరీబియన్ దీవులు వేదికయ్యాయి. ఇక ప్రపంచకప్ మ్యాచులు తొమ్మిది మైదానాల్లో జరుగనున్నాయి. డల్లాస్, బ్రిడ్జ్‌టౌన్‌తో పాటు ప్రావిడెన్స్, న్యూయార్క్, లాడర్‌హిల్, నార్త్ సౌండ్, గ్రాస్ ఐలెట్, కింగ్స్‌టౌన్, తరౌబాలు ప్రపంచకప్ వేదికలుగా నిలువనున్నాయి.



పోటీపడుతున్న జట్లు

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి ఏకంగా 20 జట్లు పోటీపడుతున్నాయి. ఆతిథ్య దేశాలు అమెరికా, వెస్టిండీస్ సహా 2022 టీ20 ప్రపంచకప్‌లో టాప్-8లో నిలిచిన జట్లు నేరుగా అర్హత సాధించాయి. ఇంగ్లాండ్, పాకిస్థాన్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్‌లు ఆటోమెటిక్ అర్హత ప్రక్రియలో వచ్చాయి. యూరోపియన్ క్వాలిఫయర్ నుంచి ఐర్లాండ్, స్కాట్లాండ్.. అమెరికాస్ క్వాలిఫయర్ నుంచి కెనడా.. ఆసియా క్వాలిఫయర్ నుంచి నేపాల్, ఓమన్... ఆఫ్రికా క్వాలిఫయర్ నుంచి నమీబియా, ఉగాండా.. ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ నుంచి పాపావా న్యూగినీ అర్హత సాధించాయి.

ప్రపంచకప్ పోటీ ఫార్మాట్

ప్రపపంచకప్‌లో పోటీపడుతున్న 20 జట్లు తొలుత ఐదు గ్రూపులుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్‌లో ఐదు జట్లు ఉంటాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు నాలుగు మ్యాచుల్లో పోటీపడాల్సి ఉంటుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2లో నిలిచిన జట్లు సూపర్ ఎయిట్ దశకు చేరుకుంటాయి. ఇక్కడ మళ్లీ ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్‌లో ఒక్కో జట్టు మూడు మ్యాచులు ఆడాల్సి ఉంటుంది. టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. గ్రూప్-ఏలో కెనడా, ఐర్లాండ్, భారత్, పాకిస్థాన్, యుఎస్‌ఏలు ఉన్నాయి. గ్రూప్-బిలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నమీబియా, ఓమన్, స్కాట్లాండ్.. గ్రూప్-సిలో అఫ్గనిస్థాన్, న్యూజిలాండ్, పాపావా న్యూగినీ, ఉగాండా, వెస్టిండీస్... గ్రూప్-డిలో బంగ్లాదేశ్, నేపాల్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, శ్రీలంకలు చోటుచేసుకున్నాయి.

వర్షం పడితే రిజర్వ్ డే ఉందా?

ప్రపంచకప్‌లో ఏ మ్యాచ్ టైగా ముగిసినా.. ఫలితం తేల్చేందుకు సూపర్ ఓవర్ ఆడిస్తారు. సూపర్ ఓవర్ టై అయినా.. ఫలితం వచ్చే వరకు మళ్లీ ఆడిస్తారు. ఇక గ్రూప్ దశలో, సూపర్ ఎయిట్ దశలో వర్షం అంతరాయం కలిగిస్తే మ్యాచ్ ఫలితం తేల్చేందుకు ఇరు జట్లు కనీసం ఐదు ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. లేదంటే.. ఇరు జట్లు పాయింట్లు సమంగా పంచుకుంటాయి. నాకౌట్ దశలో మ్యాచ్ ఫలితం తేల్చేందుకు కనీసం ఇరు జట్లు కనీసం 10 ఓవర్ల పాటు ఆడాల్సి ఉంటుంది. ఇక గ్రూప్ దశ, సూపర్ ఎయిట్ మ్యాచులకు రిజర్వ్ డే లేదు. నాకౌట్ దశలోనూ కేవలం తొలి సెమీఫైనల్స్‌కు రిజర్వ్ డే కేటాయించారు. ఫైనల్స్‌కు, రెండో సెమీఫైనల్‌కు ఒక్క రోజే విరామం ఉండటంతో రెండో సెమీస్‌కు రిజర్వ్ డే ఇవ్వలేదు. డ్రా ప్రకారం భారత్ సెమీఫైనల్స్‌కు చేరుకుంటే రెండో సెమీస్‌లో తలపడనుంది. తొలి సెమీస్‌కు మ్యాచ్ రోజు ఫలితం తేల్చేందుకు అదనంగా 190 నిమిషాల సమయం కేటాయించగా.. రెండో సెమీఫైనల్‌కు 250 నిమిషాల సమయం కేటాయించారు. రెండో సెమీస్‌లో వాతావరణ అంతరాయంతో మ్యాచ్ నిలిచిపోతే ఫలితం తేల్చేందుకు మ్యాచ్ రెగ్యులర్ షెడ్యూల్ సమయాని కంటే అదనంగా నాలుగు గంటలకు పైగా వేచి చూస్తారు.

చాంపియన్లుగా నిలిచిన జట్లు

ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఏడు జట్లు టైటిల్ అందుకున్నాయి. తొలి టీ20 ప్రపంచకప్ (2007)లో టీమ్ ఇండియా విజయం సాధించింది. కానీ ఆ తర్వాత మళ్లీ టైటిల్ అందుకోలేదు. వెస్టిండీస్, ఇంగ్లాండ్ మాత్రమే రెండేసి సార్లు పొట్టి ప్రపంచకప్ చాంపియన్లుగా నిలిచాయి. ఇంగ్లాండ్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతుంది. టీ20 ప్రపంచకప్ మాజీ చాంపియన్లు.. భారత్ (2007), పాకిస్థాన్ (2009), ఇంగ్లాండ్ (2010), వెస్టిండీస్ (2012), శ్రీలంక (2014), వెస్టిండీస్ (2016), ఆస్ట్రేలియా (2021), ఇంగ్లాండ్ (2022).





ఐపీఎల్ 17వ సీజన్ ఉత్తమ స్టేడియం ఉప్పల్!

అవార్డుతో పాటు రూ.50 లక్షల నజరానా

నవతెలంగాణ-హైదరాబాద్ :
ఏడు మ్యాచులు. ఆరు మ్యాచుల్లో ఫలితం. ఐదింట హైదరాబాద్ ఎదురులేని విజయాలు. నాలుగు మ్యాచుల్లో 200 ప్లస్ స్కోర్లు. అందులో ముంబయి ఇండియన్స్ రికార్డు 277 పరుగుల అత్యధిక స్కోరు. ఇదీ ఐపీఎల్ 17వ సీజన్ ఉప్పల్ స్టేడియం నమోదైన గణాంకాలు. పుట్‌బాల్ సంస్కృతి తరహాలో ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు అద్భుత అభిమాన నీరాజనం. పవర్‌హిట్టింగ్ సన్‌రైజర్స్ మ్యాచ్ అనుభూతి ఆస్వాదించేందుకు అత్యంత సుందరమైన స్టేడియం. దీంతో సహజంగానే ఐపీఎల్ 17వ సీజన్‌లో ఉత్తమ పిచ్, గ్రౌండ్ అవార్డు ఉప్పల్ స్టేడియాన్ని వరించింది. ఆదివారం చెపాక్‌లో జరిగిన టైటిల్ పోరు అనంతరం బీసీసీఐ పలు అవార్డులు అందజేసింది. అందులో సీజన్ ఉత్తమ పిచ్, గ్రౌండ్ విభాగంలో హైదరాబాద్‌కు అవార్డుతో పాటు రూ.50 లక్షల నగదు బహుమతి దక్కింది. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు చాముండేశ్వరినాథ్ చేతుల మీదుగా హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అవార్డు, ప్రైజ్‌మనీ అందుకున్నారు. 'క్యూరేటర్ చంద్రశేఖర్, గ్రౌండ్ సిబ్బంది అద్భుతంగా పని చేశారు. ఐపీఎల్ మ్యాచులకు ప్రపంచ శ్రేణి పిచ్‌లను అందించారు. హెచ్‌సీఏ సభ్యులు అందరి పడిన కష్టానికి ప్రతిఫలం ఈ పురస్కారం' అని జగన్ అన్నారు.

క్యూరేటర్, గ్రౌండ్స్‌మెన్‌కు రూ.25 లక్షలు

క్యూరేటర్లు, మైదాన సిబ్బందికి నగదు బహుమతి అందించే సంప్రదాయాన్ని బీసీసీఐ కొనసాగించింది. రెండు నెలల పాటు కఠోరంగా శ్రమిస్తూ ఐపీఎల్ మ్యాచులకు పిచ్‌ల రూపకల్పన, గ్రౌండ్‌ను సిద్ధం చేయటంలో రాజీలేని శ్రమపడిన క్యూరేటర్లు, గ్రౌండ్స్‌మెన్‌కు రూ. 25 లక్షల చొప్పున ప్రకటించారు. ఐపీఎల్ పది వేదికలతో పాటు ధర్మశాల, ముల్లాన్‌పూర్, గువహటి వేదికల క్యూరేటర్లు, మైదాన సిబ్బందికి తలా రూ.25 లక్షల ప్రోత్సాహకాన్ని బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించారు.

స్పెయిన్‌బుల్‌కు షాక్

కంచుకోటలో తొలి రౌండ్లోనే ఓటమి



పారిస్ (ఫ్రాన్స్) : ఫ్రెంచ్ ఓపెన్‌లో 14 సార్లు చాంపియన్, దిగ్గజం స్పెయిన్ బుల్‌కు దిమ్మతిరిగే షాక్ తగిలింది. కంచుకోట రొలాండ్ గారోస్‌లో మెన్స్ సింగిల్స్ తొలి రౌండ్లోనే నాదల్ ఓటమి పాలయ్యాడు. నాల్గో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 7-6(7-5), 6-3తో వరుస సెట్లలో నాదల్‌పై మెరుపు విజయం సాధించాడు. ఫిట్‌నెస్ కోల్పోయిన నాదల్ ఫ్రెంచ్ ఓపెన్‌లో రీ ఎంట్రీ ఇచ్చాడు. జ్వెరెవ్ ఆరు బ్రేక్ పాయింట్లతో మెరువగా.. నాదల్ రెండు బ్రేక్ పాయింట్లే సాధించాడు. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వైటెక్ 6-1, 6-2తో లియోలియను చిత్తు చేసింది.కొకొ గాఫ్ సైతం జులియపై 6-1,6-1తో వరుస సెట్లలో అలవోక విజయం సాధించింది.

నవచిత్రం

కథలో కీ రోల్ చేశా..



ఐశ్వర్య మీనన్

'స్పై' సినిమాలో స్టైలిష్ యాక్షన్‌తో ఆకట్టుకున్న హీరోయిన్ ఐశ్వర్య మీనన్. అందుకు పూర్తి కాంట్రాస్ట్ క్యారెక్టర్‌లో 'భజే వాయు వేగం'లో కనిపించనుంది. కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ నిర్మిస్తోంది. హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషించాడు. ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ప్రశాంత్ రెడ్డి రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 31న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఐశ్వర్య మీనన్ మీడియాతో సంభాషించింది.

■ ఈ సినిమాలో ఇందు అనే క్యారెక్టర్ చేశాను. ఆమె బ్యూటీషియన్. బ్యూటీషియన్ అంటే సహజంగానే అందంగా ఉంటుంది. ఈ సినిమాలో హీరో పేరు వెంకట్. ఆయన పర్సెప్షన్‌లోనే సినిమా అంతా వెళ్తుంది. కథలో నేను కీలకమైన పాత్రగా ఉంటాను. వెంకట్ కోసం ఈ అమ్మాయి ఏదైనా చేస్తుంది. అంతగా అతన్ని ఇష్టపడుతుంది. ఇదొక రా కంటెంట్ మూవీ. యాక్షన్, ఎమోషన్ ఆకట్టుకుంటాయి.

■ ఇందులో ట్రెడిషనల్ క్యారెక్టర్‌లో కనిపిస్తా. చీరకట్టు లేదా ట్రెడిషనల్ దుస్తులు వేసుకుంటా. నాకు ఇలాంటి క్యారెక్టర్స్ చేయడం ఇష్టం ఎందుకంటే రియల్ లైఫ్‌లో కూడా ట్రెడిషనల్ దుస్తులు ధరించేందుకు ఇష్టపడుతుంటా. 'స్పై' సినిమాలో మోడరన్ డ్రెసెస్, స్టైలిష్ యాక్షన్ ఎపిసోడ్స్ చేశా.

■ ఈ సినిమాలో నా పాత్ర ఆ క్యారెక్టర్‌కు పూర్తి భిన్నంగా ఉంటుంది. కార్తికేయతో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. యూవీ క్రియేషన్స్ లాంటి పేరున్న సంస్థలో హీరోయిన్‌గా సినిమా చేయడం గర్వంగా ఉంది. దర్శకుడు ప్రశాంత్ గెస్ సినిమా మీద క్లారిటీ ఉన్న డైరెక్టర్. ప్రశాంత్ ప్రతిభని థియేటర్‌లో మీరంతా చూస్తారు.

400కి పైగా థియేటర్లలో రిలీజ్



వంశీ కారుమంచి

ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన 'గం..గం..గణేశా' సినిమాతో నిర్మాతగా నిర్మాత వంశీ కారుమంచి టాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నారు. హైలైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో తన స్నేహితుడు కేదార్ సెలగంశెట్టితో కలిసి ఆయన ఈ సినిమాను నిర్మించారు. యాక్షన్ క్రైమ్ కామెడీ మూవీగా దర్శకుడు ఉదయ్ శెట్టి రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 31న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత వంశీ కారుమంచి మీడియాతో ముచ్చటించారు.
'దర్శకుడు ఉదయ్ శెట్టి చెప్పిన కథ ఆనంద్‌కు బాగుంటుంది అనిపించింది. ఆనంద్‌ది కొంత ఆకతాయిగా, జులాయిగా ఉండే పాత్ర. గణేష్ విగ్రహం, డబ్బుతో ముడిపడిన యాక్షన్ కామెడీ సినిమా ఇది. మన స్నేహితుల్లో ఎవరో ఒకరు మనల్ని ప్రాబ్లమ్స్‌లో ఇరికిస్తుంటారు. అలాంటి సందర్భాల్లో జనరేట్ అయ్యే కామెడీతోపాటు జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ మిమ్మల్ని బాగా నవ్విస్తాడు. హీరోయిన్స్ నయన్ సారిక, ప్రగతి శ్రీవాస్తవ మంచి పర్ఫార్మెన్స్ చేశారు. బేబి సినిమా సక్సెస్ తర్వాత మేమీ సినిమాను రిలీజ్‌కు తీసుకురావడం అడ్వాంటేజ్ అయ్యింది. నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్, ఏపీ కర్ణాటకలో ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా రిలీజ్ చేస్తున్నాం. 400కు పైగా థియేటర్స్ దొరికాయి. అమెజాన్ ప్రైమ్‌తో ఓటీటీ డీల్ చేసుకున్నాం. నా అభిమాన నటుడు బాలకృష్ణతో సినిమా నిర్మించే అవకాశం వస్తే అదొక వరంలా భావిస్తా. మరో రెండు కథల్ని ఫైనల్ చేశాం' అని తెలిపారు.

సర్‌ప్రైజ్ చేసే బుజ్జి



నేహా శెట్టి

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి సహ నిర్మాతలు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటించారు. ఈనెల 31వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నాయిక నేహా శెట్టి చిత్ర విశేషాలను మీడియాతో షేర్ చేసుకున్నారు.

- ఇందులో నేను బుజ్జి పాత్రలో కనిపిస్తాను. 90లలో ధనవంతుల కుటుంబానికి చెందిన పల్లెటూరి అమ్మాయి పాత్ర. అందంగా కనిపిస్తూనే, ధృడంగా ఉండే పాత్ర. నా పాత్రకి సంబంధించి ఆశ్చర్యకర విషయాలు ఉంటాయి. బుజ్జి అనేది సినిమాలో బలమైన పాత్రలలో ఒకటి. ఒకమ్మాయిలో ఎన్ని భావోద్వేగాలు ఉంటాయో అవన్నీ ఇందులో చూడొచ్చు.
- స్క్రిప్ట్ భిన్నంగా ఉంటుంది. 90లలో రత్న అనే పాత్రతో పాటు రత్నమాల, బుజ్జి పాత్రల చుట్టూ కథ తిరుగుతుంది. ఇది ఒక జీవిత కథ. ప్రచార చిత్రాలు చూసి యాక్షన్ మాత్రమే ఎక్కువ ఉంటుంది అనుకోవద్దు. రొమాన్స్, కామెడీ, డ్రామా అన్నీ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా సినిమా ఉంటుంది.
- నా పాత్ర తీరు తెన్నెల కోసం డైరెక్టర్ కృష్ణచైతన్య నాకు శోభనని రిఫరెన్స్‌గా చూపించారు. చీరకట్టు, జుట్టు, కళ్ళ కాటుక ఇలా ప్రతి దాని మీద ఎంతో శ్రద్ధ పెట్టాం. ఈ బుజ్జి పాత్ర నాకు ఎంతగానో పేరు తెచ్చి పెడుతుంది.విశ్వక్ సేన్‌తో కలిసి నటించడం ఆనందంగా ఉంది. అంజలి, మా కాంబినేషన్‌లో ఎక్కువగా సన్నివేశాలు లేవు. బెల్లంకొండ శ్రీనివాస్‌తో ఒక సినిమా చేయబోతున్నాను. త్వరలోనే ప్రారంభమవుతుంది.



తెలుగు చిత్ర సీమకు శుభపరిణామం

సక్సెస్ ఫుల్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అపర్ణ కన్స్ట్రక్షన్స్ సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. ప్రేక్షకులకు లార్జర్ దేన్ లైఫ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా మోడరన్ టెక్నాలజీ, అద్భుతమైన యాంబియన్స్, వరల్డ్ క్లాస్ ప్రొజెక్షన్, సౌండ్ సిస్టమ్, సిట్టింగ్, లగ్జరీ సదుపాయలతో అపర్ణ సినిమాస్ మల్టీప్లెక్స్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేసింది. ఘనంగా జరిగిన ఈవెంట్‌లో అపర్ణ సినిమాస్ లోగోని లాంచ్ చేశారు.
అపర్ణ కన్స్ట్రక్షన్, ఆపరేషన్స్ హెడ్ రామకృష్ణ మాట్లాడుతూ,'సినిమాతో పాటు మంచి ఫుడ్‌ని కూడా ఆస్వాదించే ఏర్పాటు చేశాం. అపర్ణ సినిమాస్ ప్రేక్షకులు గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచుతుంది' అని చెప్పారు. 'ఇందులో ది బెస్ట్ సౌండ్ సిస్టమ్ సిట్టింగ్ ప్రొజెక్షన్ ఉంది. సినిమాస్‌లో ది బెస్ట్‌గా ఉండేలా అద్భుతంగా నిర్మించారు. ఈనెల 31 నుంచి అందరికీ అందుబాటులోకి వస్తుంది. ఇది తెలుగు చిత్ర పరిశ్రమకు శుభ పరిణామం' అని నిర్మాత ఎన్వీ ప్రసాద్ చెప్పారు.

వాస్తవ ఘటన స్ఫూర్తితో రక్షణ



పాయల్ రాజ్‌పుత్

'ఆర్‌ఎక్స్ 100', 'మంగళవారం' వంటి సినిమాలతో తనదైన గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్. ఆమె ఇప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా పవర్‌ఫుల్ ఇన్వెస్టిగేటివ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'రక్షణ'. రోషన్, మానస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.
సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా హరిప్రియ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రణదీప్ ఠాకూర్ దర్శకత్వం వహిస్తూ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రాన్ని జూన్ 7న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత ప్రణదీప్ ఠాకూర్ మాట్లాడుతూ, "రక్షణ' టీజర్‌కు చాలా మంచి స్పందన వస్తుంది. ఇదొక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామా. పాయిల్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఒక పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన ఘటన స్ఫూర్తితో రాసిన కథతో సినిమా తెరకెక్కింది. ఏ దశలోనూ రాజీ పడకుండా ఉన్నత నిర్మాణ విలువలతో సినిమాను నిర్మించాం. ఈ సీట్ ఎడ్జ్ క్రైమ్ థ్రిల్లర్‌ను జూన్ 7న విడుదల చేస్తున్నాం' అని అన్నారు.
రాజీవ్ కనకాల, వినోద్ బాల, శివన్నారాయణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు: ప్రణదీప్ ఠాకూర్, నిర్మాత: ప్రణదీప్ ఠాకూర్, ఛాయాగ్రహణం: అనిల్ బండారి, సంగీతం: మహతి సాగర్, సౌండ్ డిజైనర్: జె.ఆర్. ఎతిరాజ్, ఎడిటర్: గ్యారి బి హెచ్, స్టంట్స్: వెంకట్ మాస్టర్, ప్రొడక్షన్ డిజైన్: రాజీవ్ నాయర్, రైటర్: తయనిధి శివకుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: ప్రకాష్ జోసెఫ్, రమేష్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: శరద్ వాఘే.

8 భాషల్లో మిషన్ సి1000



ఎస్ వి క్రియేషన్ పతాకంపై తేజేశ్వర్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిషన్ సి 1000'. పాన్ ఇండియా సినిమాగా 8 భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రంలోని మెలోడీ సాంగ్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నిర్మాత, తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు ఆవిష్కరించారు.
తేజేశ్వర్, ప్రగ్యా నయన్ హీరో, హీరోయిన్లుగా నటించారు. శ్రీధర్ ఆత్రేయ సంగీతం సమకూర్చారు. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ విన్ని అందించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తిచేసి త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అని దర్శకుడు తేజేశ్వర్ తెలిపారు. కబీర్ దుహన్ సింగ్, జయప్రకాష్, సుధ, అనిష్ కురువిల్లా, కాళిచరణ్ మహారాజ్, సంజయ్ పాండే నటిస్తున్నారు.
ఈ చిత్రానికి పాటలు : మసాదే లక్ష్మి నారాయణ, జేవిపి, విశ్వనాథ్ శ్రీనివాస్, ప్రసాద్ సానా, సింగర్: వైశాలి మహదే, సినిమాటోగ్రఫీ: మహేందర్‌ఎస్, కొరియోగ్రఫి: గణేష్ స్వామి, ఫైట్స్ స్టంట్ జాషువా, ఎడిటర్: మార్తాండ్ కె.వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: డాక్టర్ ఈలసాగరం ప్రభాకర్, వి.రేవంత్, గండికోట శ్రీనివాస్, టి .మహీంద్రా, టి శివ, ఎమ్ జగదీశ్వర్, ఆర్ సుశీల్, జె.మధు, నిర్మాతలు: శ్రీమతి కిరణ్మయి,విరాట్ శౌర్య.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.